www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం నంద్యాలలో దీక్షాశిబిరం ఎదుట పొర్లు దండాలతో అంగన్వాడీల నిరసన

బెదిరింపుల పర్వం

5వ తేదీలోగా విధుల్లో చేరకుంటే చర్యలు

అంగన్వాడీలకు ప్రభుత్వం అల్టిమేటం 12

నేడు కలెక్టరేట్ల ముట్టడికి యూనియన్ల పిలుపు

ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటా!

అడుగు ముందుకువేస్తే కాళ్లు విరగ్గొడతా

సమ్మె ముగిశాక ఉద్యోగం ఎట్లా చేస్తారో చూస్తా

పారిశుధ్య కార్మికులపై మహిళా అధికారి వీరంగం

బుధవారం | 3-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 259 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 7.49 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తర మ. 2.47 తదుపరి హస్త; వర్జ్యం: రా. 12.09-1.56; దుర్ముహూర్తం: ఉ. 11.58-12.42; అమృతఘడియలు: తె. ఉ. 8.28; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.50 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఇడుపులపాయలో తండ్రి సమాధి వద్ద కొడుకు, కాబోయే కోడలితో షర్మిల. చిత్రంలో తల్లి విజయలక్ష్మి

రేపే కాంగ్రెస్‌లోకి

రాహుల్, ఖర్గే సమక్షంలో చేరనున్న షర్మిల

పార్టీ ముఖ్యులతో భేటీ.. కాంగ్రెస్‌లో చేరికపై స్పష్టత

తనకు ఏఐసీసీలో చోటు, ఏపీ బాధ్యతలు ఇస్తారని వెల్లడి

తెలంగాణలో మేం పోటీచేయనందునే కాంగ్రెస్‌కు అధికారం

మా త్యాగానికి విలువిచ్చి కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానం

ఆ పార్టీతో పనిచేయాలని ఇదివరకే నిర్ణయించాం

ఇడుపులపాయలో వైఎస్ షర్మిల వెల్లడి

వైఎస్ సమాధి వద్ద కొడుకు పెళ్లి పత్రిక ఉంచి ఆశీర్వాదం

అన్నా.. మేనల్లుడి పెళ్లికి రా!

కొడుకు వివాహానికి జగన్‌ను ఆహ్వానించనున్న షర్మిల

నేడు తాడేపల్లిలో భేటీ.. ఆ వెంటనే గన్నవరం నుంచి ఢిల్లీకి

వేంపల్లె/హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ రాజశేఖ ర్‌రెడ్డి కుమార్తె, ముఖ్యమంత్రి జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిక ఖరారైంది. గురువారం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల సమక్షంలో ఆమె ఆ పార్టీలో చేరను న్నారు. వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటిస్తారు. ఇందుకోసం ఆమె బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. వైఎస్ఆర్‌టీపీ ముఖ్యనాయకులు వాడుక రాజగోపాల్, తూడి దేవేందర్‌రెడ్డి, పిట్టా రాంరెడ్డి తదితరులూ ఆమెతో వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు.. షర్మిల మంగళవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో

మిగతా 11వ పేజీలో...

నో టికెట్..



గుడివాడ అమర్నాథ్ | గోరంట్ల మాధవ్ | మల్లాది విష్ణు | గొల్ల బాబూరావు

మార్పులు.. మంటలు



మరో 24 మంది వైసీపీ సిట్టింగ్‌లు అవుట్!

మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై జగన్ వేటు!

ఎంపీ గోరంట్ల మాధవ్‌కు మొండిచేయి

గొల్ల బాబూరావు, మల్లాది విష్ణుకు కూడా

వైసీపీ ఇన్‌చార్జుల రెండో జాబితా విడుదల

రాజమండ్రి రూరల్‌కు మంత్రి చెల్లుబోయిన

రాజాం నుంచి పాయకరావుపేటకు జోగులు

ఐదు చోట్ల వారసులకు అవకాశం

తిరుపతి, చంద్రగిరి, మచిలీపట్నం, గుంటూరు తూర్పు, రామచంద్రపురంలో..

పోలవరంలో ఎమ్మెల్యే బాలరాజు భార్యకు..

అరకు ఎంపీ మాధవి ఈసారి అసెంబ్లీకి

వెలంపల్లి విజయవాడ సెంట్రల్‌కు బదిలీ

వైసీపీలో చేరిన బళ్లారి శ్రీరాములు సోదరి

ఆ వెంటనే హిందూపురం లోక్‌సభ టికెట్!

ఇన్‌చార్జుల మార్పుపై ఆగ్రహజ్వాలలు

కడదాకా మంతనాలు.. పలువురు ఎమ్మెల్యేలకు తాడేపల్లి పిలుపు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇన్‌చార్జుల నియా మకం.. ఆ పార్టీ ఎమ్మె ల్యేల్లో ఆగ్రహజ్వాలలు రేపుతోంది. గ్రాఫ్ పడిపో యిందని.. ప్రజావ్యతిరే కత తీవ్రంగా ఉందంటూ సీఎం జగ న్మోహన్‌రెడ్డి తమకు మొండిచేయి చూప డంపై వారు మండిప డుతున్నారు. రెండో జాబితాలో ఆయన మరో 24 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చే శారు. అనకాపల్లి

మిగతా 11వ పేజీలో...

వైసీపీకి దాడి ఫ్యామిలీ

రాజీనామా



కుమారులతో కలసి నేడు బాబు సమక్షంలో టీడీపీలోకి వీరభద్రరావు

అనకాపల్లిలో అధికార పార్టీకి భారీ దెబ్బ 11

ప్రజల్లో ఉన్న మాపై **వ్యతిరేకతా?**

కోట దాటని జగన్‌పై **అభిమానమా?**

జనం బాధలు తెలుసుకునే ప్రయత్నం మాది

ఓట్లను కొనే కమర్షియల్ రాజకీయం ఆయనది

కార్పొరేట్ రాజకీయంతో వ్యవస్థలు ధ్వంసం

సీఎంపై వైసీపీ ప్రజాప్రతినిధుల ఆగ్రహం

విజయసాయిరెడ్డి బావమరిది ద్వారకానాథరెడ్డి నేడు టీడీపీలోకి

బడుగులే బలి!

తప్పు జగన్‌ది.. శిక్ష ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు

నిధులివ్వరు.. అభివృద్ధి చేయరు

కానీ ప్రజావ్యతిరేకత అంటూ సీటు కట్

దళిత, గిరిజన ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి

ఇప్పటికే పూతలపట్టు, సత్యవేడులో కాక

మంత్రి విశ్వరూప్ కుటుంబంలో టికెట్ చిచ్చు

మంత్రులు నాగార్జున, సురేశ్ బదిలీ

సంతనూతలపాడులో సుధాకరబాబుకు నో

దళితుడిగా పుట్టడమే తప్పా?




వైసీపీలో దళితులకు తీవ్ర అన్యాయం

పనితీరు బాగాలేదని మార్చేస్తున్నారు

వ్యతిరేకత ఉన్నా అగ్రకులాల జోలికెళ్లడం లేదు

ఐప్యాక్‌కు డబ్బులిస్తే సర్వే ఫలితాలు మార్చేస్తారు

అధిష్ఠానంపై ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం



రా.. కదలిరా!

టీడీపీ రణన్నినాదం

ఆ పేరుతోనే 12 రోజుల్లో 22చోట్ల సభలు

సభల నిర్వహణకు నేతల పోటీ

సభల లోగోలో జనసేనకు చోటు

వైసీపీ నేతలు వచ్చేస్తామంటున్నారు: అచ్చెన్న

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'రా.. కద లిరా!' అన్న పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించాలని ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నిర్ణయిం చింది. పార్టీని స్థాపించిన సమయంలో దివంగత ఎన్టీ రామారావు 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా' అని ఇచ్చిన నినాదానికి అశేష తెలుగు ప్రజానీకం మంత్రముగ్ధులయ్యారు. టీడీపీని అక్కున చేర్చుకు న్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఆ నినాదాన్ని పేరుగా మార్చుకుని ఎన్నికల రణరంగంలోకి దిగాలని టీడీపీ నిర్ణయించింది. 'రా.. కదలిరా' పేరుతో ఈ నెలలో 12 రోజుల్లో మొత్తం 22 సభలు నిర్వహించాలని ఆ పార్టీ తలపెట్టింది. 22 లోక్‌సభ స్థానాల పరిధిలో ఒక్కొక్క చోట ఒక్కొక్క సభను నిర్వహించనున్నారు. మిగిలిన 3 లోక్‌సభ స్థానాల పరిధిలో ఎక్కడ నిర్వహించేదీ త్వరలోనే నిర్ణయించనున్నారు. 'రా.. కదలిరా'! సభలపై మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. "రా.. కదలిరా! సభల్లో పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొంటారు. తొలి సభ ఈ నెల 5న ఒంగోలు లోక్‌సభ స్థానం పరిధిలోని కని గిరిలో జరగనుంది. ఈ నెల 18న పార్టీ వ్యవస్థాప కుడు ఎన్టీఆర్ వర్ధంతిని గుడివాడలో ఘనంగా నిర్వ హించనున్నాం. ఈ రెండు రోజులు మినహా మిగిలిన రోజుల్లో రోజుకు 2 చొప్పున సభలు జరగనున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సభలకు

మిగతా 11వ పేజీలో...

పింఛన్లపై అవే పిట్టకథలు!



పదేపదే పరనింద.. అంతే లేని అబద్ధాలు

చంద్రబాబు ఇచ్చింది రూ.వెయ్యేనట!

జగన్ వచ్చేనాటికి 39 లక్షల పెన్షన్లేనట!

ఆసాంతం తలకిందుల అంకెల గారడీ

వాస్తవాలకు భిన్నంగా ప్రకటనల జారీ

బాబు వచ్చేటప్పటికి పెన్షన్లు 35 లక్షలు

జగన్ పగ్గాలు చేపట్టేనాటికి 54 లక్షలు

అంటే చంద్రబాబు హయాంలోనే అదనంగా 19 లక్షల మందికి పింఛన్

వయోపరిమితి సడలించినా జగన్ కొత్తగా ఇచ్చింది 12 లక్షలే

సీఎం జగన్ ప్రమాణ స్వీకార వేదికపై అవ్వా తాతలకు ఇచ్చే పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.2250లకు పెంచుతూ, పింఛన్లకు అర్హతా వయ సును 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు తగ్గిస్తూ మొదటి సంతకం చేశారు. పెంచిన పెన్షన్ రూ.2250 అమలైందేగానీ తగ్గించిన అర్హతా వయసుకు సంబంధించిన ఉత్తర్వులు ఏడాది తర్వాతగానీ వి డుదల కాలేదు. దీనివల్ల ఈ కాలమంతా రూ.540 కోట్ల విలువైన లబ్ధిని అవ్వాతాతలు కోల్పోయారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సామాజిక పెన్షన్లకు సంబం ధించి సీఎం జగన్, ఆయన రోత పత్రిక, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు పేరుతో ఇచ్చే యాడ్స్ పదే పదే తప్పుడు సమాచారమిచ్చి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి. ఒక అబద్ధాన్ని పలు దఫాలు ప్రచారం చేసి నిజం నోరు నొక్కేయాలన్న వ్యూహంతో

మిగతా 2వ పేజీలో...

ఉద్యోగులపై చీలిక వల!

ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసే ఎత్తుగడ.. అనుకూల నేతలతో వ్యూహం అమలు

సర్కారును వ్యతిరేకించే సిబ్బందిపై కన్ను.. విభాగంలో వారికి పనులు కాకుండా కట్టడి

వ్యక్తిగత స్థాయిలో భారీగా విష ప్రచారం.. కొన్నివారాలుగా అంగన్వాడీల ఆందోళనలు

తాళాలు బద్దలుకొట్టిన సచివాలయాల సిబ్బంది.. ఉద్యోగుల మధ్య ఉద్రిక్తతలు

కావాలని పక్కాగా చేసిన కుట్ర ఇది!.. అనుకూలురకే బదిలీలు, పదోన్నతులు 2

ప్రశ్నించేవారికి మొండిచేయి.. ఇదేం తీరంటూ విస్తుపోతున్న ఉద్యోగ వర్గాలు

చిక్కుల్లో చైనా

ఆర్థిక రంగం అస్తవ్యస్తం

కనీస అవసరాలకూ జనం కష్టాలు

అధ్యక్షుడు జిన్‌పింగ్ అంగీకారం

కొత్త ఏడాది సందేశంలో ప్రస్తావన

కమ్యూనిస్టు సర్కారు ఏకపక్ష విధానాల ఫలితమే! 2

ప్రైవేటురంగంపై పెరిగిన ఆంక్షలు

భూకంప మృతులు 50పైనే!

జపాన్‌లో ఒక్క రోజులోనే 155 ప్రకంపనలు

టోక్యోలో రన్ వేపై 2 విమానాలు ఢీ

367 మంది ప్రయాణికులను కాపాడిన సిబ్బంది

మరో విమానంలో ఐదుగురు సిబ్బంది మృతి 2

ట్రక్కుడ్రైవర్ల ఆందోళన విరమణ

కొత్త చట్టం అమలుపై ముందుగా చర్చిస్తామని హామీ

బీజేపీదీ సబ్సిడీ సంస్కృతే!

- వేరే పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు దీటుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాయితీలు
- ఆర్బీఐ తాజా నివేదిక ద్వారా వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 2: 'రేవడీ కల్చర్'.. పేదలకు ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలు, సబ్సిడీల గురించి ప్రధాని మోదీ దగ్గర నుంచి బీజేపీలో పలువురు సీనియర్ నేతల దాకా అదేదో అపరాధమన్నట్టు చెప్పే మాట ఇది! నిరుడు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మోదీ.. ఈ ఉచితాల సంస్కృతి వల్ల రాష్ట్రాలు అప్పులపాలయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు గుర్తుందా? కానీ.. 2018-23 నడుమ దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సబ్సిడీల పెరుగుదల బీజేపీయేతర రాష్ట్రాలకు దీటుగా ఉందని ఆర్బీఐ తాజా నివేదికలో తేలింది. ఈ ఐదేళ్లలో రాష్ట్రాలు సమర్పించిన బడ్జెట్‌లను పరిశీలించి ఆర్బీఐ ఈ నివేదిక రూపొందించింది. దాని ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల బడ్జెట్లలో సబ్సిడీ కేటాయింపులు నగటున 2.2 రెట్లు పెరిగినట్టు అందులో పేర్కొంది. 2018 నాటికి రాష్ట్రాల సబ్సిడీల భారం రూ.1.9 లక్షల కోట్లుండగా.. 2023 నాటికి అది రూ.4.2 లక్షల కోట్లకు చేరినట్టు వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం..

- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను.. దేశవ్యాప్తంగా కేటాయించిన సబ్సిడీల్లో బీజేపీ పాలిత రాష్ట్రాల వాటా 34%. ఆప్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సబ్సిడీల వాటా 20%.
- గుజరాత్‌లో 2018-19 నాటికి రూ.17 వేల కోట్లున్న సబ్సిడీలు.. 2023 నాటికి 30 వేల కోట్లు దాటాయి. హరియాణాలో రూ.8 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు, కర్ణాటకలో రూ.23 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు, మధ్యప్రదేశ్‌లో రూ.12 వేల కోట్ల నుంచి రూ.28 వేల కోట్లకు, యూపీలో 14 వేల కోట్ల నుంచి 26 వేల కోట్లకు సబ్సిడీలు పెరిగాయి.

చిక్కుల్లో చైనా ఆర్థిక రంగం

- ఉద్యోగాలు లేవు, కష్టాల్లో కంపెనీలు

బీజింగ్, జనవరి 2: చైనా ఆర్థిక పరిస్థితి సరిగా లేదని స్వయంగా ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ అంగీకరించారు. ఆర్థికరంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా దేశ ప్రజానీకాన్ని ఉద్దేశించి ఆయన టీవీలో ప్రసంగించారు. కొన్ని కంపెనీలు, పారిశ్రామిక రంగాలు తీవ్ర కష్టాల్లో ఉన్నాయని, ప్రజలకు ఉద్యోగాలు లభించటం లేదని, కనీస అవసరాలు తీర్చుకోవటానికి కూడా జనం ఇబ్బందులు పడుతున్నారని జిన్‌పింగ్ చెప్పారు. ఇటువంటి సమస్యలు ఉన్నప్పటికీ.. ఆర్థికరంగాన్ని చక్కదిద్దుతామని ఆయన భరోసా వ్యక్తం చేశారు. జిన్‌పింగ్ సందేశానికి కేవలం కొన్ని గంటల ముందే.. దేశంలోని పరిశ్రమల పనితీరుకు సంబంధించి జాతీయ గణాంకాల బ్యూరో డిసెంబరు నెల 'పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్' (పీఎంఐ)ను వెలువరించింది. ఆ నెలలో ఫ్యాక్టరీల్లో కార్యకలాపాలు గత ఆరునెలల కనిష్ఠానికి పడిపోయాయని వెల్లడైంది. నవంబరులో తయారీరంగం పీఎంఐ 49.4గా నమోదు కాగా, డిసెంబరులో అది మరింత తగ్గి 49కి పడిపోయింది. పీఎంఐ రీడింగ్ 50కి పైన ఉంటేనే పరిశ్రమల కార్యకలాపాలు బాగా నడుస్తున్నాయని లెక్క. 50కన్నా తక్కువ ఉంటే పరిశ్రమలు నెమ్మదించాయని అర్థం చేసుకోవాలి. 3నెలలుగా పీఎంఐ 50కి తక్కువగానే ఉంది.

డ్రగ్స్ కేసులో వైసీపీ నేత విక్రమ్‌రెడ్డి అరెస్ట్

- కొకైన్, ఎండీఎంఏ డ్రగ్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తరలింపు
- నిజామాబాద్ జిల్లాలో అరెస్టు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం/ఆలమూరు, డిచ్‌పల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొకైన్, ఎండీఎంఏ వంటి డ్రగ్స్‌తో వైసీపీ నాయకుడు పోలీసులకు చిక్కడంతో తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కలకలం రేగింది. నిషేధిత మాదకద్రవ్యాలు తరలిస్తుండగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన వైసీపీ నాయకుడు ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి (దొరబాబు) కుమారుడు ద్వారంపూడి విక్రమ్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ అదనపు డిప్యూటీ కమిషనర్ జయరాం తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన ద్వారంపూడి విక్రమ్‌రెడ్డి వైసీపీ నాయకుడు. అదే రాష్ట్రంలోని పల్నాడు జిల్లా చిలకలూరుపేటకు చెందిన షేక్ ఖాజామోయినొద్దీన్ ఇతనికి స్నేహితుడు. వీరిద్దరూ ఫ్రెండ్స్‌తో కలిసి కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు ఢిల్లీకి చెందిన రాహుల్, షైక్ అనే వ్యక్తుల ద్వారా కొకైన్, గాంజా పౌడర్, ఎండీఎంఏ డ్రగ్‌ను సేకరించారు. వీటిని స్కోడా కారులో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కారును సోదా చేసి, వీటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్నవాటిలో ఎండీఎంఏ డ్రగ్ 3.2 గ్రాములు, కొకైన్ 12.3 గ్రాములుగా, గంజాయి పౌడర్ 3.1 గ్రాములుగా ఉన్నాయి. వీటిని ఢిల్లీకి చెందిన రాహుల్, షైక్ అనే వ్యక్తుల నుంచి తీసుకొస్తున్నట్టుగా గుర్తించారు. ద్వారంపూడి విక్రమ్‌రెడ్డి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఖాజామోయినొద్దీన్‌ది ఏపీలోని చిలకలూరిపేట మండలం పల్నాడు జిల్లా. ప్రస్తుతం ఇతను హైదరాబాద్‌లోని మణికొండలోగల పంచవటి కాలనీలో నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా జైలుకు ద్వారంపూడి విక్రమ్, షేక్ ఖాజామోయినొద్దీన్‌లను పోలీసులు తరలించారు.

స్వగ్రామంలో కలకలం

విక్రమ్‌రెడ్డి అరెస్టుతో అతడి స్వగ్రామం జొన్నాడలో కలకలం రేగింది. అతని తండ్రి, వైసీపీ నాయకుడు ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి (దొరబాబు) జొన్నాడ సర్పంచ్‌గా చేశారు. విక్రమ్‌రెడ్డికి వైసీపీ ఎంపీలు మార్గాని భరత్, మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి తదితరులతో పరిచయాలు ఉన్నాయి.

జపాన్‌లో మృతులు 50 పైనే!

ఒక్క రోజులోనే 155 సార్లు భూ ప్రకంపనలు

- వాజిమాలోని ఒకే వీధిలో దగ్ధమైన 200 ఇళ్లు
- ఇషికావాలో అంధకారంలో 45 వేల నివాసాలు



జపాన్‌లో సోమవారం భూకంపం ధాటికి నేల మట్టమైన ఇళ్లు

టోక్యో, జనవరి 2: ద్వీప దేశం జపాన్‌లో భూకంపం మృతుల సంఖ్య భారీగానే ఉంది. 50 మందికి పైగానే ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. కొత్త సంవత్సరం తొలి రోజున పశ్చిమ తీర ప్రాంతంలో సంభవించిన ఈ విపత్తులో మరణాలు ఇంకా పెరిగే ప్రమాదం ఉందని అంచనా. సోమవారం ఒక్క రోజే 155 ప్రకంపనలు నమోదైనట్లు తేలింది. వీటిలో ఒకదాని తీవ్రత గరిష్ఠంగా 7.6 కాగా, మిగతావి 3 నుంచి 6కు పైనే అని జపాన్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. మంగళవారం కూడా దేశంలో ఆరుసార్లు భూమి కంపించింది. వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూకంప కేంద్రం ఇషికావా, మరికొన్ని ప్రభావిత ప్రాంతాల్లో 45 వేల ఇళ్లు రెండో రోజు కూడా అంధకారంలోనే ఉన్నాయి. కాగా, వాజిమాలోని అసైచి వీధిలో ప్రకంపనల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగి 200 ఇళ్లు దగ్ధమయ్యాయి. వేలాదిమందిని ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సైన్యం పెద్దఎత్తున సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమైంది. రోడ్లు దెబ్బతినడం, తీరంలోని కీలక విమానాశ్రయం రన్ వేకు పగుళ్లు రావడంతో సహాయ చర్యలకు ఇబ్బంది ఎదురవుతోంది. కాగా, దేశంలోని పలు జాతీయ రహదారులు సహా ప్రధాన రహదారులను ఇంకా మూసే ఉంచారు. చాలా రైల్, విమాన సర్వీసులను పునరుద్ధరించలేదు. ప్రభుత్వ యంత్రాంగం విపత్తు నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉంది. మారుమూలన ఉండే నోటో ద్వీపంలో అయితే తాగేందుకు మంచినీరు కూడా లేదు. భూకంపం కారణంగా ఎగసిన అలలకు తీరంలో సుజు నగరంలో కార్లు, పడవలు సముద్రంలోకి కొట్టుకుపోయాయి.

మరిన్ని శక్తిమంతమైన ప్రకంపనల హెచ్చరిక

రాబోయే రోజుల్లో మరిన్ని శక్తిమంతమైన ప్రకంపనలు వచ్చే ముప్పుందని.. జాగ్రత్తగా ఉండాలని జపాన్ ప్రభుత్వం హెచ్చరించింది. సోమవారమే రష్యా, ఉత్తర, దక్షిణ కొరియాలు సునామీ హెచ్చరికలను జారీ చేయగా.. దక్షిణ కొరియా తూర్పుతీరాన్ని 3.3అడుగుల సునామీ అల తాకినట్లు అధికారులు చెప్పారు.

టోక్యోలో రన్ వేపై 2 విమానాలు ఢీ



మంటల్లో జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం

- మంటల్లో జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం
- 367 మంది ప్రయాణికులు క్షేమం
- కోస్ట్‌గార్డ్ విమాన సిబ్బంది 5గురు మృతి

టోక్యో, జనవరి 2: జపాన్ రాజధాని టోక్యోలోని హనేడా విమానాశ్రయం రన్ వేపై మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 367 మంది ప్రయాణికులతో అప్పుడే దిగిన జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం.. బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న కోస్ట్ గార్డు విమానాన్ని ఢీకొంది. రెండు విమానాల్లోనూ మంటలు రేగాయి. కోస్ట్ గార్డు విమానం సిబ్బంది ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కెప్టెన్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎయిర్‌లైన్స్ విమానం పూర్తిగా మంటల్లో చిక్కుకోక ముందే పైలట్లు, సిబ్బంది ఎమర్జెన్సీ స్లైడర్ వేసి ప్రయాణికులందర్నీ కిందకు దింపేశారు. దానిపై జారుతూ ప్రయాణికులు అందరూ దిగిన తర్వాతే వారు బయటకొచ్చారు. 'మా విమానం దిగిన కొద్దిసేపటికే పెద్ద శబ్దం వచ్చింది. అందరం ఉలిక్కిపడ్డాం. క్షణాల్లో క్యాబిన్‌లో పొగ అలుముకోవడం మొదలైంది'ని పలువురు ప్రయాణికులు వణికిపోతూ చెప్పారు. ఏం జరుగుతోందో తెలియక హాహాకారాలు చేశామన్నారు. మొదట కుడి రెక్క భాగం నుంచి మంటలు అంటుకున్నాయి. విమానం నిప్పులు చిమ్ముతూ.. పొగలు కక్కుతూ రన్ వేపై కొంతదూరం పరుగు తీసిన దృశ్యం భయం పుట్టించింది. చూస్తుండగానే విమానమంతటా మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు దాదాపు 70 ఫైర్ ఇంజన్లను రప్పించారు. ఈ విమానం (ఎయిర్‌బస్ ఏ350) జపాన్‌లోని హొక్కాడో న్యూ చిటోస్ ఎయిర్ పోర్టు నుంచి టోక్యో వచ్చింది. కోస్ట్ గార్డ్ విమానం నిగాట ప్రాంత భూకంప బాధితులకు అందించేందుకు సామగ్రి తీసుకెళ్లాల్సి ఉంది. కొత్త ఏడాది తొలి రోజే వరుస భూకంపాలతో జపాన్ చిగురుటాకులా వణికిపోయింది. మరుసటి రోజే ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకోవడం జపనీయులను ఆందోళనకు గురిచేస్తోంది.

లోకం తీరు



మెగసెసే అవార్డును తిరిగిచ్చేసిన
సందీప్ పాండే



న్యూఢిల్లీ, జనవరి 2: తనకు బహూకరించిన రామన్ మెగసెసే అవార్డును ప్రముఖ సామాజిక కార్యకర్త సందీప్ పాండే మంగళవారం వాపసు చేశారు. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు అమెరికా మద్దతు తెలుపుతున్నందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఈ అవార్డును నెలకొల్పింది. అమెరికాకే చెందిన ఫోర్డు ఫౌండేషన్ సహకారం అందించింది. 2002లో ఆయనకు బహూకరించిన ఈ అవార్డును తిప్పి పంపుతున్నట్టు ప్రకటించారు. అమెరికా యూనివర్సిటీలు ఇచ్చిన రెండు ఎం.ఎస్. డిగ్రీలను కూడా వాపసు చేస్తున్నట్టు తెలిపారు. 21,500 మందికిపైగా పాలస్తీనా పౌరులను హతమార్చిన ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని తాను తట్టుకోలేకపోతున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీసుకువచ్చిన న్యాయ సంస్కరణలను ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన సంగతి తెలిసిందే.

ఉద్యోగులపై చీలిక వల!

- ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసే ఎత్తుగడ
- అనుకూల సంఘ నేతలతో వ్యూహం అమలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో మరోసారి గెలుపు కోసం జగన్ సర్కారు అడ్డదారులు తొక్కుతోంది. కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాల మధ్య చీలిక తీసుకొచ్చి గత ఎన్నికల్లో గట్టెక్కిందన్న అపప్రదను వైసీపీ ప్రభుత్వం మూటగట్టుకుంది. మళ్లీ అటువంటి కుట్రలే పన్నుతోంది. కాకపోతే ఈసారి చీలిక కుట్రలకు ఉద్యోగులను ఎర వేస్తున్న తీరు ఉద్యోగ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ఏ ప్రభుత్వంపై లేనంతగా జగన్ సర్కారుపై రాష్ట్ర ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన జగన్ సర్కారు.. ఉద్యోగుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తగ్గించే ఎత్తుగడను వేసింది. దానికోసం ఉద్యోగుల మధ్య చిచ్చుపెట్టి, వారి మధ్య ఉన్న ఐక్యతను దెబ్బ తీయడానికి తెగబడింది. ఇందు కోసం తనకు అనుకూలురైన ఉద్యోగులను, ఉద్యోగ సంఘ నేతలను రంగంలోకి దింపింది. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతతో ఉన్న ఉద్యోగులను గుర్తించి.. వారికి వ్యతిరేకంగా విష ప్రచారం చేయడం వీరికి అప్పగించిన టాస్క్. ఇలా.. ఉద్యోగులను అనుకూలమైన, వ్యతిరేక వర్గాలుగా చీల్చి , ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారు. ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణ సైతం ప్రారంభించినట్లు తెలిసింది. రివర్స్ పీఆర్సీ, పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, ఏపీజీఎల్ఐ రుణాలు, వేధింపులు... ఇలా ప్రతి ఒక్క అంశంలోనూ ఉద్యోగులకు జగన్ సర్కారులో వెతలే మిగిలాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో ఉద్యోగులు జగన్ సర్కారుకు వ్యతిరేకంగా నిలవడానికి సిద్ధమయ్యారు. మరోవైపు జగన్ సర్కారు కూడా తనకు అనుకూలంగా వ్యవహరించే నాయకులను ఏరిపెట్టుకుంది. ప్రభుత్వం పైనా, ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరు పట్లా ఇతర సంఘ నాయకుల్లోనూ, ఉద్యోగుల్లోనూ ఏ మాత్రం వ్యతిరేకత కనిపించినా... వారిపైకి సదరు నాయకులతో మాటల దాడిని సాగిస్తోంది. తమ చేతిలో ఉన్న అధికారాన్ని ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేస్తోంది. సమస్యలను ప్రస్తావించినప్పుడు సమస్యల పరిష్కారం పై దృష్టిపెట్టకుండా ఉద్యోగులకు వారిలో వారికి జుట్టుముడి పెట్టే ప్రయత్నాలు చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తంపులు పెట్టి తప్పుకొనిపోయే ఎత్తు..

రాష్ట్ర వ్యాప్తంగా లక్షమంది అంగన్వాడీలు రోడ్డెక్కి తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని సమ్మెకు దిగారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించక పోగా... గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో తాళాలు పగలగొట్టించి మరీ అంగన్వాడీ కేంద్రాలను తెరిపించింది. దీంతో అంగన్వాడీలు, సచివాలయాల ఉద్యోగుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వం కావాలనే వీరిమధ్య చిచ్చు పెట్టిందని చెబుతున్నారు. అలాగని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సమస్యలు లేవా? వారు ప్రభుత్వంపై ఆగ్రహంతో లేరా? అంటే ఉన్నారు. అయితే, తనపై గుర్రుగా ఉన్న ఉద్యోగులంతా ఒక్కటి కాకుండా చేస్తే ప్రభుత్వ వ్యతిరేకత నుంచి తప్పించుకోవచ్చునని ఈ ఎత్తు వేసింది. ప్రభుత్వం తమకు అనుకూలురైనవారిని పలు యూనియన్లకు నాయకులుగా నియమింపజేసుకుంది. ప్రతిశాఖలో వైసీపీకి సంబంధించిన యూనియన్ల కార్యకలాపాలను ఇతర యూనియన్లతో పోటీగా విస్తరింపజేసింది. దీంతోపాటు ఆయా యూనియన్ల నేతలు చెప్పిన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ, బదిలీలు, పదోన్నతులు, ఇతర అంశాలు వారు చెప్పిన వారికే చేసే విధంగా అధికారులకు అంతర్గతంగా ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇతర యూనియన్లలో ఉండే పలువురు ఉద్యోగులు 'ఇక్కడ పని కావడంలేదు, ఆ యూనియన్ అయితే బెటర్. వారి పనులే అవుతున్నాయి' అంటూ అటుమళ్లేలా చేసింది. ఇదంతా పైకి కనపడుతుందా? అంటే ఎక్కడా ప్రభుత్వ ప్రమేయం ఉన్నట్లు కనిపించదు.. కానీ తనకు అనుకూలురైనా ఉద్యోగ సంఘాల్లోని నాయకులతో నడిపించేస్తోంది. మరోవైపు జగన్ సర్కారు ఎన్ని జగడాలు పెట్టాలని చూసినా తమను ప్రాంతాలు, కులాలు, మతాలు వర్గాలుగా విభజించాలని చూసినా దాదాపుగా ఉద్యోగులంతా మెలుకువగానే ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు.

ట్రక్కు డ్రైవర్ల ఆందోళన విరమణ

- కొత్త చట్టంపై చర్చిద్దాం... కేంద్ర హోంశాఖ కార్యదర్శి హామీ

న్యూఢిల్లీ, జనవరి 2: భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్టంలో హిట్-అండ్-రన్ శిక్షలకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన ట్యాంకర్/ట్రక్కు డ్రైవర్లు తమ సమ్మెను విరమించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సోమవారం ప్రారంభమైన డ్రైవర్ల సమ్మె.. మంగళవారం పలు ప్రాంతాల్లో ఉధృతంగా సాగింది. ట్యాంకర్, ట్రక్కు డ్రైవర్లకు ప్రైవేట్ బస్సులు, క్యాబ్ డ్రైవర్లు కూడా సంఘీభావంగా నిలవడంతో.. మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో హైవేలపై రాకపోకలు స్తంభించిపోయాయి. మూడ్రోజుల సమ్మె అంటూ తొలుత ప్రకటన వెలువడడంతో ఆందోళన చెందిన వాహనదారులు పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కనిపించింది. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 90% పెట్రోల్ బంకుల్లో నిల్వలు నిండుకున్నాయని పెట్రో డీలర్ల సంఘాలు ప్రకటించాయి. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్(ఏఐఎంటీసీ) ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐఎంటీసీ ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టారు. స్పందించిన అజయ్ భల్లా.. "కొత్త చట్టాన్ని అమలు చేయడానికి ముందు మీ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాం. మరోసారి సమీక్షిద్దాం. ఆందోళనలను విరమించండి" అని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఏఐఎంటీసీ ప్రతినిధులు.. సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు.

హింసాత్మక ఘటనలు

పలు చోట్ల ట్రక్కు/ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె హింసాత్మక ఘటనలకు, పోలీసు లాఠీచార్జికి దారి తీసింది. రాజస్థాన్‌లోని కేక్రీ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఆందోళనకారులు పోలీసు వాహనానికి నిప్పుపెట్టారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఓ వాహనం ధ్వంసమవ్వగా.. ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. నవీముంబైలోనూ ట్రక్కు డ్రైవర్లు పోలీసులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఓ పోలీసుకు గాయాలయ్యాయి. ముంబై-బెంగళూరు, ముంబై-అహ్మదాబాద్ హైవేలపైనా రాళ్ల రువ్వడాలు, పోలీసుల లాఠీచార్జి ఘటనలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని పీతంపూర్ హైవే, భోపాల్‌లోనూ ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలను ఝళిపించారు. కాగా, కేంద్రం తీసుకువచ్చిన బీఎన్ఎస్ చట్టంపై కాంగ్రెస్ మండిపడింది. 150 మంది ఎంపీలను సస్పెండ్ చేసి, ఈ చట్టాన్ని తీసుకువచ్చారని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో తీవ్ర విమర్శలు చేశారు. ఈ చట్టం పేదలపై జరిమానా విధించేలా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ చర్యవల్ల మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



కెరీర్ టూల్‌కిట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స

ఉన్నత విద్యార్థులకు 'కెరీర్ టూల్‌కిట్'

- ఆవిష్కరించిన మంత్రి బొత్స సత్యనారాయణ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ఉన్నత విద్యాశాఖ కెరీర్ టూల్‌కిట్‌ను అందుబాటులోకి తెచ్చింది. కాలేజీలో చేరిన రోజు నుంచి చదువు పూర్తయ్యేవరకూ, ఆ తర్వాత ఉద్యోగావకాశాల అన్వేషణలోనూ ఇది ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ టూల్‌కిట్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఉన్నత విద్య కోర్సులు చదువుతున్న 10లక్షల మంది విద్యార్థులు ఈ ఆన్‌లైన్ టూల్‌కిట్‌ను పొందవచ్చన్నారు. విదేశాల్లో టాప్ వర్సిటీల్లోని కోర్సులను ఆన్‌లైన్‌లో రాష్ట్ర విద్యార్థులు చదివేందుకు వీలుగా ప్రముఖ వర్సిటీలతో ఈ నెలలో ఒప్పందాలు చేసుకోబోతున్నామని, తద్వారా 2వేల కోర్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఉన్నత విద్యలోని విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లకు నెలకు రూ.12వేల నుంచి 18వేలు స్టైపండ్ ఇచ్చేలా కొన్ని ఒప్పందాలు చేసుకుంటామన్నారు. కాగా, ఈ టూల్‌కిట్ విద్యార్థులకు పూర్తి ఉచితమని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. కోర్సుల వారీగా 19 రకాల టూల్‌కిట్లు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు కె.రామ్మోహనరావు, పి.ఉమామహేశ్వర దేవి, కార్యదర్శి వై.నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

పింఛన్లపై అవే పిట్టకథలు!

(మొదటి పేజీ తరువాయి)

పదేపదే తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారుకు అబద్ధాల కోటలు కట్టడం అలవాటైపోయింది. జగన్ ప్రతి మీటింగ్‌లో ఒకే అబద్ధాన్ని పదేపదే చెప్తుండటం, వాటిని అనుసరించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ప్రెస్‌నోట్లు విడుదల చేస్తే, దాన్ని సమాచారశాఖ పత్రికలు, మీడియాకు జారీ చేస్తోంది. సామాజిక పింఛన్లపై మరోసారి గొప్పలు చెప్పుకునేందుకు బుధవారం ముఖ్యమంత్రి జగన్ కాకినాడలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాస్తవ వివరాలను ప్రజలకు అందించాలన్న సంకల్పంతో 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించింది.

పింఛన్లలో నాడు నవశకం..

ఉమ్మడి రాష్ట్రంలో సామాజిక పెన్షన్లు 69 లక్షలు ఇచ్చేవారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అప్పటికి 35.32 లక్షల పింఛన్లు పంపిణీ చేసేవారు. వృద్ధాప్య, వితంతువులకు రూ.200, దివ్యాంగులకు రూ.500 ఇస్తుండగా.. దానిని టీడీపీ ప్రభుత్వం రూ.1000, దివ్యాంగులకు రూ.1500 చేస్తూ 2014 జూన్ 19న జీవో 113 విడుదల చేసింది. గిరిజనుల్లో ప్రిమిటివ్ ట్రైబల్స్ గ్రూప్ తెగలో శారీరకంగా చిన్న వయస్సులోనే వృద్ధాప్యం సంక్రమిస్తున్నందున వారికి 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు 2014 డిసెంబరు 16న జీవో 157ను విడుదల చేశారు. ట్రాన్స్‌జెండర్లకు పెన్షన్ వర్తింపజేస్తూ 2015 ఏప్రిల్ 18న జీవో 39 ఇచ్చారు. జూన్ 2015నుంచి కొత్త పెన్షన్లు ఇవ్వడం ప్రారంభించారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు 2018 డిసెంబరు నుంచి పెన్షన్ల మొత్తాన్ని రూ.2 వేలకు పెంచారు. ఈ మేరకు 2019 జనవరి 25న జీవో 13 విడుదల చేశారు. ఆ రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షన్ల సంఖ్య 54.06 లక్షలు. పెన్షన్లకు నెలకు రూ.1107.32కోట్లు అవసరమని అప్పటి గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, ఇటీవల వరకు సీఎంవోలో ఉన్న సాల్మన్ ఆరోక్యరాజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించింది చంద్రబాబు హయాంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన జవహర్‌రెడ్డి. ఆయన ఇప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. పెన్షన్లకు సంబంధించిన కీలక ఉత్తర్వులిచ్చిన ఐఏఎస్‌లను తన కార్యాలయంలోనే పెట్టుకుని తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న ప్రభుత్వ తెంపరితనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> ఎక్కడైనా పెన్షన్ తీసుకునే పోర్టబులిటీ వెసులుబాటును వైసీపీ సర్కార్ తొలగించింది. పెన్షన్‌దారులు ఒకటో తేదిన వారి సొంత ఊళ్లలో లేకపోతే ఆ నెల పెన్షన్‌కు దూరమయినట్లే!

పాతవి తొలగిస్తేనే కొత్త పెన్షన్లు...

వైసీపీ ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు రావాలంటే ఉన్న పెన్షన్లు తొలగించాల్సిందేనన్న నానుడి ఉంది. మొదట్లో వయోపరిమితి తగ్గించిన తర్వాత ఎప్పుడు 60 ఏళ్లు పూర్తవుతాయో అప్పుడే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆ మరుసటి నెల నుంచి పెన్షన్ మంజూరవుతుందని చెప్పారు. అయితే ఆ హామీకి కూడా స్వస్తిచెప్పి ఏడాదిలో రెండు దఫాలుగా పెన్షన్లు మంజూరుచేయాలని షెడ్యూల్ రూపొందించారు. ఆర్నెల్లపాటు దరఖాస్తులు స్వీకరించి ఒకేసారి పెన్షన్లు మంజూరుకు నిర్ణయం తీసుకున్నారు. ఈలోగా దరఖాస్తులు ఎన్ని వస్తాయో అన్ని తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అందుకే పెన్షన్లు మంజూరుచేసే సమయానికి తొలగించే వాటి సంఖ్య అంతే ఉంటుంది. పెన్షన్లు పొందుతున్నవారిని తొలగించడం నిరంతర ప్రక్రియగా మారిందని వాపోతున్నారు. ఆరంచెల విధానంతో పెన్షన్‌దారుల కంటికి నిద్ర లేకుండాపోయిందని చెప్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ సుమారు 4 లక్షల నుంచి 6 లక్షల దాకా పెన్షన్లు రద్దు చేసినట్లు తెలుస్తోంది.

అబద్ధం: చంద్రబాబు పాలన ముగిసేనాటికి రాష్ట్రంలో 39 లక్షల పెన్షన్లు ఉండగా, వాటిని 67 లక్షలకు తీసుకెళ్లాం.

వాస్తవం : చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కొత్తగా మంజూరుచేసిన పెన్షన్లు 19 లక్షలు. ప్రభుత్వంలోకి టీడీపీ వచ్చేనాటికి ఉన్న 35.32 లక్షలతో కలిపి.. మొత్తం అవి 54.32 లక్షలు. జగన్ దాదాపు గత ఐదేళ్ల కాలంలో అదనంగా ఇచ్చింది 12 లక్షల పెన్షన్లు మాత్రమే. వెరసి.. రాష్ట్రంలో ఉన్న మొత్తం పెన్షన్లు 66.32లక్షలు.

అబద్ధం : ఇచ్చిన పెన్షన్లలో అత్యధికం ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం మంజూరుచేసింది.

వాస్తవం: ఎన్నికలకు ముందు, అంటే 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం 3.55 లక్షల పెన్షన్లు మాత్రమే ఇచ్చారు. మిగిలిన 16 లక్షల పెన్షన్లు చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అంచలంచెలుగా ఇచ్చినవే.

అబద్ధం : చంద్రబాబు వృద్ధాప్య పింఛన్ల కింద తన హయాంలో రూ. వెయ్యి మాత్రమే ఇచ్చారు.

వాస్తవం : ఎన్నికలకు ఆర్నెల్ల ముందు, అంటే 2018 డిసెంబరు నుంచి పెన్షన్ల మొత్తాన్ని రూ.1000 నుంచి రూ.రెండువేలకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచారు. ఈ మేరకు 2019 జనవరి 25న జీవోనెం. 13 విడుదల చేశారు. ఇదంతా ఎన్నికలకు ఆర్నెల్ల ముందు జరిగిన ప్రక్రియ.

సీఎం సభకు రాకపోతే పింఛన్ రానట్టే!

- వృద్ధులు, వితంతువులకు వలంటీర్ల బెదిరింపులు
- కాకినాడలో నేడు సీఎం 'పింఛను పెంపు' సభ

కాకినాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ కాకినాడ పర్యటన ఏర్పాట్లలో అధికారుల ప్రభుభక్తి విస్తుగొలుపుతోంది. ఒకపక్క నిబంధనలకు తూట్లు పొడిచి ఏర్పాట్లు చేస్తుండగా, మరోపక్క జనాలను వేలల్లో తరలించడానికి వలంటీర్ల ద్వారా బెదిరింపులకు దిగుతున్నారు. జగన్ పర్యటించేది ఆయనకు అత్యంత సన్నిహితుడైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఇలాకా కావడంతో ఏర్పాట్లలో అధికారులు శ్రుతిమించి వ్యవహరిస్తున్నారు. సభకు కనీసం లక్షమందిని తరలించి ద్వారంపూడి వద్ద మార్కులు కొట్టేయాలని జిల్లా కలెక్టర్ నుంచి కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ వరకు పర్యవేక్షణ చేస్తుండడం గమనార్హం. జనవరి నుంచి సామాజిక పింఛన్‌ను రూ.3వేలకు పెంచిన నేపథ్యంలో దానిపై ప్రచారం చేసుకోవడంతోపాటు, పింఛను నిధులు విడుదల చేయడం కోసం సీఎం బుధవారం కాకినాడ నగరంలో పర్యటిస్తున్నారు. దీంతో రెండురోజులుగా జనసమీకరణకు అధికారులు నానాపాట్లు పడుతున్నారు. స్పందన ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు. వలంటీర్లు పింఛనుదారులను బెదిరిస్తూ ఆడియో మెసేజ్‌లు పంపారు. జనవరిలో పెరిగిన పింఛన్ కోసం లబ్ధిదారులు సమీపంలోని సచివాలయాలకు బుధవారం ఉదయం 7గంటలకు రావాలని, అక్కడినుంచి సీఎం సభకు వెళ్లాలని హుకుం జారీ చేశారు. రాకపోతే పెన్షన్ డబ్బులు అందవని హెచ్చరించారు. ఈ మేరకు ఓ వలంటీర్ బెదిరింపుల ఆడియో లీకైంది. టీడీపీ కార్యక్రమాలకు ఒక్క బస్సు అద్దెకివ్వని ఆర్టీసీ... సీఎం సభ కోసం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి 318 బస్సులను పంపుతోంది.

పంచాయతీల నిధులను జగన్ ప్రభుత్వం కైంకర్యం చేయడమే కాకుండా.. సర్పంచ్‌లకున్న విధులను కూడా కొత్తగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలకు కట్టబెట్టేసి గ్రామ స్వరాజ్య స్ఫూర్తినే దెబ్బతీశారు!. నిధులు, విధులు లేక సర్పంచ్‌లతోపాటు.. ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు వంటి స్థానిక సంస్థల ప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా మార్చేశారు. ఆఖరికి వలంటీర్ల సూచనలతో సంతకం పెట్టే స్థితి రావడంతో.. ఇక ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకోవడానికి... వైసీపీ సహా పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులతా సమాయత్తమయ్యారు. ఈమేరకు బుధవారం(నేడు) రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసి.. ప్రభుత్వంపై పోరుకు సిద్ధమయ్యారు. విధులు, నిధులు సాధించుకోవడం ద్వారా తిరిగి గ్రామస్వరాజ్య స్ఫూర్తిని నిలుపుకోవడమే లక్ష్యంగా తలపెట్టిన ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష నేత చంద్రబాబును ఆహ్వానించడం విశేషం!.

తాడోపేడో!

సర్కార్‌పై 'స్థానిక' నేతల పోరుబాట

- మలిదశ పోరాటానికి సమాయత్తం
- జగన్ పాలనలో కుప్పకూలిన పంచాయతీలు
- గ్రామ పాలన మొత్తం ప్రభుత్వం హైజాక్
- నిధులు దారిమళ్లించడంతో స్థానిక సంస్థల నిర్వీర్యం
- నిస్సహాయ స్థితిలో సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీ చైర్‌పర్సన్లు
- వైసీపీ సర్కారును నిలదీయాలని నిర్ణయం
- ఆఖరి దశలోనైనా డిమాండ్ల సాధనకు ఆరాటం
- సర్కారు దిగిరాకుంటే ఎన్నికల్లో దెబ్బతీయాలని కంకణం
- నేడు రాష్ట్ర సదస్సు.. ముఖ్య అతిథిగా చంద్రబాబు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్థానిక సంస్థల నేతలు పోరుబాట పట్టారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థలు నిర్వీర్యమవడంపై మండిపడుతున్నారు. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లతో పాటు అన్ని స్థానిక సంస్థల ప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లు వివిధ దశల్లో పోరాటాలు చేయగా.. ఇక నుంచి వారితో పాటు ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పార్టీలకతీతంగా ఉద్యమంలో పాల్గొని జగన్‌ను నిలదీయాలని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని మట్టికరిపించాలని కంకణం కట్టుకున్నారు!. ఈ మేరకు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ప్రతిపక్షనేత, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు సమస్యలను ప్రస్తావించి వాటిని సాధించుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కేంద్ర నిధులు దారిమళ్లింపు

చంద్రబాబు సర్కార్ దిగిపోయిన తర్వాత పంచాయతీలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం పైసా విదల్చకపోయినా.. కేంద్రం నుంచి వస్తున్న 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకే తెలియకుండా దారిమళ్లించేసింది. 2018 ఆగస్టు 1 నుంచి ఏప్రిల్ 2 2021 వరకు పంచాయతీల ఎన్నికలు జరగకపోవడంతో సర్పంచ్‌లు అధికారంలో లేరు. ఆ తర్వాత 2021లో ఎన్నికలు జరిగి నూతన సర్పంచ్‌లు ఏప్రిల్ 2, 2021న పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతన సర్పంచ్‌లు వచ్చిన తర్వాత కూడా పంచాయతీ సీఎఫ్‌ఎంఎస్ ఖాతాలో కేంద్ర ప్రభుత్వం పంపించామంటున్న 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర సర్కార్ మాయం చేసింది. సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనందున 2018-2021 మధ్య కాలంలో నిధులు విడుదల చేయలేదని, అందుకే ఈ మూడు సంవత్సరాల్లో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని అప్పట్లో అందరూ భావించారు. కానీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నతో పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి.. రూ.7659 కోట్లు రాష్ట్రానికి విడుదల చేశామని జవాబివ్వడంతో అసలు విషయం వెల్లడైంది. ఈ సర్పంచ్‌లు వచ్చిన కొత్తలో రూ.345 కోట్లు ఓసారి, రూ.969కోట్లు మరోసారి, మళ్లీ రూ.800కోట్లు ఇలా.. సర్పంచ్‌లకు తెలియకుండా విద్యుత్ చార్జీల కోసమంటూ రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుందని, దారిమళ్లించి సీఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ చూపించారని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. కేంద్ర నిధులను రాష్ట్ర సర్కార్ లాగేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిపివేయగా, సర్పంచ్‌లు ఢిల్లీ వెళ్లి తిరిగి సాధించుకున్నారు. ఆ నిధులను కూడా విద్యుత్ చార్జీల పేరుతో మళ్లీ సర్కార్ లాక్కొంది. దీంతో గ్రామ పంచాయతీల్లో ఒక్క రంగంలోనూ అభివృద్ధి జరగలేదు.

ఉనికి కోల్పోయిన స్థానిక ప్రజాప్రతినిధులు

గ్రామ సచివాలయాలను తీసుకొచ్చి పల్లెలను ఉద్ధరిస్తామన్న సీఎం జగన్ పంచాయతీలను అడ్రస్సు లేకుండా చేసి గ్రామ స్వరాజ్య స్ఫూర్తినే దెబ్బతీశారు. పంచాయతీ కార్యాలయాలను సచివాలయాలుగా మార్చి సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులను బయటకు తరిమేశారు. సర్పంచ్‌లు.. వలంటీర్‌ల సూచనలతో సంతకాలు పెట్టే నామమాత్రపు వ్యక్తిగా మారిపోయారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలు పూర్తిగా విస్మరించారు. తమకు తెలియకుండానే తమ ఖాతాల్లో నిధులు మాయం కావడం, పంచాయతీల్లో చేపట్టిన చిన్నపాటి పనులకు సైతం నెలల తరబడి బిల్లుల కోసం నిరీక్షించడం పరిపాటిగా మారడంపై సర్పంచ్‌లు, ఇతర స్థానిక సంస్థల నేతలు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. ఇదే పరిస్థితి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లకు ఏర్పడింది. ప్రభుత్వమే విడుదల చేయాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో మండలాలు, జిల్లా పరిషత్‌లు ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారింది.

దత్తతనూ దూరం చేసిన జగన్

గ్రామాల్లో జన్మించి ఉద్యోగ, వ్యాపారపరంగా విదేశాల్లో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలకు జన్మభూమికి సేవ చేసే అవకాశాన్ని వైసీపీ ప్రభుత్వం కాలరాసింది. గతంలో గ్రామ సీమలు దత్తపుత్రికలుగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రభుత్వం 2015 జనవరిలో శ్రీకారం చుట్టింది. సంసద్ ఆదర్శ గ్రామ యోజన తరహాలో రాష్ట్రంలో ప్రతి ఊరు, వార్డును కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, ఎన్‌ఆర్‌ఐలు ఎవరో ఒకరు దత్తత తీసుకునేలా ప్రోత్సాహం కల్పించింది. పలువురు ప్రముఖులు గ్రామసీమలను, పట్టణాల్లో వార్డ్‌లను ఎంపిక చేసుకుని ఆర్థిక సహాయం అందించి పాఠశాలలు, శ్మశానాలు, తాగునీటి సౌకర్యాలు, రోడ్లు, ఆటస్థలాలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధి కోసం ఇతోధికంగా సాయం అందించారు. ప్రభుత్వం కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చింది. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మార్ట్ వార్డ్-స్మార్ట్ విలేజ్ పథకాన్ని రద్దు చేశారు. దాని స్థానంలో కనెక్ట్ ఆంధ్రా అని కొత్త విభాగాన్ని తీసుకొచ్చినా.. ఈ సంస్థ కాన్సెప్ట్ ఒక్క ఎన్‌ఆర్‌ఐలో కూడా స్ఫూర్తి కల్పించలేకపోయింది. ఎన్‌ఆర్‌ఐలు, దత్తత తీసుకునే ప్రముఖులు నిధులిస్తే.. ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని కనెక్ట్ ఆంధ్రా పథకం అధికారులు చెప్పుండటంతో ప్రముఖులు మొహం చాటేశారు.

ఉపాధి చట్టానికి విరుద్ధంగా పనులు

గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామాలకు ఒక పెద్ద వనరు. దేశ వ్యాప్తంగా ఈ పథకం గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం కాంట్రాక్టు సిబ్బంది ఆధ్వర్యంలో చేపడుతున్నారు. గ్రామంలో ఏ పనులు చేపట్టాలని నిర్ధారించే అధికారం గ్రామ సర్పంచ్‌లకు లేకుండా చేశారు. ఈ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ సర్పంచ్ కంటే పవర్‌ఫుల్‌గా గ్రామాల్లో పెత్తనం చలాయిస్తున్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు విశేష అధికారాలు కల్పించినట్లు చట్టాలు చెప్తున్నా.. రాష్ట్రంలో గ్రామీణ స్థానికసంస్థల ప్రజాప్రతినిధుల ఉనికి మాత్రం లేకుండా పోతోంది.

అసంపూర్తిగానే భవనాల నిర్మాణాలు

వైసీపీ సర్కార్ గ్రామ, వార్డ్ సచివాలయాల ఏర్పాటు చేసిన వెంటనే సచివాలయాలు, విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవనాల నిర్మాణాలను ప్రారంభించింది. అయితే ఒక్క పైసా కూడా వాటికి నిధులు విడుదల చేయకపోవడంతో రెండేళ్ల పాటు పునాదులు స్థాయిలో ఉన్నాయి. ఆ తర్వాత వాటికి సిమెంట్ విడుదల చేస్తే వైసీపీ నేతలు, కార్యకర్తలు అమ్ముకున్నారు. ఇప్పుడు వాటి నిర్మాణాలు ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనుల్లో ప్రతి ఏటా నిర్దిష్ట సమయాల్లో పురోగతి లేకపోవడంతో ఏ సంవత్సరం నిధులు ఆ సంవత్సరం మురిగిపోతున్నాయి. పంచాయతీల సర్పంచ్‌లతో సంబంధం లేకుండా వైసీపీ కార్యకర్తలతో పనులు చేయిస్తుండటంతో పనుల్లో జవాబుదారీతనం లోపించింది. దీంతో ఎక్కడపనులు అక్కడ ఆగిపోయాయి. గ్రామ పాలన మొత్తాన్ని ప్రభుత్వం హైజాక్ చేయడంతో స్థానికసంస్థల ప్రతినిధులను పట్టించుకున్న వారు లేరు. అందుకే అభివృద్ధి కార్యక్రమాలన్నీ కుంటుపడ్డాయి.



రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న మహిళలు, మధ్యలో టీడీపీ ఎమ్మెల్యే కేశవ్

సొంత భూమిలో పేదలకు ఇంటి స్థలాలు

- టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఉదారత

ఉరవకొండ, జనవరి 2: అనంతపురం జిల్లా ఉరవరకొండ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ పేదలకు తన సొంత భూమిలో ఇంటి స్థలాలను కేటాయించారు. మంగళవారం ఈమేరకు వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఉరవకొండ మండలం కౌకుంట్ల పంచాయతీ షైలారంపల్లి ప్రజలు పీఏబీఆర్ బ్యాక్ వాటర్‌తో ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం 165 మందికి 6.65 ఎకరాల భూమిని కేశవ్ పంచిపెట్టారు. ఒక్కొక్కరికి 2.50 సెంట్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారు. 30 ఏళ్లుగా తనకు రాజకీయంగా అండగా నిలుస్తున్న కౌకుంట్ల పంచాయతీ ప్రజలకు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా కేశవ్ అన్నారు. గత ఏడాది భారీ వర్షాలకు షైలారం పల్లి ముంపునకు గురైందని, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు అన్నారు. తమ ఎమ్మెల్యే కేశవ్ అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ కేలెండర్‌కు సమాధి

- తిరుపతిలో తెలుగు యువత వినూత్న నిరసన



తిరుపతి, జనవరి 2: జాబ్ కేలెండర్ పేరుతో నిరుద్యోగులను జగన్ మోసం చేశారంటూ తిరుపతిలో తెలుగు యువత వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం తిరుపతి నగర పరిధిలోని మంగళం రోడ్డులో జాబ్ కేలెండర్ సమాధి ఏర్పాటు చేసి పిండం పెట్టి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. జాబ్ కేలెండర్‌ను సమాధి చేశావా జగన్..! అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కార్మికులకు అగచాట్లు: అచ్చెన్న

- ఈ నెల 6 నుంచి టీడీపీ కార్మిక చైతన్య యాత్ర

విజయవాడ(విద్యాధరపురం), జనవరి 2: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి చేపట్టనున్న ఇెక్కలి టు కుప్పం కార్మిక చైతన్య యాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో కార్మిక వర్గాలన్నీ ఎంతో సంతోషంతో జీవించాయన్నారు. ఆ తరువాత వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కార్మిక వర్గాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్రలో కార్మికులకు ఇచ్చిన హామీలను వివరిస్తూ చైతన్యం తీసుకురావడం కోసం ఈ యాత్ర జరుపుతున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జీ రఘురామరాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, నాయకులు సబ్బతి ఫణేశ్వరరావు, రెంటపల్లి శ్యామ్, మహంకాళి నరసింహారావు, మకర ఆదిబాబు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు దొంతా నాగగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

హైకోర్టులో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

- క్యాలెండర్‌ను విడుదల చేసిన సీజే

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులందరూ హాజరయ్యారు. ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘానికి చెందిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను విడుదల చేశారు. 24 కేజీల భారీ కేకును కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్‌లు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కె.సురేంద్రనాథ్, సెక్రటరీ ఎం.ఎలీషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఇతర కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

డేటాను మార్ఫింగ్ చేసి వైరల్ చేస్తామంటున్నారు

- హైకోర్టును ఆశ్రయించిన జనసేన నేత కిరణ్ రాయల్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, సీఎం జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు ఆపకపోతే సెల్‌ఫోన్‌లోని డేటాను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతామని పోలీసులు తనను బెదిరిస్తున్నారని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్ రాయల్ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నగరి డీఎస్పీ రవికుమార్, నగరి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, నగరి రూరల్ పోలీస్‌స్టేషన్ పూర్వ సీఐ శ్రీనివాసంతి, కానిస్టేబుల్ రాజశేఖర్‌కు నోటీసులు జారీ చేసింది. వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈనెల 9కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి మంగళవారం ఆదేశాలిచ్చారు. తన ఫోనులోని డేటాను బహిర్గతపర్చకుండా నిరోధించేలా రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని ఆదేశించాలని కోరుతూ కిరణ్ రాయల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు. పర్యాటకశాఖ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో నమోదైన కేసులో పిటిషనర్ ఫోనును పోలీసులు సీజ్ చేశారన్నారు. ప్రభుత్వం, సీఎం జగన్మోహన్‌రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులను విమర్శించడం ఆపకపోతే ఫోనులో ఉన్న డేటాను మార్ఫింగ్ చేసి పరువుకు భంగం కలిగిస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని తెలిపారు. దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల పాత్ర ఉందన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గొంతెత్తకుండా చేసేందుకు పిటిషనర్‌ను బెదిరిస్తున్నారని తెలిపారు. పిటిషనర్ వ్యక్తిగత డేటాను బహిర్గతం చేస్తామని బెదిరించడం, అతడి గోప్యత హక్కును హరించడమేనన్నారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

'ఆఫీసుల తరలింపు' అప్పీల్.. విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు ముసుగులో అమరావతి నుంచి ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించే ప్రక్రియను ఆపాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై సర్కారు వేసిన అప్పీల్ హైకోర్టులో విచారణకు వచ్చింది. కార్యాలయాల తరలింపుపై దాఖలైన వ్యాజ్యాలను తగిన బెంచ్ విచారించేదాకా ఆగాలంటూ న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాలను అప్పీల్ రూపంలో సర్కారు సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అయితే అప్పీల్ విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు జస్టిస్ రఘునందనరావు ప్రకటించారు. దీంతో ఆయన సభ్యుడిగాలేని ధర్మాసనం ముందుకు అప్పీల్ విచారణకు రానుంది. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుమన్ స్పందిస్తూ.. మరో ధర్మాసనం ముందు ఈ అప్పీల్ సాధ్యమైనంత త్వరగా విచారణకు వచ్చేలా చూడాలని సీజేను అభ్యర్థించారు. అందుకు ప్రధాన న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. విశాఖకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపును నిలువరించాలంటూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరు 22న జారీ చేసిన జీవో 2283ని రద్దు చేయాలని కోరారు. ఇదే వ్యవహారంపై రాజధాని రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి ధనేకుల రామారావు, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య సొసైటీ ఉపాధ్యక్షుడు కల్లం రాజశేఖర్‌రెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాల పై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ జడ్జి, వాటిపై తగిన బెంచ్ విచారణ చేపట్టేవరకు ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. త్రిసభ్య ధర్మాసనం విచారణ జరపాలా?లేదా అనే విషయంపై తగిన నిర్ణయం తీసుకొనేందుకు పిటిషన్లను చీఫ్ జస్టిస్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

రఘురామ పిల్‌పై 23న విచారణార్హత నిర్ణయం

- ఆ లోగా అనధికార ప్రతివాదులు కౌంటర్లు వేయాలని హైకోర్టు ఆదేశం
- జగన్ ప్రభుత్వ విధానాలపై ఎంపీ పిల్
- అప్పులకు అనుచిత లబ్ధిపై సీబీఐ విచారణకు సీఎం సహా బంధుగణంపై కేసులకు అభ్యర్థన

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డం పెట్టుకుని సీఎం జగన్ తన వారికి అనుచిత లబ్ధి చేకూర్చేలా రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన కొన్నాళ్ల కిందట ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్ విచారణార్హతను ఈ నెల 23న నిర్ణయిస్తామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈలోగా కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు అందుకున్న అనధికార ప్రతివాదులను ఆదేశించింది. కౌంటర్ల ప్రతులను పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాదికి అందజేయాలని సూచించింది. ఆయా కౌంటర్లకు రిప్లై దాఖలు చేయాలని సీనియర్ న్యాయవాదిని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఆ రోజు పిల్ విచారణార్హతపై వాదనలు విని నిర్ణయాన్ని వెల్లడిస్తామని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది. సీఎం జగన్ తన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి, బంధుగణంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. వ్యాజ్యం విచారణార్హతపై ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీంతో పిల్ విచారణార్హతను తేలుస్తామని ధర్మాసనం పేర్కొంది. పిల్ అనుమతికి ముందు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. మంగళవారం ఈ వ్యాజ్యం ధర్మాసనం ముందు విచారణకు రాగా.. గతంలో తాము జారీ చేసిన నోటీసులు అందరికీ అందాయా?లేదా? అని ధర్మాసనం ఆరా తీసింది. ఎంపీ రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు బదులిస్తూ.. ప్రతివాదులలో కొందరికి ఈ-మెయిల్స్ ద్వారా నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. పిల్ విచారణార్హతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కౌంటర్ దాఖలు చేశారని తెలిపారు.

బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో 11 మంది అరెస్టు

- రెండు వారాలు రిమాండ్.. పరారీలో మరో ముగ్గురు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బాలికపై సామూహిక అత్యాచారం కేసులో 11 మందిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా రెండు వారాలు రిమాండ్ విధించినట్టు దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదుతో గత నెల 18న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మొత్తం 14 మంది ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తించి 11 మందిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. అరెస్టు అయిన వారిలో సయ్యద్ మీరా షరీఫ్ అలియాస్ రాజు (20), చింతపల్లి హరీష్ అలియాస్ గోలెం (33), దోని నాగేంద్రబాబు (28), మరో యువకుడు (18), వంకా గోపి (24), ద్వైపిల్లి శివరామకృష్ణ (24), తడక ప్రవీణ్ (22), లండ నరేష్ (23), రాగతి శ్రీను (25), జగన్నాథ ఈశ్వర్ అలియాస్ ఈసు (21), చింతపల్లి శివశంకర్‌వరప్రసాద్ అలియాస్ శివ(30) ఉన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే.. : అనిత

మహారాణిపేట (విశాఖపట్నం), జనవరి 2: 'పోలీసుల నిర్లక్ష్యంతోనే విశాఖ నగరంలో దళిత బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఘటనపై విచారణలో పోలీసుల వ్యవహారశైలిపై అనేక అనుమానాలు ఉన్నాయి' అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి భవానీ దీక్షల విరమణ ప్రారంభం కానుంది. మొత్తం 5 లక్షల మంది భవానీ దీక్షలు తీసుకున్న భక్తులు అమ్మవారి వద్దకు వస్తారని అధికారులు అంచనా వేశారు.

విశాఖను నేర రాజధానిగా మార్చిన వైసీపీ: లోకేశ్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఒక మైనర్ బాలికపై సామూహిక అత్యాచార ఘటనను లోకేశ్ ఎక్స్ వేదికగా మంగళవారం తీవ్రంగా ఖండించారు. 'ప్రశాంత విశాఖ నగరాన్ని వైసీపీ నేరాలకు, అఘాయిత్యాలకు రాజధానిగా మార్చింది. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతోంది. నేరగాళ్లపై కఠిన చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం అవుతున్నాయి. మూడు నెలలు ప్రజలు ఓపిక పడితే రాష్ట్రంలో ఈ నేరగాళ్ల రాజ్యం ముగిసిపోతుంది. అప్పటివరకూ మహిళలు తమ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి' అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల నిర్వహణపై మరింత కసరత్తు

- 9, 10 తేదీల్లో రాష్ట్రానికి సీఈసీ బృందం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) మరింత లోతుగా పరిశీలన చేయనుంది. ఈ నేపథ్యంలో ఆరుగురు అధికారులతో కూడిన సీఈసీ బృందం ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్రానికి చెందిన ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం కానుంది. 2024 ఓటర్ల జాబితా రూపకల్పనతోపాటు, జాబితాల్లో తప్పులు, అవకతవకలు తదితర అంశాలపై సీఈసీ బృందం సమీక్షించనుంది. 2019 ఓటర్ల జాబితాతో పోల్చితే 2024లో ఓటర్ల జాబితా పరిస్థితి, ఒకే ఇంట్లో పది ఓట్ల కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వాటిపైనా దృష్టి పెట్టనుంది. ఓటర్ల జాబితాల్లోని వ్యర్థపదాల తొలగింపు, ఓటర్ల జాబితా, ఇంటింటి సర్వే వల్ల వచ్చిన ఫలితం, పీఎస్ఈ, డీఎస్ఈల తొలగింపు తదితర అంశాలపై బృందంలోని అధికారులు చర్చించనున్నారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై కేంద్ర ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. మద్యం, నగదు అక్రమ రవాణా, చెక్ పోస్టుల ఏర్పాట్లు అధికారులు కీలక సూచనలు చేయనున్నారు.

6.47 లక్షలమందికి వైకుంఠద్వార దర్శనం

- శ్రీవారి హుండీ ద్వారా రూ.40.20 కోట్ల ఆదాయం

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గత నెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు పదిరోజుల పాటు 6,47,452 మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. గతేడాదితో పోలిస్తే 40 వేల మందికి అధికంగా వైకుంఠద్వార దర్శనం లభించిందన్నారు. ఈ పదిరోజులకు సంబంధించి రూ.40.20 కోట్ల హుండీ కానుకలు అందాయన్నారు. రాష్ట్ర అటవీశాఖకు రూ.3.5 కోట్లు అందించామని, దీంతో అలిపిరి నడక మార్గంలో అత్యాధునిక ట్రాప్ కెమెరాలు ఇతర చర్యలు చేపడతామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత విజయం

గత ఏడాది చరిత్రాత్మక చంద్రయానంతో అద్భుతాన్ని సృష్టించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), మరో చక్కని విజయంతో ఈ కొత్త సంవత్సరంలోకి ప్రవేశించింది. సోమవారం ఉదయం పదకొండు పరికరాలు, ఉపగ్రహాలతో కూడిన పీఎస్ఎల్‌వి—సీ58 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయి తన కర్తవ్యాన్ని సంపూర్ణంగా నెరవేర్చింది. ఆ పేలోడ్‌లో మిగతావి అటుంచితే, 480 కిలోగ్రాముల బరువున్న ఎక్స్‌రే పొలారిమీటర్ సాటిలైట్— ఎక్స్‌పోశాట్ మన ఖగోళ అధ్యయనంలో ఒక అద్భుత పురోగతి. తన ఐదేళ్ళ జీవితకాలాన్ని ఇది ప్రధానంగా కృష్ణబిలాలను అధ్యయనం చేయడానికి వినియోగిస్తుంది. ఎక్స్‌రే ఫోటాన్లు, వాటి పోలరైజేషన్ తెలుసుకోవడం ద్వారా కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల రేడియేషన్ గుట్టు విప్పుతుంది.

కాస్మిక్ ఎక్స్‌రేలను అధ్యయనం చేయడానికి భారతదేశం ఇలా అంతరిక్షంలోనే ఒక అబ్జర్వేటరీని ఏర్పాటు చేసుకుంది. అమెరికా మాత్రమే ఈ విషయంలో మనకంటే ముందున్నది కనుక ఇది సగర్వంగా చెప్పుకోవాల్సిన పరిణామం. కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల గురించి ఎంతోకొంత అవగాహన ఉన్నా, వాటి పుట్టుపూర్వోత్తరాల విషయంలో మనిషి తెలుసుకోవాల్సింది చాలానే ఉన్నది. చివరకు కాంతిని సైతం దిగమింగే బలమైన అయస్కాంత శక్తితో, లక్షలాది సూర్యుల ద్రవ్యరాశితో అంతులేని ఆకాశంలో అంతుచిక్కని బ్రహ్మ రహస్యం కృష్ణబిలం. వాటినుంచి వెలువడే శక్తిమంతమైన ఎక్స్‌రేల ప్రవర్తనను సక్రమంగా విశ్లేషించినప్పుడు ఆవిర్భావక్రమాన్ని కొంతమేరకు అర్థం చేసుకోగలం. నాసాకు చెందిన 'ఇమేజింగ్ ఎక్స్‌రే పొలారిమెట్రీ ఎక్స్‌ప్లోరర్ (ఐఎక్స్‌పిఇ) 2021డిసెంబరు నుంచి ఇదే అధ్యయనాన్ని మొదలుపెట్టింది. అయితే, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని సాధించే లక్షణం ఉన్న ఇస్రో ఈ విషయంలోనూ పైచేయిగానే ఉంది. ఐఎక్స్‌పీఈ కోసం నాసా 188 మిలియన్ డాలర్లు ఖర్చుచేస్తే, దాని జీవితకాలం రెండేళ్ళు మాత్రమే. ఎక్స్‌పోశాట్ కోసం మనం వెచ్చించింది 30 మిలియన్ డాలర్లు, దీని జీవితకాలం ఐదేళ్ళు. అంతరిక్షంనుంచి వెలువడే యాభైరకాల కాంతిపుంజాలను అధ్యయనం చేయడానికి కేవలం 250కోట్ల రూపాయలతో అంతరిక్షంలోనే ఓ అబ్జర్వేటరీని నెలకొల్పుకోవడం వంటి విన్యాసాలు ఇస్రోకు కొత్తేమీ కాదు. హాలీవుడ్ సినిమా కంటే తక్కువ ఖర్చుతో అది చంద్రయానం చేసింది. అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్‌ను, సాంకేతికంగా అత్యున్నతమైన ఉపగ్రహాలను నామమాత్రపు ఖర్చుతో అభివృద్ధి చేసుకుంది. దేశవిదేశీ ఉపగ్రహాల ప్రయోగాన్ని విజయవంతంగా నెరవేర్చుతూ దానిని లాభాలబాట పట్టించిన పీఎస్ఎల్‌వి ఈ ప్రయోగంలోనూ అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది. భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులో ఎక్స్‌పోశాట్‌ను జారవిడిచిన తరువాత, నాలుగోదశలో రాకెట్ తనకు తానుగా 350 కిలోమీటర్లు తగ్గి, మిగతా పని పూర్తిచేయడం ఓ ఆశ్చర్యకరమైన విన్యాసం.

ఎక్స్‌పోశాట్ మాదిరిగానే, ఇటీవలి ఆదిత్య ఎల్1 కూడా స్పేస్ అబ్జర్వేటరీయే. చందమామను చేరడానికి పెట్టిన ఖర్చులో సగం వెచ్చించి సూర్యుడిని తెలుసుకోవడానికి ఇస్రో సిద్ధపడింది. జనవరి 6న ఆదిత్య ఎల్1 తన చిట్టచివరి విన్యాసాన్ని ముగించుకొని గమ్యాన్ని చేరబోతున్నది. ఆగస్టులో చంద్రయానం జరగ్గానే, సెప్టెంబరులోనే ఆదిత్యకు అంకురార్పణ చేయడం ఓ సాహసం. ఇస్రో తొలి అడుగులు వేస్తున్నప్పటికే, అమెరికా చంద్రుడిమీదకు వ్యోమగాములను దించింది. అటువంటిది ఇప్పటివరకూ ఎవరూ కాలూనని, అత్యంత కఠినమైన చంద్రుడి దక్షిణ ధ్రువంలో సాఫ్ట్‌ల్యాండింగ్ విజయవంతం చేయడం ఇస్రో కీర్తికిరీటంలో ఓ కలికితురాయి. చంద్రుడిమీదకు సున్నితంగా వాలే ఆ 'ఫిఫ్టీన్ మినిట్స్ ఆఫ్ టెర్రర్‌'లో ఎదురయ్యే అవాంతరాలను ల్యాండర్ మాడ్యూల్ స్వయంగా అధిగమించే రీతిలో తయారు చేయడం ఇస్రో దూరదృష్టికి నిదర్శనం. ప్రయాణమార్గంలో అడ్డువచ్చిన అగాధాన్ని తనకుతానుగా తప్పించుకొని తిరిగి తనపని తాను చేసుకుపోయిన రోవర్ ప్రజ్ఞాన్ కూడా ఓ అద్భుతమే. చంద్రయాన్, ఆదిత్య మాత్రమే కాదు, గత ఏడాది రీయూజబుల్ లాంచ్ వెహికల్‌ను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగానికి కొద్ది క్షణాలముందు రాకెట్లో ఓ లోపాన్ని గుర్తించి, గంటలోపే సరిచేసుకొని, మానవ సహిత గగనయానికి అత్యంత కీలకమైన క్ర్యూ ఎస్కేప్ మోడల్ పరీక్షను కూడా అది దిగ్విజయం చేసుకుంది. భారత అంతరిక్ష చరిత్రలో 2023 ఇస్రోకు విజయవంతమైన ఏడాది. చేతిలో 14ప్రాజెక్టులతో, మరిన్ని ఉన్నతమైన లక్ష్యాలతో ఈ కొత్త సంవత్సరంలో అది మరింత దూసుకుపోతుందని ఆశిద్దాం.

రామమందిరం సరే, రామరాజ్యం ఎక్కడ?

బాబ్రీ మసీదు కట్టడం నేలమట్టం కావడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ సంఘటన సంభవించిన డిసెంబర్ 6, 1992 ముందు రోజు రామజన్మభూమి మీడియా సెంటర్ డైరెక్టర్ రమాశంకర్ అగ్నిహోత్రిని కలిసినప్పుడు ఆ కట్టడాన్ని కూల్చివేయనున్నారని ఆయన సూచన ప్రాయంగానైనా వెల్లడించలేదు (అగ్నిహోత్రి సాధారణ వ్యక్తి కాదు. ఆరఎసఎస్ సర్ సంఘ్ చాలక్ ఆరఎస్ సుదర్శన్‌ను స్వయం సేవక్‌గా మార్చిన వ్యక్తి) ఆ మరునాడు అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఉమాభారతి, వినయ్ కతియార్, సాధ్వీ రితంబర తదితరులు ఉద్వేగపూరితంగా, ఉద్రిక్తభరితంగా ప్రసంగాలు చేస్తుండగా కరసేవకులు బాబ్రీ కట్టడాన్ని కూల్చివేశారు. గుమ్మటాలపై ఎక్కినవారు వాటిని కూలుస్తూనే తాము కూడా శిథిలాలతో పాటూ నేల కూలిపోతున్నా ఆ భావోద్వేగంలో వారు లెక్కచేయలేదు. ఆ కట్టడం కూల్చివేసిన స్థలంలోనే మూడు దశాబ్దాల తర్వాత శ్రీరాముడి మందిరాన్ని ప్రారంభిస్తారని నాడు ఎవరనుకున్నారు? ఆ బీభత్స దృశ్యాలూ ఇంకా కళ్లముందు కదలాడుతున్నాయి. దేశ ప్రజలకు ఇవాళ అయోధ్యలో శ్రీరాముడి మందిరం మాత్రమే కనపడవచ్చు. కాని దాని వెనుక ఉన్న చరిత్ర, ఆ చరిత్రలో జరిగిన విధ్వంసం, వందలాది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం గురించి ఇప్పుడెక్కడా చర్చ జరగడం లేదు.



'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని సుగ్రీవుడు అడిగితే 'అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించేవాణ్ణి' అని రాముడు జవాబిస్తాడు. రాజ్యాన్ని తృణప్రాయంగా వదులుకున్న సుగుణోత్తముడు శ్రీరాముడు. మరి ఆ పుణ్య పురుషుడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి భారతీయ జనతాపార్టీ నాయకులు ఎటువంటివారు? అయోధ్యలో శ్రీరాముడి మందిరప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది.

రామమందిరంకోసం నాడు బీజేపీ నేత అద్వానీ రథయాత్ర జరిపారు. ఈ రథయాత్ర మూలంగా బీజేపీ రాజకీయంగా బలపడింది. 1989 ఎన్నికలతో పోలిస్తే 1991లో బీజేపీ దేశ వ్యాప్తంగా తన ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకున్నది. పార్లమెంట్‌లో రెండవ అతిపెద్ద పార్టీగా ఎదిగింది. ఇవాళ అదే రామమందిరం నిర్మాణం ఘనతను తనకు ఆపాదించుకున్న నరేంద్రమోదీ ఈ మందిరం ఆధారంగా 2024లో మూడోసారి గెలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శ్రీరాముడు, రామమందిరం బీజేపీ రాజకీయ ఎజెండా మాత్రమేనని ఇవాళ అందరికీ తెలుసు. రామమందిరాన్ని నిర్మించింది ట్రస్ట్ అయితే దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ ఎందుకు భావిస్తోంది? రథయాత్ర ప్రారంభించి, బాబ్రీ మసీదు కూల్చివేతను ప్రత్యక్షంగా తిలకించిన అద్వానీకి ఇవాళ ఈ మందిర ప్రారంభోత్సవ ఘట్టంలో ఎక్కడా ప్రాధాన్యత లభించడం లేదు. ప్రధాని మోదీయే ఆ మందిరాన్ని ప్రారంభిస్తున్నారు. మందిర నిర్మాణాన్ని దేశ చరిత్రలో ఒక బృహత్తర ఘట్టంగా జరుగుతోన్న ప్రచారానికి ఆయనే సారథ్యం వహిస్తున్నారు. గత వారం బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆలయ ప్రారంభోత్సవమే ప్రధాన ఎజెండాగా చర్చించారు. ఈ ఆలయ నిర్మాణంలో బీజేపీ ఎలాంటి కీలక పాత్ర పోషించిందీ ఇంటింటికి వెళ్లి వివరించమని మోదీ ఆదేశించారు. రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆ రోజు ప్రతి భారతీయుడి ఇంటిలో మరో దీపావళి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం మళ్లీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించి జనవరి 22 తర్వాత అయోధ్యలో రామమందిర ప్రారంభం తర్వాత పెద్ద ఎత్తున మందిర్ దర్శన్ అభియాన్‌ను ఎలా కొనసాగించాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్ణయించారు. మందిర ప్రారంభాన్ని దేశమంతటా ప్రత్యక్ష ప్రసారం ద్వారా కోట్లాది ప్రజలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కనీసం రెండున్నర కోట్లమందిని అయోధ్యకు రప్పించి దర్శనం చేయించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఒకప్పుడు మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడంపై దేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి. రాను రానూ మతాన్ని ఉపయోగించుకోవడం సర్వసాధారణమైపోయింది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి స్వయంగా 'జై బజరంగ్ బలీ' అని నినాదాలు చేశారు. అధికారంలో ఉన్న పార్టీ బాహాటంగా మతాన్ని ఉపయోగించుకునేందుకు రామమందిర ప్రారంభం ఇప్పుడు స్పష్టంగా ఉపయోగపడుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పుల్వామా, బాలాకోట్ మోదీకి ఆయుధాలుగా మారితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో రామమందిరం ప్రధానాస్త్రంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ప్రజల్లో నెలకొన్న భక్తి విశ్వాసాలను ఒక రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఎంతవరకు సబబు? ఇది ప్రజాస్వామ్యంలో సరైనదేనా? దీనిపై న్యాయస్థానాలు కానీ, ఎన్నికల కమిషన్ కానీ కలుగచేసుకునే అవకాశాలు లేవా? అయినా ఇవాళ వ్యవస్థలు స్వతంత్రంగా, విచక్షణాయుతంగా నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎక్కడిది?

బాల్యంలో ఆంజనేయుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారం. హనుమంతుడి కథలు విని నడుముకు తోకలాగా ఏదో గుడ్డ తగిలించుకుని ఆడుకునేవారం. రాముడిలా చీపురుపుల్లలతో బాణాలు వేసేవారం. ఎన్టీఆర్ శ్రీరాముడి వేషంతో రాక్షసులను వధిస్తుంటే ఉత్కంఠతో చూసేవారం. సీతారామకల్యాణం సినిమా టిక్కెట్లకోసం కిక్కిరిసిన లైన్లలో నిలుచున్న దృశ్యం ఇంకా గుర్తుంది. లైబ్రరీలో బాలల బొమ్మల రామాయణం ఆసక్తిగా చదువుకునేవారం. పెద్దలు రామకోటి రాస్తుంటే చూసేవారం. శ్రీరామ నీవే కలవు అన్న అక్షరాలతో అమ్మ నాడు రాసిన ఉత్తరాలు ఇంకా ఉన్నాయి. కాని నాడెవరూ శ్రీరాముడిని రాజకీయాలకు ఉపయోగించుకోలేదు. సీత అగ్నిప్రవేశం, శంబూక వధ లాంటిపై ప్రశ్నలు రేగినప్పటికీ ఒక కథగా రామాయణం ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటుంది. విన్నంతవరకూ, చదివినంతవరకూ శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. సత్యవాక్పరిపాలకుడు. మర్యాద పురుషోత్తముడు. 'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు కూడా లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని రాముడిని సుగ్రీవుడు అడుగుతాడు. 'రావణుడే కనుక లొంగిపోతే అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించేవాడిని' అని రాముడు జవాబిస్తాడు. నాటి రాముడు అధికారానికి, పదవులకు అతీతుడు. తృణప్రాయంగా పదవిని వదులుకున్నవాడు. కాని రాముడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి బీజేపీ నేతలు ఎటువంటివారు?

రామరాజ్యం సుపరిపాలనకు సంకేతం అంటారు. రాముడు వేలాది సంవత్సరాల పాటు చేసిన పాలనలో వృద్ధులు యువకులకు అంత్యక్రియలు జరపాల్సిన అవసరం లేదు అని వాల్మీకి యుద్ధకాండలో రామరాజ్యాన్ని వర్ణించాడు. అంటే అకాల మరణాలు ఉండేవి కావని అర్థం. రామరాజ్యం ఎలా ఉండేది? సామాజిక సామరస్యం, న్యాయం వెల్లివిరిసేవి. ఎలాంటి రోగాలు, బాధలు లేకుండా ప్రజలు జీవించేవారు. అసలు ప్రజలు దాన ధర్మాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఉండేది కాదు. అందరూ సమాన హక్కులతో జీవించేవారు. అందరూ విద్యావంతులై ఉండేవారు. శాంతిభద్రతల పరిస్థితి కానీ, అంతర్గత కల్లోలాలు కానీ, ఇతర రాజ్యాల నుంచి సమస్యలు కానీ ఉండేవి కాదు. ప్రజల సంక్షేమం తప్ప రాముడికి వేరేది పట్టేది కాదు. రాజుగా తాను విఫలమైతే అంతకంటే శాపం మరొకటి లేదనుకునేవాడు. ఆదాయం ఎప్పుడూ వ్యయం కంటే ఎక్కువగా ఉండేది. పన్నులు ప్రజలకు ఏ మాత్రం భారం అయ్యేవి కాదు. అంతా సుభిక్షంగా జీవించేవారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా విధానాల రూపకల్పన జరిగేది. రాజ్యం భూలోక వైకుంఠంలా ఉండేదని వాల్మీకి ఒక్క మాటలో వర్ణించారు.

మహాత్మాగాంధీ కూడా శ్రీరాముడు చారిత్రక పురుషుడా కాదా అన్నది పట్టించుకోలేదు. ఆయన రామరాజ్య భావన పైనే దృష్టి కేంద్రీకరించారు. రాజుకూ, పేదకూ సమాన హక్కులున్నాయని రామాయణం చెప్పిందని గాంధీ అన్నారు. '1921లో సరయూ నది ఒడ్డున సాధువులతో గాంధీ రామరాజ్యం గురించి మాట్లాడారు. రాముడు సీతను ప్రేమించినట్లుగా, మనం బలహీనుల్ని కాపాడాలి. కేవలం మన రక్షణ కోసమే రాముడిని ఆరాధించడం పాపం అని స్పష్టీకరించారు' అని ఆరఎసఎస్ నేత రామ్‌మాధవ్ కూడా ఒక రచనలో పేర్కొన్నారు. మరి ఇప్పుడెలాంటి రాజ్యం ఉన్నది? ఇవాళ ఒక రాజకీయ పార్టీ మతాన్నే తన అస్తిత్వంగా మార్చుకుంది.. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం, రైతుల ఆత్మహత్యలు, అధిక ధరలు, బలహీనుల అణచివేతలు, స్త్రీలపై అత్యాచారాలు, కొద్ది మంది సంపన్నులకు దేశ సంపదను ధారాదత్తం చేయడం, కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిని రక్షించడం, ప్రజలపై భారీ అప్పులు మోపడం, నేతలు అధికారం సంపాదించిన కొద్ది సంవత్సరాల్లోనే వేల కోట్ల ఆస్తులు పోగేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభాగ్యులు సరైన చికిత్స అందకుండా మరణించడం ఎల్లెడలా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో గంగానదిలో శవాలు తేలిన, అభాగ్యులు మైళ్ల కొద్దీ నడుస్తూ, రైలు పట్టాలపై మరణించిన దేశమిది. ఈ దేశంలో 80 కోట్లమందికి ఉచితంగా ఆహారధాన్యాలు ఇస్తున్నానని ఈ దేశాధినేత చెప్పుకుంటారు. ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' అంటే మోదీ 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' అంటారు. ఏం తేడా?

ఇక ప్రజల హక్కుల గురించి ఏమి మాట్లాడగలం? పార్లమెంట్‌లోనే ప్రజా ప్రతినిధుల్ని బయటకు గెంటేసి ఇష్టం వచ్చినట్లు బిల్లులను ఆమోదిస్తున్నారు. వాల్మీకి ఒక కవిగా రామరాజ్యం గురించి కవితా గానం చేసి ఉండవచ్చు. కాని నేడు నేతలు అబద్ధాలతో, బూటకపు ప్రచారంలో నిత్యం నిమగ్నమయి ఉన్నారు. ప్రచారం లేకుండా వారికి పూటగడవని పరిస్థితి ఏర్పడింది. భారత రాజకీయాలు ఇప్పుడు సంధిదశలో ఉన్నాయి. అయోధ్యలో శ్రీరాముడి మందిరం ప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది.


(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఎస్సీ వర్గీకరణ: ఏం చేయాలి, ఎలా?

హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నవంబరు 11న నిర్వహించిన సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కావడం, ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా వ్యాఖ్యలు చేయడం దండోరా ఉద్యమ నాయకత్వంలో నూతన ఉత్తేజాన్ని నింపింది. దాదాపు మూడు దశాబ్దాల తమ పోరాటం ఫలించబోతుందన్న సంతోషం దండోరా నేతలలో వ్యక్తం అవుతుండగా, మాల మహానాడు కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేసింది.

ఉమ్మడి రిజర్వేషన్లలో జనాభా దామాషా ప్రకారం తమకు దక్కవలసిన భాగం దక్కటం లేదని, వాటిని మాల ఉపకులాలే కైంకర్యం చేస్తున్నాయని దండోరా ఉద్యమకారుల ఆరోపణ. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించటం ద్వారా తమ వాటా తమకు దక్కుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే, చదువు, ఉద్యోగాలు పొందినవాళ్లు ఇరువర్గాలలోను ఉన్నారని, మాల ఉపకులాలే రిజర్వేషన్లను అనుభవించాయన్న ప్రచారం వాస్తవ విరుద్ధమని మాలమహానాడు అంటోంది. దండోరా ఉద్యమ ఆరంభం నాటికే ఒక సామాజిక ఉద్యమ పరిణతిని సాధించిన దళిత సామాజిక నాయకత్వం ఈ వర్గీకరణ సమస్యకు శాస్త్రీయ పరిష్కారం కనుగొనటంలో ఘోరంగా విఫలమైంది. దళిత నాయకత్వం దీనిని తమ సొంత సమస్యలా భావించి చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. ఆ కారణంగా ఈ రెండు ఉప కులాల మధ్య పూరించలేనంత అగాధం ఏర్పడింది. ఈ సుదీర్ఘకాలం అనేక ఉమ్మడి సమస్యలను తెచ్చిపెట్టింది. వర్గీకరణకు అనుకూలంగా, దానికి వ్యతిరేకంగా ఈ రెండు వర్గాలు చేస్తున్న వాదనలు, భావనలు అర్ధసత్యాలే. సత్యాసత్యాలను నిగ్గుదేల్చేందుకు ఈనాటికీ మాల మాదిగ నాయకత్వం ప్రయత్నించకపోవడం నష్టదాయకం.

ఎస్సీ వర్గీకరణ జరిగితే మాదిగల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందా, మాలల అభివృద్ధి అడుగంటి పోతుందా? రిజర్వేషన్స్‌తోనే దళితుల సకల సమస్యలు సమసిపోతాయా? ప్రభుత్వ రంగం ఉండి, రిజర్వేషన్లను త్రికరణశుద్ధిగా అమలుచేస్తే 16 శాతం మంది మాత్రమే ప్రయోజనం పొందుతారు, మిగతా 84 శాతం అసంఘటిత రంగాలలో జీవనోపాధి పొందవలసి ఉంటుంది. రిజర్వేషన్ల కారణంగా ఎస్సీ మొత్తం జనాభాలో రెండు నుంచి మూడు శాతమే ఇప్పటికి అభివృద్ధి చెందారని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. మిగిలిన సుమారు 97 శాతం ఇంకా అభివృద్ధి చెందాల్సిన స్థితిలోనే ఉంది. ప్రైవేటు రంగం శరవేగంగా విస్తరిస్తున్న వర్తమానంలో కూడా ప్రభుత్వ రంగంలోని రిజర్వేషన్ల చుట్టూనే ఇరువర్గాలు తిరుగుతున్నాయి. రిజర్వేషన్లు కలిగించే ప్రయోజనాలకు పరిమితులున్నాయి.



పరిమితంగానే అమలయ్యే ఎస్సీ రిజర్వేషన్లని తమ వెనుకబాటుతనం ప్రాతిపదికన అవకాశాలు అందిపుచ్చుకోగల పద్ధతిని మొత్తం 60 ఉపకులాలూ అభివృద్ధి చేసుకోవాలి. అభివృద్ధి చెందని వారిని మొదటి లబ్ధిదారుగా, ఇప్పటికే అభివృద్ధి చెందినవారిని ద్వితీయ లబ్ధిదారుగా మార్చటం ద్వారా ఇది సుసాధ్యం అవుతుంది.

దళితులలో మాల, మాదిగ ఉపకులాలలోని రెండు వర్గాలలోనూ ఇప్పటికే అభివృద్ధి చెందిన వారున్నారు. ఉమ్మడి రిజర్వేషన్లు అమలయితే వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో తిరిగి వాళ్ళ వారసులే ముందు వరుసలో ఉండే అవకాశం అధికం. అలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి రిజర్వేషన్లు కొనసాగితే మాదిగలలో వెనుకబడిన వారితోపాటు మాలలలో వెనుకబడిన వారు కూడా రిజర్వేషన్ల ఫలాలను అందుకోవడంలో ఆమడ దూరాన నిలిచి పోతారు. అలాగే, దండోరా కోరుతున్నట్టుగా ఎస్సీ వర్గీకరణ జరిగితే, ఆ వర్గీకరణ తర్వాత కూడా ఆయా గ్రూపులలో అభివృద్ధి చెందినవారే తిరిగి అవకాశాలను చేజిక్కించుకోవటంలో ముందు వరుసలో ఉంటారు. అంటే, ఇప్పటివరకు కొనసాగుతున్న పద్ధతే వర్గీకరణ అనంతరం కూడా కొనసాగి, అంతిమంగా రిజర్వేషన్ల అసలు లక్ష్యం ఇప్పటిలాగే అప్పుడు కూడా దెబ్బతినిపోతుంది. స్వల్ప మార్పులతో పరిష్కార రూపంలో సమస్య యథాతథంగా మిగిలిపోతుంది.

ఇప్పుడు దండోరా చూపుతున్న దారి సమస్య సమసిపోవటానికి సరిపోనపుడు, మాలల ఏకీకరణవాదంతో యథాతథస్థితి కొనసాగితే సమగ్రాభివృద్ధి సాధ్యమయ్యే అవకాశం ఉందా? అస్సలే లేదు. ఇప్పటికే అభివృద్ధి చెందిన రెండు మూడు శాతమే తమ ప్రతిభతో మరలా అవకాశాలందుకుంటూ పోతుంటే ఇపుడిపుడే అక్షరాలు దిద్దుతున్న మిగిలిన ఉపకులాల వాళ్ళు సొంత సామాజిక వర్గంలోని వారితోనే పోటీపడలేక చతికిలపడి పోతారు. తమ సమూహంలోని చివరి మనిషికి మొదటి అవకాశం ఇవ్వడమే న్యాయమని, అదే రిజర్వేషన్ల అసలు లక్ష్యం అని నమ్మినపుడు, రిజర్వేషన్ల వర్గీకరణకు మాలలు విధిగా సానుకూలంగా స్పందించవలసి ఉంటుంది. లేదంటే తమ సమూహంలోనే ఇప్పటికే అభివృద్ధి చెందిన వారి మధ్య వెనుకబడిన వారి మధ్య గల అంతరం అంతకంతకూ పెరిగిపోతూ పెద్ద అగాధమే ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ స్థాయికి మాలలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వర్గీకరణ ఇరువర్గాల నడుమ ఏర్పడిన అగాధాన్ని పూడ్చుతుంది. ఉద్యోగులకు నిరుద్యోగులకు నడుమ గల వైరుధ్యాన్ని తగ్గిస్తుంది. అందరికీ అవకాశమొస్తుందన్న నమ్మకాన్ని కలిగిస్తుంది. పరిమితంగానైనా అందరి అభివృద్ధికి కారణభూతమౌతుంది.

ఏపీ ప్రభుత్వం గతంలో అమలు జరిపిన ఏ బి సి డి పద్ధతి సరైనదేనా? నాలుగు గ్రూపులుగా విభజించి అరవై ఉప కులాలకు దామాషా ప్రకారం ఎలా సమన్యాయం చేయగలుగుతారు?. బీసీ ఉపకులాలలో ఇప్పటికే ఉన్న ఈ ఏ బి సి డి ఫార్ములా వైఫల్యం నుంచే కదా ఎంబిసి (అత్యంత వెనుకబడిన వర్గం) పుట్టింది. ఒక చోట సత్ఫలితాలు ఇవ్వని పద్ధతిని మరొక సామాజిక వర్గానికి అమలు చేయమని కోరటమూ, అందుకు ప్రభుత్వాలు ప్రయత్నించటమూ సహేతుకమేనా? ఏ బి సి డి పద్ధతి అశాస్త్రీయం. పరిష్కారమే మళ్లీ సమస్యగా మారే స్వభావం కలది. ఆయా ఉపకులాలలో అభివృద్ధి చెందినవాళ్ళే మరలా ఆయా ఉపకులాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఇచ్చే పద్ధతి. మాల ఉపకులాలలో వెనుకబడిన పాలేరు, మాదిగ ఉపకులాలలో చెప్పులు కుట్టేవాడు వర్గీకరణ అనంతరం కూడా యథాతథంగా కొనసాగే పద్ధతి.

మరి, పరిష్కారం ఏమిటి? మొత్తంగా 60 ఉపకులాలు పరిమితంగానే అమలయ్యే రిజర్వేషన్లని తమ వెనుకబాటుతనం ప్రాతిపదికన అవకాశాలు అందిపుచ్చుకోగల పద్ధతిని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి చెందని వారిని మొదటి లబ్ధిదారుగా, ఇప్పటికే అభివృద్ధి చెందిన వారిని ద్వితీయ లబ్ధిదారుగా మార్చటం ద్వారా ఇది సుసాధ్యం అవుతుంది. దీనికి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సంబంధిత వ్యక్తులు పొందిన లబ్ధిని, వెనుకబాటు తనాన్నీ లెక్కించి వెయిటేజ్ మార్కులు ఇవ్వటం ద్వారా ఈ ఎంపిక ప్రక్రియను సమర్థంగా నిర్వహించవచ్చు. జే.ఎన్.యు. వంటి చోట్ల అడ్మిషన్లలో ఇటువంటి పద్ధతి ఎప్పటినుంచో అమలవుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత ఈ పనిని సులభతరం చేస్తుంది. ఇది ఒకే సామాజికవర్గంలోని సహోదరుల మధ్య అభివృద్ధిలో గల వ్యత్యాసం తగ్గించి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది. దీనికి రాజ్యాంగ సవరణ అక్కర్లేదు, పార్లమెంట్ తీర్మానమూ అక్కర్లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసినా సాంకేతికపరమైన, చట్టపరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉండదు (దీనికి ఆద్యుడు ఎస్.ఆర్.వేమన). పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో దళిత నాయకత్వం తమ దీర్ఘకాలిక సమస్యకు ముగింపు పలకవలసిన చారిత్రక సందర్భం ఇది. దీనిని అధిగమించి అనేక ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా సమాయత్తం కావాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

■ బడుగు భాస్కర్ జోగేష్

విజ్ఞాన వెలుగు సావిత్రిబాయి

అసమానతల సమాజంపై ధిక్కార స్వరాలై.. అట్టడుగు వర్గాల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన దంపతులు జ్యోతిరావు పూలే—సావిత్రిబాయి పూలే. వారి విశేష కృషి వల్లే నేడు ఈ సమాజంలో ప్రతీ ఒక్కరూ అక్షరాలు నేర్చుకోగలుగుతున్నారు. భర్త అడుగుజాడల్లో నడిచి సంఘంలో జరుగుతున్న అనేక అణచివేతలను ఎదురించిన ధీశాలి సావిత్రిబాయి.

ఆమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించింది. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లాలో, అదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు. బోధన్ ప్రాంతపు మున్నూరుకాపులు వీరికి చుట్టాలు. సావిత్రి 1840లో జ్యోతిరావు పూలేను వివాహమాడింది. నిరక్షరాస్యురాలైన ఆమెకు భర్తే మొదటి గురువు. ఆయన ప్రోత్సాహంతోనే ఇంట్లోనే విద్యావంతురాలైంది. అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848లో భర్తతో కలిసి అట్టడుగు కులాల బాలికల కోసం పుణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేసేవారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. అయినా రోజూ వేధింపులకు విసిగి ఒకరోజు ఒకడి చెంప పగులకొట్టింది. 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులు గృహ బహిష్కారానికి గురయ్యారు. ఈ దంపతులు వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు.



అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారు. బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాల కోసం అసమాన వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు.

ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్‌ను కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల, పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషి చేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873లో భర్తతో కలసి 'సత్యశోధక్' సమాజ్‌ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువుల పునర్వివాహాల కోసం అసమాన బ్రాహ్మణిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్‌గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు సావిత్రిబాయి.

1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. సమాజం కోసం సర్వస్వం త్యాగం చేసి అంధకార జీవితాల్లో అక్షర వెలుగులు పంచిన ఆ జ్ఞానజ్యోతులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా సమాజం కోసం మన స్థాయిలో కృషి చేయడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళి.


తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఒక్కడు!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, ఉభయ కమ్యూనిస్టు పార్టీల నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఒకే ఒక్కడు కూనంనేని సాంబశివరావు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కొత్తగూడెం నుంచి ఎన్నికల్లో సాధించిన విజయం ఘనమైనది. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు, మరో మాజీ మంత్రి, ఇంకా ఇతరులపైన ఈయన 27వేల పైచిలుకు భారీ మెజారిటీతో నెగ్గారు. కొత్తగూడెం నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుంచి జరిగిన ఎన్నికలలో ఇదే అత్యధిక మెజారిటీ.

కూనంనేని ప్రజల కోసం ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. టాడా లాంటి నిరంకుశ కేసులతో సైతం జైలుపాలు అయ్యారు. పోలీసు కాల్పులను కూడా ఎదుర్కొన్నారు. మూడు పర్యాయాలు వరంగల్ సెంట్రల్ జైళ్లలో నెలల తరబడి ఉన్నారు. ఆయన నిత్యం ప్రజల వెంటే ఉన్నారు. కొత్తగూడెంలో అనేక కాలనీలను నిర్మించి వేలాదిమందికి ఇంటి సౌకర్యం కల్పించారు. దాదాపు 35 నుంచి 40 అసంఘటితరంగ కార్మికుల సంఘాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల రంగంలో కమ్యూనిస్టులు కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, ఇతర పార్టీల పొత్తుతోపాటు పైన పేర్కొన్న అన్ని వర్గాల ప్రజల మద్దతుతో విజేతగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లోను, తర్వాత 2018 ఎన్నికల్లోనూ అసలు అసెంబ్లీలో ప్రాతినిధ్యమే లేని పరిస్థితి నుంచి ఇప్పుడు కాంగ్రెస్‌తో పొత్తుతో ఒకే ఒక్క సీటును సీపీఐ దక్కించుకున్నది. ఈ ఎన్నికల్లో సీపీఎం ఎవరితోను పొత్తు పెట్టుకోక ఒంటరిగా 19 నియోజక వర్గాల్లో పోటీ చేసి అన్నింటిలో డిపాజిట్లు కోల్పోయింది.

మునుగోడు ఉపఎన్నికల్లో వారి మద్దతు తీసుకుని, ఆ తర్వాత వదిలేసి, కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందని, వారు ప్రజల్లో లేరని హేళన చేసిన బీఆర్ఎస్ ఈ రోజు రాష్ట్రంలో అధికారం కోల్పోడానికి కారణం కొంతవరకూ కమ్యూనిస్టులే అంటే అతిశయోక్తి కాదు! కమ్యూనిస్ట్ పార్టీల ఆస్తిత్వాన్ని సవాల్ చేసినవారు కుప్పకూలిన దాఖలాలు కోకొల్లలు. కూనంనేని సాంబశివరావు ఒక్కడే అయినా, ఆయన నాలుగు కోట్ల ప్రజానీకం గొంతుగా ఉంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఒకసారి సాంబశివరావు కొత్తగూడెం నుంచి శాసనసభకు వెళ్లారు. ఆయన గతంలో ఆనాటి విశాలాంధ్ర సంపాదకులు రాఘవాచారి శిక్షణలో జర్నలిజం ఓనమాలు నేర్చుకున్నారు. శాసనసభ్యులుగా ఉన్న కాలంలో లక్షా నలభై వేల ఎకరాల కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకొచ్చి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం శాసనసభ లోపలా బయటా పెద్దయెత్తున పోరాటం చేశారు. అసెంబ్లీలో సోంపేట కాల్పులకు వ్యతిరేకంగా, తెలంగాణ ఉద్యమ సమయంలో ట్యాంక్‌బండ్ పైన విగ్రహాల కూల్చివేతకు వ్యతిరేకంగా, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర వహిస్తూనే విశ్లేషణాత్మకంగా చేసిన ప్రసంగాలు ఇప్పటికీ గుర్తుంటాయి. సింగరేణి బొగ్గుగని కార్మికుల హక్కు కోసం పోరాడి వారి కోసం జైళ్లకు వెళ్ళిన నేతగా ఆయన కార్మికుల అభిమానాన్ని పొందారు.

తెలంగాణ సాయుధ పోరాట ఘన చరిత్రకు వారసులుగా ఉన్న కమ్యూనిస్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మరింత బలంగా పురోగమిస్తారని అందరూ భావించారు. మొదటి ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులకు చెరొక స్థానం వచ్చినప్పటికీ, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా లభించకపోవడంతో కమ్యూనిస్టులు చట్టసభల్లో లేని లోటు సామాన్య ప్రజలకు స్పష్టంగా కనిపించింది. ఈ దశలోనే రాష్ట్ర రాజకీయాలు కింది నుంచి పైవరకు పార్టీ ఫిరాయింపులతో భ్రష్టు పట్టిపోయాయి. పాలకులు ప్రశ్నించే గొంతులను నులిమేశారు. హైదరాబాదులో నిరసన హక్కుకు చిహ్నంగా నిలిచిన ధర్నాచౌక్‌ను బందు చేశారు. సమ్మె హక్కులను కాలరాశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ ఆ కార్మికులకు కమ్యూనిస్టులు అండగా నిలిచారు. ఆ సమ్మెకు మద్దతుగా కూనంనేని సాంబశివరావు స్వయంగా ఆమరణ దీక్షకు దిగారు. రాష్ట్రంలో కార్మికుల హక్కులు కాలరాయబడకుండా ఉండేందుకు కమ్యూనిస్టులు సర్వం ధారపోశారు. ధర్నా చౌక్ పునరుద్ధరణకు మఖ్దూం భవన్‌లో దీక్షలు చేస్తూ కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర శక్తులు, పార్టీలు ఇతర సంఘాలకు పోరాట వేదికగా నిలిచింది సీపీఐ.



కమ్యూనిస్టు పార్టీలు ఖతం అని ప్రచారం చేస్తూ, మతవిద్వేషాలు సృష్టించే వారికి కూనంనేని సాంబశివరావు గెలుపు ఒక సవాల్. కమ్యూనిస్టులు లేని ప్రజాస్వామ్యం మనజాలదు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం లేనప్పటికీ కమ్యూనిస్టులు చట్టసభల వెలుపల తమ పోరాటాలను ఏ మాత్రం తగ్గనీయలేదు. పేదల కోసం అనేక చోట్ల గుడిసెలు వేయించారు. వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి తదితర జిల్లాల్లో వేల సంఖ్యలో నిరుపేదలకు గుడిసెలు వేసేందుకు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా సాంబశివరావు నాయకత్వంలో ఎర్రజెండా బాసటగా నిలిచింది. చివరకు రాష్ట్రంలో లౌకిక పునాదులను ధ్వంసం చేసేందుకు మోసపుటెత్తులతో దూసుకుపోతున్న బీజేపీకి కళ్ళెం వేసింది కూడా కమ్యూనిస్టు పార్టీనే. నాడు మునుగోడు ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న నిర్ణయంతో మతోన్మాద శక్తులకు ముకుతాడుపడింది. ఉప ఎన్నికల్లో పాలక పార్టీకి మద్దతు ఇచ్చినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ తన పోరాట బాటను విడవలేదు. గుడిసె వాసుల పోరాటం, ఆశ, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమ్మెలు, ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచింది. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రొఫెసర్లు, రచయితలపై ఉపా, దేశద్రోహ చట్టాలను పెట్టి వారిని అణచివేసేందుకు ప్రయత్నించినప్పుడు కమ్యూనిస్టులే వారికి అండగా నిలిచారు.

ఒకవైపు దేశాన్ని మతోన్మాదం కబళిస్తూ, నిరంకుశ పాలకులు చెలరేగిపోతున్న సమయంలో పార్లమెంటులో, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడం పెద్దలోటు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోరాటాల ద్వారా ప్రజల సమస్యలను, హక్కులను ప్రధాన స్రవంతిలో వినిపించడం ఒక భాగమైతే, చట్టసభల్లో అందుకు అనుగుణమైన చట్టాలను తీసుకురావడం, ఉన్న చట్టాలను కోల్పోకుండా బలమైన వాణిని వినిపించడంలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం అత్యవసరం. ధనబలం, కండబలం, మద్యంతో మకిలిపట్టిన ఎన్నికల విధానంలో కమ్యూనిస్టులు నెగ్గుకు రావడం సవాలుగా మారింది. అందుకే కూనంనేని సాంబశివరావు హైదరాబాదులో నిర్వహించిన మొదటి మీడియా సమావేశంలోనే, 'నేను శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేను మాత్రమే కాదు, అన్ని వామపక్ష పార్టీలకు, ప్రజాస్వామ్యవాదులకు, ప్రగతిశీల శక్తులందరికీ ప్రతినిధిని' అని ప్రకటించడం యావన్మందికీ ఆనందాన్ని కలిగించింది.

కమ్యూనిస్టు పార్టీలు ఖతం అని ప్రచారం చేస్తూ, మతం విద్వేషాలు సృష్టించే వారికి కూనంనేని గెలుపు ఒక సవాల్. తెలంగాణలోనే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోను కూనంనేని గెలుపుతో ఎర్రజెండా పార్టీలు, అభిమానులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ప్రజల గొంతుకు అభినందనలు తెలిపారు. ధనస్వామ్యం, కార్పొరేట్ స్వామ్యాల ఉక్కు పిడికిలిలో ఎన్నికల రంగం నలిగిపోతున్న తరుణంలో ఎన్నికలలో దామాషా ప్రాతినిధ్యం కొరకు పోరుసల్పి దామాషా ఎన్నికల విధానాన్ని సాధిస్తే కమ్యూనిస్టుల వాణి చట్టసభల్లో మరింత ప్రతిధ్వనించగలదు. కమ్యూనిస్టులు లేని ప్రజాస్వామ్యం మనజాలదు. కమ్యూనిస్టులు తక్షణమే అధికారంలోకి రాలేకపోయినా ప్రజల తరఫున గొంతు వినిపించడంలో, పోరాటం చేయడంలో కమ్యూనిస్టుపార్టీలను మించి మరేపార్టీ ఉండదనడంలో అతిశయోక్తి లేదు. ప్రజల గొంతుకగా ఉంటానంటున్న కూనంనేనికి ఆల్ ది బెస్ట్!



సిద్ధమైన క్యూలైన్లు



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయం

జయహో దుర్గాభవానీ

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు

- ఇంద్రకీలాద్రిపై అన్ని ఏర్పాట్లు పూర్తి
- గిరిప్రదక్షిణకు సర్వంసిద్ధం చేసిన అధికారులు
- అగ్ని ప్రతిష్ఠాపనతో ఐదు రోజుల ఉత్సవాలకు శ్రీకారం

వన్‌టౌన్, జనవరి 2 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ మహోత్సవాలకు సర్వంసిద్ధమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు బుధవారం ఉదయం 6.30 గంటలకు హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపన చేస్తారు. అనంతరం శతచండీయాగం జరుగుతుంది. తొలుత భక్తులు కృష్ణా స్నానఘాట్లలో స్నానమాచరించి, గిరిప్రదక్షిణ చేస్తారు. సుమారు ఏడు కిలోమీటర్ల నిడివిలో ఉండే గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 20 పాయింట్లలో మంచినీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణ అనంతరం భక్తులు కొండకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం ఇరుముడులు సమర్పించి అక్కడున్న గురుస్వాముల వద్ద మాల విరమణ చేస్తారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి తిరిగి స్నానఘాట్లలో స్నానాలు ఆచరించి, ప్రసాదాలు కొనుగోలు చేసుకుని, దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదాన్ని స్వీకరించి తిరుగు పయనమవుతారు.

ప్రత్యేక ఏర్పాట్లు

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీస్, రెవెన్యూ, దేవదాయ శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో దీక్షల విరమణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతాయి. ఇరుముడులు సమర్పించేందుకు నాలుగు హోమగుండాలను సిద్ధం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న కారణంగా పటిష్ట పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఘాట్ల వద్ద, కేశఖండన శాల వద్ద జల్లుస్నానాలు సిద్ధం చేశారు. కొరత లేకుండా లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సబ్‌కలెక్టర్ అదితిసింగ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, ఆలయ ఈవో కేఎస్ రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా, డీఐజీ విశాల్‌గున్నీ ఎప్పటికప్పుడు పరిశీలించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- భవానీ దీక్షల విరమణ నేపథ్యంలోనే..
- ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు

- 6లో..



పుస్తకాల పండుగ

34వ విజయవాడ పుస్తక మహోత్సవానికి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. మంగళవారం కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు బుక్ ఫెస్టివల్‌ను తిలకించారు.



మల్లాది అవుట్!

ఫట్టు



వైసీపీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం ప్రకటించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు హ్యాండివ్వగా, పశ్చిమలో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న వెలంపల్లికి సెంట్రల్‌లో అవకాశం కల్పించారు. ఇక పశ్చిమ సీటును మైనారిటీకి కేటాయించారు. అనూహ్యంగా షేక్ ఆసిఫ్ పేరును తెరపైకి తెచ్చిన వైసీపీ అధిష్ఠానం.. ముందే అనుకున్నట్టుగా మచిలీపట్నం నుంచి పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి అలియాస్ కిట్టూకు అవకాశం కల్పించారు.

సీటు



షేక్ ఆసిఫ్ (పశ్చిమ)



వెలంపల్లి శ్రీనివాస్ (సెంట్రల్)



పేర్ని కిట్టూ (మచిలీపట్నం)

- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు హ్యాండ్
- వెలంపల్లికి సెంట్రల్ నుంచి అవకాశం
- పశ్చిమలో అనూహ్యంగా ఆసిఫ్ పేరు
- ముందే అనుకున్నట్టు మచిలీపట్నం పేర్ని కిట్టూకే..
- మంత్రి జోగి రమేశ్‌కు పెడనలో సీటు కష్టమే
- తేల్చిచెప్పిన తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు
- ఎక్కడికక్కడ రగులుతున్న అసంతృప్తి జ్వాలలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీట్ల కేటాయింపుల విషయంలో అసంతృప్తులు రగిలిపోతున్నారు. ఓవైపు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు టికెట్ నిరాకరించడంపై ఆయన వర్గీయులు భగ్గుమంటుంటే, మరోవైపు పశ్చిమలో దళితులను గుర్తించకపోవడంపై మండిపడిన కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ త్వరలో రాజీనామా చేస్తానని ప్రకటించారు. మచిలీపట్నంలోనూ సీనియర్ వైసీపీ నాయకులు అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఎలాంటి అనుభవం లేని కిట్టూకి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే వెలంపల్లికి స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో ఆయన సెంట్రల్ వైపు చూస్తున్నారని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది.

పెడన నుంచి జోగి రమేశ్‌కు నో

మంత్రి జోగి రమేశ్‌కూ టికెట్ లేదన్న అంశంపై వైసీపీ పెద్దలు స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. ఆయన్ను మైలవరం నుంచి పోటీకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జోగి రమేశ్‌కు సీటు ఇవ్వాలంటూ కొద్దిరోజుల క్రితం వైసీపీ పెడన నాయకులు సమావేశం నిర్వహించారు. జోగి రమేశ్ పేరు ఒక్కడిదే చెబితే పస ఉండదని, మచిలీపట్నం ఎంపీ టికెట్ బాలశౌరికి ఇవ్వాల్సిందేనంటూ తీర్మానాలు చేసేశారు. ఈ విషయాన్ని బాలశౌరి సీరియస్‌గా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాన్ని ఊహించని జోగి రమేశ్ అనుచరులు హడావుడిగా మరోసారి విలేకరులను పిలిచి పొరపాటున ఎంపీ పేరు ప్రస్తావించినందుకు క్షమాపణ చెప్పుకొన్నారు. వాస్తవానికి ఈ హడావుడి జరగకముందే జోగి రమేశ్‌కు టికెట్ లేదన్న అంశంపై వైసీపీ పెద్దలు స్పష్టత ఇచ్చారు.

రంగంలోకి యడ్లపల్లి సుధీర్



జోగి రమేశ్

తనకు సీటు ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఇటీవలే జనసేన నుంచి వైసీపీలో చేరిన యడ్లపల్లి సుధీర్‌కు టికెట్ ఇప్పించేందుకు జోగి రమేశ్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. మంగళవారం కూడా ఆయన తాడేపల్లి పెద్దలను కలిశారు. జోగి ప్రతిపాదనపై తాడేపల్లి పెద్దలు సానుకూలంగా స్పందించలేదని సమాచారం.

ఉప్పాల కుటుంబానికి ఇస్తారా..?

ఉప్పాల రాము కానీ, ఆయన సతీమణి, ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్ హారిక కానీ వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలున్నాయని తెలుస్తోంది. జగన్ తన పాదయాత్ర సమయంలో పెడన వైసీపీ టికెట్ ఉప్పాల రాము తండ్రి రాంప్రసాద్‌కు ఇస్తానని మాట ఇచ్చారు. కానీ, 2019 ఎన్నికల్లో సమీకరణాలు కుదరక రాంప్రసాద్‌కు బదులు జోగికి పెడన టికెట్ ఇచ్చారు. ఆ తర్వాత ఉప్పాల రాంప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇచ్చేందుకు జగన్ సిద్ధపడినా అందుకు ఆయన ఒప్పుకోలేదు. తనకు ఎమ్మెల్సీ వద్దని, తనకు కానీ, తన కుటుంబ సభ్యులకు కానీ ఎప్పటికైనా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత రాంప్రసాద్ కోడలు ఉప్పాల హారికకు జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత మరొకరికి జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చేలా ముందే ఒప్పందం ఉండటం, అది 2024 తొలిభాగంలోనే పూర్తికానుండటంతో ఉప్పాల కుటుంబం ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తోంది. రాంప్రసాద్ మృతిచెందడంతో ఆయన కుమారుడు రాము లేదా కోడలు హారికకు టికెట్ దక్కవచ్చని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా మంగళవారం వైసీపీ పెద్దలను కలిశారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే సమీకరణాల దృష్ట్యా అవకాశం కల్పించలేమని, పార్టీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని వైసీపీ పెద్దలు చెప్పినట్లు సమాచారం.



రణన్నినాదం

అంగన్వాడీలు రోజురోజుకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. నగరంలోని ధర్నాచౌక్‌లో నిర్వహిస్తున్న ఆందోళనలో మంగళవారం కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

5లోగా విధుల్లోకి రావాలి

అంగన్వాడీలకు కలెక్టర్ ఆదేశాలు

కృష్ణలంక, జనవరి 2 : జిల్లాలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఈనెల 5వ తేదీలోగా విధుల్లో చేరాలని, అలా చేరని వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను, పోషణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అంగన్వాడీలు విధులకు హాజరుకావాలని ఆయన కోరారు.

జడ్పీ సీఈవోకు నెల రోజుల జైలు

ఉద్యోగుల అక్రమ బదిలీ కేసుపై హైకోర్టు ఆగ్రహం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉద్యోగుల అక్రమ బదిలీలపై న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించినందుకు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు హైకోర్టు నెల రోజుల జైలుశిక్ష విధించింది. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు ఆయన న్యాయస్థానం ముందు లొంగిపోయారు. అనంతరం కోర్టు ధిక్కరణపై కౌంటర్ దాఖలు చేయగా, హైకోర్టు స్టే ఇచ్చింది.

అవినీతి బదిలీలు..

ఉద్యోగుల ఐచ్ఛిక బదిలీలు మార్గదర్శకాలకు భిన్నంగా జరిగాయి. ఉద్యోగుల సౌకర్యం ప్రకారం బదిలీలను నిర్వహించాల్సింది పోయి, కుటుంబాలను ఇబ్బందులు పాలుచేసేలా కక్షపూరితంగా జరిపారు. అనారోగ్యంగా ఉన్నవారిని కనికరించకుండా తాము పనిచేసే ప్రాంతాల నుంచి వంద కిలోమీటర్ల దూరానికి బదిలీ చేశారు. బదిలీలను క్యాష్ చేసుకోవడంతో పాటు రాజకీయ ఒత్తిళ్లకు కూడా జ్యోతిబసు లొంగిపోయారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో కొందరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్‌కు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్‌కు యథాస్థానంలో పోస్టింగ్ కల్పించాలంటూ హైకోర్టు గతంలోనే ఆదేశాలిచ్చింది. జడ్పీ సీఈవో ఇచ్చిన బదిలీ ఆదేశాలను సస్పెండ్ చేసింది. అయినప్పటికీ జడ్పీ సీఈవో స్పందించలేదు. దీంతో బాధితుడు కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు ఆయన్ను ప్రశ్నించింది. ఈ బదిలీలు తాను చేయలేదని, చైర్మన్ చెప్పటం వల్లే చేశానని ఆయన కోర్టుకు వివరణ ఇచ్చారు. దీనిపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. నెల రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ ఆదేశాలిచ్చింది.

జడ్పీ సీసీ వల్లే..

ఈ బదిలీల వ్యవహారంలో జడ్పీ సీఈవో దోషిగా నిలబడటానికి జడ్పీ సీసీనే ప్రధాన కారణం. జడ్పీ చైర్‌పర్సన్ చెప్పారంటూ ఇష్టానుసారంగా బదిలీ చేశారు. సీఈవో జ్యోతిబసును అడ్డంగా ఇరికించారు. ప్రతి పనికీ ఒక రేటు, బదిలీలకు రేటు, డిప్యూటేషన్లకు రేటు, టెండర్లకు రేటు పెట్టి జిల్లా పరిషత్ ప్రతిష్ఠను దిగజార్చారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం.. చివరకు వాహనాల్లో ఇంధనాన్ని కూడా వదల్లేదు. తాజాగా సీఈవోకు కోర్టు జైలుశిక్ష విధించటంతో జడ్పీ పరువు పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఆలయాల విశిష్టత తెలిపేదే ఆలయవేదం

ఆలయంలో ప్రతి భాగం భక్తులకు తెలియాలి

▸ దేవదాయ శాఖ ఎన్ఆర్ఐ నిధుల విభాగ సమన్వయకర్త వేంకట సత్యబ్రహ్మాచార్య



పండుగలు, ఇతర పర్వదినాల్లోనే కాకుండా ఆయా వారాల విశిష్టతను బట్టి హిందువులు ఆలయాలకు వెళతారు.. ఆలయానికి వెళ్లడం, అక్కడ కొలువైన దేవుడిని దర్శించుకోవడంతో దైవ సందర్శన పూర్తయినట్టు కాదని అంటున్నారు దేవదాయ శాఖ ఎన్ఆర్ఐ నిధుల విభాగ సమన్వయకర్త కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య. ప్రతి ఆలయంలో సుమారుగా 42 ప్రధాన భాగాలు ఉంటాయని, వాటి గురించి భక్తులకు అవగాహన ఉండాలని చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీషు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఆయన ఆలయాలు, వాస్తు, శిల్పశాస్త్రంపై అనేక పుస్తకాలు రాశారు. తాజాగా 'ఆలయ వేదం', 'శివధర్మశాస్త్రం' పుస్తకాలను రాశారు. ఈ పుస్తకాల ఆవిష్కరణ పుస్తక మహోత్సవంలో మంగళవారం జరిగింది. ఈ పుస్తకాల సారాంశాన్ని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

? ఆలయ వేదం పుస్తకం రాయడానికి కారణం

వేదం అంటే తెలుసుకోదగినది అని అర్థం. ఆలయ వేదం అంటే.. ఆలయం గురించి తెలుసుకోవడం. ప్రతి ఆలయంలో గోపురం నుంచి ధ్వజస్తంభం వరకు కొన్ని ప్రధాన భాగాలు ఉంటాయి. వాటి గురించి ఆలయంలో ఉండే అర్చకులకు మాత్రమే కాదు భక్తులకూ తెలియాలి. అందుకోసమే ఈ పుస్తకం రాశాను.

? ఆలయాలకు ఎన్ని ప్రధాన భాగాలు ఉంటాయి

ప్రతి ఆలయానికి సుమారుగా 42 ప్రధాన భాగాలు ఉంటాయి. ఇందులో ఒకటి ఊర్ధ్వస్థితం.. అంటే గర్భాలయం నుంచి పై వరకు ఉండేది. రెండోది శైనాలయం.. అంటే తల భాగం నుంచి నాభి వరకు ఉండేది. దీన్నే ప్రసాదపురుషుడు అని అంటారు. వాటి గురించి భక్తులకు ఒక అవగాహన ఉండాలి.

? ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు రాశారు

ఇప్పటి వరకు 32 పుస్తకాలు రాశాను. వాటిలో మూడు శిల్ప శాస్త్రంపై రాశాను. మరో మూడు పుస్తకాలు రాశాను. వాటిని ముద్రణ చేయించాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వాస్తు శాస్త్రంపై అనేక పుస్తకాలు ముద్రణ అయ్యాయి. శిల్పశాస్త్రంపై పెద్దగా పుస్తకాలు ప్రచురణ కాలేదు. అందుకే శిల్ప శాస్త్రంపై రాస్తున్నాను.

? ఈ పుస్తకాలు రాయడానికి స్ఫూర్తి ఎవరకు

నేను ఇన్ని పుస్తకాలు రాశానంటే దానికి స్ఫూర్తి నాన్న కందుకూరి గోవిందేశ్వరశర్మ. శిల్పకళా భారతి అనే సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా ఈ పుస్తకాలను ముద్రణ చేయిస్తున్నాం. శిల్ప, ఆగమం, వాస్తు, వేద సాహిత్యం విభాగాల్లో పుస్తకాలను రాసి ప్రచురణ చేయిస్తున్నాం.


\- విజయవాడ సిటీలైఫ్ (ఆంధ్రజ్యోతి)

▸ భువనేశ్వరీ పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి

విజయవాడ కల్చరల్, జనవరి 2 : దేవాలయాలకు వెళ్లినప్పుడు వాటి నిర్మాణాలను, శిల్పాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని భువనేశ్వరీ పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి సూచించారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఆరో రోజు మంగళవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన మొదటి సభలో కందుకూరి వెంకట సత్య బ్రహ్మాచార్య రచించిన 'ఆలయవేదం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలో భాగంగా మన ప్రాచీన శాస్త్రాల ప్రకారం నిర్మించిన ఆలయాలు, చెక్కిన శిల్పాలు సూక్ష్మమైన, సునిశితమైన విశిష్టతలను కలిగి వుంటాయని వివరించారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు తొందర తొందరగా దైవదర్శనం చేసుకొని వచ్చేయడం కాకుండా దేవాలయ నిర్మాణ విశేషాలను తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. దేవాలయ శిల్పానికి సంబంధించి వివిధ భాషల్లో వున్న గ్రంథాలను తెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న సత్య బ్రహ్మాచార్యను అభినందించారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాసులు మొదటి ప్రతి స్వీకరించారు. ఇదే వేదికపై శైవాగమానికి చెందిన శివధర్మశాస్త్రం తెలుగు అనువాదాన్ని శ్రీశైల దేవస్థానం ఆస్థాన దైవజ్ఞులు బుట్టే వీరభద్ర సిద్ధాంతి ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ అంబడిపూడి నాగభూషణం తెలుగులోకి అనువదించి సంపాదకత్వం వహించారు. కె.రామకృష్ణ సభను నిర్వహించారు. ఎ.గోవర్ధన శాస్త్రి, భవిరి రవి ధన్యనుకరణ నిపుణులు సభలో పాల్గొన్నారు.



ఆలయవేదం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కమలానంద భారతి స్వామి, సత్యబ్రహ్మాచార్య తదితరులు





మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

ఆత్మానందమే జీవిత పరమార్థం

ఆత్మానందమే మానవ జీవత పరమార్థమని చిత్రకారుడు, రచయిత, కళావిమర్శకుడు సంజీవ్ దేవ్ జీవించి నిరూపించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై రెండో సభగా కీ.శే. సంజీవదేవ్, ఆవంత్స సోమసుందర్‌ల శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, మన చుట్టూ వున్న ప్రకృతిలోను, కళలలోను వున్న సౌందర్యాన్ని ఆస్వాదించడం తద్వారా ఆత్మానందాన్ని అనుభవించవచ్చునని పేర్కొన్నారు. హిమాలయాల సౌందర్యంతో గాఢంగా అనుభూతి చెంది, సౌందర్యాస్వాదనను ఆత్మాన్వేషణగా మార్చుకున్న వ్యక్తి సంజీవదేవ్ అని చెప్పారు. దేశంలో ప్రముఖ కళాకారులు కవులతో కలిసి స్నేహపూర్వకంగా జీవించిన వ్యక్తిగా సంజీవ్ దేవ్ అనేక విషయాల మీద సాధికారికంగా మాట్లాడేవారు, రాయగలిగే వారని చెప్పారు.

తెలుగు వచన కవిత్వానికి సోమసుందర్ సేవలు మరువలేనివని జీవితాంతం తెలుగులో కవిత్వాన్ని రచించి, ప్రచురించి, ప్రచారం చేసిన కవి ఆవంత్స సోమసుందర్ అని సభాధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ వివరించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆవంత్స సోమసుందర్ కవిత్వ శక్తిని తెలుసుకోవాలంటే ఆయన వజ్రాయుధం కవిత్వ సంకలనాన్ని చదవాలని జోస్యుల కృష్ణబాబు చెప్పారు. తెలంగాణా సాయుధ పోరాటానికి ఎంతో ఊపు తెచ్చిన ఆ కావ్యాన్ని అప్పటి ప్రభుత్వం నిషేధించడం ఆయన కవిత్వం ప్రజలలో కలిగించిన ఉత్తేజానికి తార్కాణమన్నారు. ఆధునిక సాహిత్యంలో అనేక మలుపులను అందుకుంటూ భావకవిత్వ సౌందర్యాన్ని, అభ్యుదయ కవిత్వ చైతన్యాన్ని మేళవించి ప్రజల వద్దకు తీసుకెళ్లిన ఘనత సోమసుందర్‌దేనన్నారు. మాక్సిం గోర్కీ అమ్మ నవలను తెలుగులోకి అనువదించారని చెప్పారు.



జీవనస్పర్శ నవలను ఆవిష్కరిస్తున్న వి.కృష్ణయ్య, కె.ఉషారాణి తదితరులు

సమాజానికి సాహిత్యమే దిక్సూచి

సమాజానికి సాహిత్యమే దిక్సూచి అని సమాజంలో జరుగుతున్న మార్పులు రావాలంటే ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత రచయితలకూ సాహిత్యానికి వుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై గనారా రచించి సాహితీ స్రవంతి ప్రచురించిన 'జీవన స్పర్శ' నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ నవల గత 30-40 ఏళ్లల్లో వచ్చిన సామాజిక మార్పులను చక్కగా అద్దం పట్టిందన్నారు. అధికారంలో ఉన్న వారు తమ అధికారాన్ని కాపాడుకొనేందుకు వాస్తవాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం సర్వసాధారణమైన ఈ కాలంలో వాటిని పరోక్షంగానూ, వ్యాఖ్యానపూరితంగానూ అందించాల్సిన బాధ్యత సాహిత్యకారులదేనన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకురాలు కె.ఉషారాణి పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రేమకథా నేపథ్యంలో సామాజిక మార్పులను, సంఘర్షణలను చక్కగా చిత్రీకరించారని వివరించారు. 70వ దశాబ్దంలో ఉద్యోగుల జీవితాలలో వచ్చిన మార్పులను, అంతఃసంఘర్షణను ఆద్యంతం ఆసక్తికరంగా చర్చించారని చెప్పారు. ఆధునిక జీవితంలో సాహిత్యానికి స్థానం తగ్గిపోవడం విచారకరమని సభకు అధ్యక్షత వహించిన వరప్రసాద్ అభిప్రాయపడ్డారు. సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ, ఒక మనిషి వ్యక్తిగత జీవితానికి, ఉద్యోగ జీవితానికి, సామాజిక జీవితానికి మధ్య జరిగే సంఘర్షణను రచయిత హృద్యంగా చిత్రీకరించారన్నారు.



కొసరాజు సినీ సాహిత్య వ్యాసావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మద్దుకూరి విజయకుమార్ తదితరులు

జానపద గేయాల రచనకు రారాజు కొసరాజు

జానపద గేయ రచనలలో కొసరాజు రారాజు అని, పల్లె ప్రజలలోని అమాయకత్వాన్ని, చైతన్యాన్ని తన గేయాలలో వాళ్ల భాషలోనే ప్రతిఫలింపచేసిన ఘనత కొసరాజు రాఘవయ్య చౌదరికే దక్కుతుందని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై మంగళవారం నిర్వహించిన చివరి సభలో మద్దుకూరి విజయ చంద్రహాస్ రచించిన 'కొసరాజు సినీ సాహిత్య వ్యాసావళి' పుస్తకాన్ని ఆయన తండ్రి మద్దుకూరి విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, తన పాటలలో శోకం, హాస్యం మిళాయించడం, సంభాషణాత్మక పాటలు కొసరాజు ప్రత్యేకత అని ఆయన వివరించారు. సినీసాహిత్య స్వర్ణయుగానికి కారణమైన గేయ రచయితల్లో కొసరాజు ప్రముఖులన్నారు. కొసరాజు గేయాల విశిష్టతను, చారిత్రక నేపథ్యాన్ని వివరించడంలో పుస్తక రచయిత చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. హాస్య పాత్రలకు పాటలు రాయడం వల్ల కొసరాజుకు దక్కాల్సినంత సాహిత్య గౌరవం దక్కలేదని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షత వహించిన ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ కల్మషం లేని సామాజిక చైతన్యాన్ని, చక్కని చిక్కని తెలుగు పదాలను తన పాటలతో అజరామరం చేసిన ఘనత కొసరాజుదేనన్నారు.

నేడు
సా.6 గంటలకు ఎన్‌బీటీ సంస్థ ఇండియా పిల్లల పుస్తకావిష్కరణ సభ,
7, 8 గంటలకు విశాలాంధ్ర పుస్తకావిష్కరణలు

ఆంగ్ల పుస్తకాలకు అధిక ప్రాధాన్యం

▸ పుస్తక మహోత్సవంలో కొత్త ఒరవడి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) పుస్తక మహోత్సవంలో ఈ ఏడాది కొత్త ఒరవడి కనిపిస్తోంది. పుస్తక మహోత్సవానికి వస్తున్న పాఠకుల్లో ఎక్కువ మంది ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. అటు పెద్దలు గానీ, ఇటు చిన్న పిల్లలు గానీ తెలుగు పుస్తకాలంటే ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. పుస్తక మహోత్సవానికి తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని వస్తున్నాయి. ఇప్పుడు ఎక్కువ మంది పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం సాగిస్తున్నందున తల్లిదండ్రులు ఇంగ్లీష్ పుస్తకాలను కొని ఇస్తున్నారు. ఇక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిప్లమో కోర్సులను చేస్తున్న విద్యార్థులు ఈ పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇంగ్లీష్ వివిధ ప్రముఖులు రాసిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. సాహిత్య పుస్తకాలను చదివే అభిలాష ఉన్న వాళ్లు ఆంగ్ల సాహిత్య పుస్తకాలను తీసుకుంటున్నారు. సాధారణంగా ఇంగ్లీష్ మీడియం చదువుతున్న చిన్నపిల్లలు కథల పుస్తకాలను కొనుగోలు చేయడం కనిపిస్తోంది. తల్లిదండ్రులు ఆయా బుక్‌స్టాల్స్‌లో తిప్పుతూ ఇంగ్లీష్ సాహిత్య పుస్తకాలను చూపించి పిల్లల అభిరుచికి తగిన పుస్తకాలను కొనిపిస్తున్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు పుస్తక మహోత్సవంలో కొనుగోలు చేయాల్సిన పుస్తకాల పేర్లను రాసి ఇస్తున్నారు. తల్లిదండ్రులకు చెప్పి ఆ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలు, యువతులు సైతం ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన పుస్తక మహోత్సవాల్లో ఇలాంటి ఒరవడి కనిపించలేదని స్పష్టం చేస్తున్నారు. గడచిన ఏడాది ఎక్కువగా తెలుగు సాహిత్య పుస్తకాలను కొనుగోలు చేశారని, ఈసారి మాత్రం పాఠకులు ట్రెండ్ మార్చారని చెబుతున్నారు.

యోగా పుస్తకాలంటే ఇష్టం : మునివర యోగి



పుస్తకం, యోగా... రెండూ ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. అందుకే నేను యోగాకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదువుతా. యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నందున దానివల్ల వృత్తికి దగ్గరగా ఉన్న పుస్తకాలను చదువుతా. పతంజలి యోగా సూత్ర వంటి పుస్తకాలను తరచుగా చదువుతుంటా. యోగాపై వివిధ గురువులు రాసిన పుస్తకాల్లో తత్వం బోధపడుతుంది.

గంటలో ఇంగ్లీష్ నేర్చుకోండి..

ఇంగ్లీష్.. ఇప్పుడు అందరికీ అవసరమైన ఆయుధంగా మారింది. ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు. ఇంగ్లీష్‌లో సరళంగా మాట్లాడడంతో పాటు రాయడానికి వీలుగా స్టాల్ నంబరు 58లో ఉన్న స్నేహ గ్రూపు అందుబాటులో ఉంచింది. ఒక్క గంటలో ఇంగ్లీష్ నేర్చుకోండి.. పేరుతో పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. రెండు పుస్తకాలను ఒక సెట్‌గా విక్రయిస్తున్నారు. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.20లు. ఆరు పుస్తకాలు ఉన్న మరో సెట్‌ను రూ.100లకు విక్రయిస్తున్నారు.

చైనా ముద్రణలు

చూడటానికి పుస్తకాలు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వాటిని పట్టుకోగానే తెలియని అనుభూతి కలుగుతుంది. ప్రతీ పుట ఎంతో సున్నితంగా ఉంటుంది. పుస్తకాల విక్రయాలు ఇక్కడ జరుగుతున్నా, వాటి ముద్రణ మాత్రం చైనాలో జరిగింది. విశాలాంధ్ర బుక్‌హౌస్ స్టాల్‌లో ఈ చైనా ముద్రణ పుస్తకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగులో చందమామ కథలు, మహాభారతం, బామ్మ చెప్పిన కథలు, అతిలోక కథలు పుస్తకాలతోపాటు ఇంగ్లీష్‌లో ది రామాయణ్, ది మహాభారతం పుస్తకాలను చైనాలో ముద్రణ చేయించారు. కొనుగోలు విషయం ఎలా ఉన్నా ఈ పుస్తకాలను తిలకించడానికి పాఠకులు ఎగబడుతున్నారు.

జిల్లాలో రసాయన విపత్తు నిర్వహణకు చర్యలు

▸ పారిశ్రామిక స్పందన కమిటీ సమావేశంలో కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 2 : జిల్లాలోని పరిశ్రమల్లో రసాయన విపత్తు నిర్వహణకు సంబంధించి అనుభవమున్న సంస్థతో ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక (ఓఈపీ)కు రూపకల్పన చేయనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పారిశ్రామిక అత్యవసర స్పందన కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక రూపకల్పనపై వివిధ శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులు సభ్యులుగా గల కమిటీ చర్చించింది. కలెక్టర్ దిల్లీరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, సభ్యులతో కలిసి ప్రణాళిక రూపకల్పన బాధ్యతలను చోళమండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ లిమిటెడ్ (చెన్నై)కు అప్పగించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో భారీ ప్రమాదాలు జరిగేందుకు అవకాశమున్నవి (మేజర్ యాక్సిడెంట్ హాజార్డ్స్) ఎనిమిది పరిశ్రమలున్నాయని, పరిశ్రమల్లో విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలు కల్పించే ఆఫ్‌సైట్ అత్యవసర ప్రణాళిక రూపకల్పనకు చోళమండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ లిమిటెడ్‌ను కమిటీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ముసాయిదా ప్రణాళిక ఆధారంగా మాక్‌డ్రిల్ నిర్వహించడం జరుగుతుందని, ఆ తర్వాత తుది ప్రణాళికను ఖరారు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వో ఏవీ శంకరరావు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ టి.రాజు, ఐవోసీఎల్ టెర్మినల్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ ఐ.శ్రీనివాస్, బీపీసీఎల్ ప్లాంట్ హెడ్ సుభాష్‌చందు, హెచ్‌పీసీఎల్ టెర్మినల్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ బి.రాజశేఖర్, ఎన్‌టీటీపీఎస్ (కొండపల్లి) ప్లాంట్ హెడ్ ఎం.నాగబాబు, ఐఓసీఎల్ బాట్లింగ్ ప్లాంట్ హెడ్ బి.రామారావు, గెయిల్ ఇండియా ప్లాంట్ హెడ్ ఎం.శ్రీనివాసులు, హెచ్‌పీసీఎల్ ప్లాంట్ హెడ్ ఎం.నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు జిల్లాలో ప్రణాళిక ప్రకారం జరుగుతున్నట్టు కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. మంగళవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పోటీలను కలెక్టర్ పరిశీలించారు. క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఓటు హక్కు హరింపు వివాదం!

▸ కలెక్టర్‌కు అప్పీల్.. కోర్టును ఆశ్రయించేందుకు బాధితుల సన్నద్ధం

▸ వారిపై కేసు పెడతానంటూ బెదిరించిన తహసీల్దార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వైసీపీ కార్యకర్తల ఇంటర్ స్టేట్ బోగస్ ఓట్ల తొలగింపునకు ఫిర్యాదులు ఇచ్చారన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళకు లొంగి.. ఊరిలో ఉండటం లేరన్న కారణంతో వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు చేపట్టడం నందిగామ నియోజకవర్గంలో వివాదాస్పదంగా మారుతోంది. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో, అధికార యంత్రాంగం రాజకీయ కోణంలో చేసిన పొరపాట్లు న్యాయస్థానంలో వారికి చెంపపెట్టుగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలగింపునకు గురైన ఓటర్లు కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. వారు స్థానికంగా లేరన్న ఒకే ఒక్క కారణంతో అధికారులు వారి ఓట్లను హడావిడిగా తొలగించారు. వారు ఎక్కడ ఉంటున్నారో అక్కడికి వారి ఓటు హక్కును బదిలీ చేయాలన్న విషయాన్ని మరిచిపోయారు. ఈ చిన్న తప్పిదం కారణంగా ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారులు ఓట హక్కు హరింపు వివాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓటరు తన ఓటు హక్కును స్వగ్రామంలో కలిగి ఉండటానికి పూర్తి స్వేచ్ఛ ఉంది. వ్యక్తి పర్మినెంట్ అడ్రస్ అదే కాబట్టి అక్కడ ఉండటం లేదన్న కారణంతో ఓటు హక్కును హరించి వేయటం అన్యాయం అవుతుంది.

కలెక్టర్‌కు అప్పీల్

రెవెన్యూ అధికారులు తమ ఓట్లను అన్యాయంగా తొలగించారని పెద్దాపురం గ్రామంలోని టీడీపీ సానుభూతి ఓటర్లు మంగళవారం విజయవాడలోని కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ కార్యాలయంలో అప్పీల్ చేశారు. తమకు మరెక్కడా ఓటు హక్కు లేదని, తమ ఆధార్ కార్డులు, అన్ని గుర్తింపు పత్రాలు కూడా తమ గ్రామంలోనే ఉన్నాయని, పొట్ట కూటికోసం వేరే ఊళ్ళలో పనులు చేసుకుంటున్నామని తమ ఓట్లు తొలగించటం అన్యాయమని పేర్కొన్నారు.

కేసు పెడతా .. వీరులపాడు తహసీల్దార్ ఓవరాక్షన్

తమ ఓట్ల తొలగింపుపై ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తే కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందీ రావాల్సిందేనని తహసీల్దార్ వాదులాటకు దిగారు. భార్య ఓటు హక్కు తొలగింపుపై భర్తకు ప్రొసీడింగ్ ఇవ్వటంతో తప్పేముందని అప్పీల్ చేసుకోవటానికి అవకాశం కల్పించాలని కోరారు. దీంతో తహసీల్దార్‌కు చిర్రెత్తుకొచ్చింది. తన మీద దౌర్జన్యం చేస్తున్నారంటూ కేసు పెడతానంటూ హెచ్చరించారు. దీంతో కొంత సేపు గందరగోళం నెలకొంది. చివరికి కొన్ని ప్రొసీడింగ్స్‌తో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అప్పీల్ చేశారు.

జీతాలు పెంచకుంటే ఉరితాళ్లే గతి

▸ అంగన్వాడీ, సర్వశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

మచిలీపట్నం టౌన్, జనవరి 2 : జీతాలు పెంచకుంటే తమకు ఉరితాళ్లే శరణ్యమని అంగన్వాడీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేశారు. మంగళవారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద 22వ రోజు నిరసన ప్రదర్శనలో అంగన్వాడీ కార్యకర్తలు చీరలతో ఉరితాళ్లు బిగించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అంగన్వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ప్రాజెక్టు సంఘ ప్రధాన కార్యదర్శి రిజీనారాణి కార్యక్రమానికి నాయకత్వం వహించారు. శిబిరంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వైనరసింహారావు మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు 22 రోజులుగా సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టు లేదన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చేయాలన్నారు. కృష్ణా జిల్లా కన్వీనర్ టి.తాతయ్య, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



చెట్టుకు ఉరితాళ్లు బిగించి సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ప్రదర్శన

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ప్రదర్శన

జీతాలు పెంచకుంటే ఉరితాడే గతి అంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద 14వ రోజు రిలే నిరాహార దీక్షా శిబిరంలో మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ నేత పోతురాజు మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కుటుంబాన్ని పోషించడం భారమవుతోందన్నారు. ఎన్నికల్లో జీతాలు పెంచుతానని సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వాగ్దానం నిలుపుకోవాలన్నారు.

అణచివేత చర్యలు మాని.. హామీలు అమలు చేయండి

విద్యాధరపురం : అంగన్వాడీ, సర్వశిక్షాభియాన్, మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అణచివేత చర్యలు మాని ఆచరణలో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు, బొండా ఉమామహేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా గద్దె అనురాధ, అంగన్వాడీల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీతలు ధర్నాచౌక్‌లో మంగళవారం దీక్షా శిబిరాలను సందర్శించి ఆందోళనలకు సంఘీభావం తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు చెప్పారు. పండుగలు సైతం సమ్మెలోనే గడిచిపోయాయని, ఇల్లు, వాకిలి వదిలి తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన శిబిరాలలో ఆందోళన చేస్తున్నారన్నారు. కార్మికులు సమ్మె చేస్తుంటే వారితో మాట్లాడే తీరిక కూడా ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు.

భవానీ దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్లు

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, జనవరి 2 : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న భవానీదీక్షల విరమణలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు అన్నారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి మూడు రోజులు రోజుకు 50 వేల చొప్పున ,శని, ఆదివారాలలో రోజుకు లక్ష మంది చొప్పున భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. స్నాన ఘాట్ల వద్ద 800 షవర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కేశఖండన శాలలు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కనకదుర్గనగర్‌లో 11 లడ్డూ ప్రసాదాల విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు కొండ పైన, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద అదనంగా ప్రసాదం విక్రయ కౌంటర్లు ఉంటాయన్నారు. 10 లక్షల మంచినీటి ప్యాకెట్లను సిద్ధం చేసి ఉంచినట్టు తెలిపారు. ఇరుముడుల స్వీకరణకు 90 స్టాండ్లు ఏర్పాటు చేశామని రిజర్వ్‌లో మరో 10 ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ 5 నుంచి 6వేల మందికి అన్న ప్రసాదాన్ని అందించనున్నట్లు చెప్పారు. భవానీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితీ సింగ్, ఆలయ ఈవో కేఎస్ రామారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు రూ.300, రూ.100 దర్శనం టికెట్లు అందుబాటులో ఉంటాయని, రెండు క్యూలు ఉచిత దర్శనం కోసం ఉంటాయని ఆలయ ఈవో రామారావు చెప్పారు. రూ.300 టికెట్ భక్తులకు బంగారు వాకిలి దర్శనం ఉంటుందని తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు పున్నమి ఘాట్, వీఎంసీ కార్యాలయం నుంచి బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేవస్థానంలో ఉన్న 150 మంది సెక్యూరిటీ సిబ్బందితో పాటు అదనంగా మూడువందల మందిని నియమించినట్టు చెప్పారు. 157 మంది దేవస్థాన పారిశుధ్య సిబ్బంది, అదనంగా 150 మందితో పాటు కార్పొరేషన్ ద్వారా మరో 800 మందితో పారిశుధ్య నిర్వహణ జరుగుతుందన్నారు. మొత్తంగా 255 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్‌లను రథం సెంటర్ వద్ద వీఎంసీ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్త్రీలకు దుస్తులు మార్చుకునేందుకు తగు ఏర్పాట్లు చేసామన్నారు.

భవానీదీక్షల విరమణల సందర్భంగా విద్యుద్దీప శోభతో ఇంద్రకీలాద్రి వెలుగొందుతోంది. రాజగోపురం, మహామండపం తదితరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. దుర్గగుడి పరసర ప్రాంతాలలో అన్ని మార్గాల్లో లైట్లను ఏర్పాటు చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంగళవారం సాయంత్రానికి విధుల్లోకి చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మొవ్వ పద్మ

సెంటినీ సిటీలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

▸ హాస్పిటల్ ఎండీ, చైర్మన్ డాక్టర్ మొవ్వ పద్మ

మాచవరం, జనవరి 2 : పదిమందికి పైగా సూపర్ స్పెషాలిటీ వైద్యుల పర్యవేక్షణలో సెంటినీ సిటీ హాస్పిటల్ వైద్యసేవలు నేటినుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని సెంటినీ హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్, చైర్మన్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. సూర్యారావుపేటలోని కాళేశ్వరరావు రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన సెంటినీ సిటీ హాస్పిటల్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 12 సంవత్సరాలుగా సెంటినీ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులచే ప్రజలకు చేరువగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నగరంలోనే తొలిసారిగా స్టార్ క్లాస్ డీలక్స్ రూమ్స్‌తో 24 గంటలు రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. క్రిటికల్ కేర్ సర్వీసులు, పల్మనాలజీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, జనరల్, లేప్రోస్కోపి సర్జరీ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు. మూడు ల్యామినరీ థియేటర్లలో అత్యాధునిక క్యాత్‌ల్యాబ్, 1.5 టెస్లా ఎమ్మారై వంటి సౌకర్యాలన్ని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసినట్టు డాక్టర్ మొవ్వ పద్మ పేర్కొన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ మొవ్వ ఆనంద్, డైరక్టర్ మొవ్వ విష్ణు, సీఈవో సీఎల్ఎన్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

గుణదల : ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణలు జరుగుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు అవాంతరాలు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నట్టు నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా తెలిపారు. నగర ప్రజలు, భవానీలు ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించడం జరిగిందన్నారు. హైదరాబాద్-విశాఖపట్నం రూట్లలో, చెన్నై-హైదరాబాద్ రూట్లలో వాహనాలను ఇతర మార్గాల నుంచి మళ్లించనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే ఆర్టీసీ బస్సులు యథావిధిగా గొల్లపూడి వై జంక్షన్-స్వాతి జంక్షన్-కనకదుర్గా ఫ్లైఓవర్-రాజీవ్ గాంధీ పార్క్-పీఎన్‌బీఎస్ చేరుకోవాల్సి ఉంటుందన్నారు. విజయవాడ సిటీబస్టాండ్ నుంచి ఇబ్రహీంపట్నం, భవానీపురం, పాలప్రాజెక్టు, వైఎస్ఆర్ కాలనీ వైపు వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సుల మళ్లింపునకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు. కనకదుర్గా ఫ్లైఓవర్ నుంచి లేదా చిట్టినగర్ టెన్నల్ నుంచి గాని భవానీపురం వైపునకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. కుమ్మరిపాలెం నుంచి ఘాట్ రోడ్, ఘాట్ రోడ్ నుంచి కుమ్మరిపాలెం వైపునకు ఏవిధమైన వాహనాలను అనుమతించేది లేదన్నారు. తాడేపల్లి -విజయవాడ వైపు ప్రకాశం బ్యారేజి మీదుగా ఏ విధమైన వాహనాలు అనుమతించబడవన్నారు. హైకోర్టు, సెక్రటేరియట్ వెళ్లాల్సిన ఉద్యోగులు కనకదుర్గమ్మ వారధి మీదుగా వెళ్లాలని చెప్పారు. కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు వారి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించడం జరిగిందన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలని, లేదంటే చర్యలు తప్పవని చెప్పారు. గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో కార్లు పార్కింగ్‌కు కేటాయించడం జరిగిందన్నారు. కుమ్మరిపాలెం వద్దగల లోటస్ ల్యాండ్ అపార్ట్‌మెంట్ వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉంటుందని చెప్పారు. బస్సులు, కార్లు పున్నమి ఘాట్, భవానీ ఘాట్, పాత పోమ కంపెనీ వారి స్థలం, సితార సెంటర్, బీఆర్టీఎస్ రోడ్, గాంధీనగర్ జింఖాన గ్రౌండ్స్, వద్ద పార్కింగ్ చేసుకుని అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

డిజిటల్ మీడియాతో మార్కెటింగ్.. విప్లవాత్మక మార్పులు

మొగల్రాజపురం, జనవరి 2: వాణిజ్య రంగంలో డిజిటల్ మీడియా ద్వారా మార్కెటింగ్ అనేది విప్లవాత్మక మార్పు అని, దీనిని వ్యాపారులు ఉపయోగించుకుని తమ ఉత్పత్తులను ఇంటి వద్దకే పంపడం వల్ల ఉపాధి పొందుతున్నారని బోటిక్ నిపుణులు, వ్యాపారవేత్త సీహెచ్ సుశీల చెప్పారు. మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గతంలో ఉత్పత్తులను విక్రయించడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఉంటే ఇపుడు సోషల్ మీడియా ఉందని చెప్పారు. జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. సంస్థ శిక్షకులు, సిబ్బంది,శిక్షణార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గవర్నర్‌పేట, జనవరి 2: గోపాలరెడ్డి రోడ్డులోని సీవీఆర్ కార్పొరేషన్ స్కూల్, సూర్యారావుపేటలోని శ్రీ కర్నాటి రామ్మోహనరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను మంగళవారం 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి పంపిణీ చేశారు. సీవీఆర్ స్కూల్ హెచ్.ఎం. సుబ్రహ్మణ్యం, శ్రీ కర్నాటి రామ్మోహనరావు, స్కూల్ హెచ్ఎం ఎం. నాంచారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

80 మంది టీడీపీలో చేరిక

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 2: ప్రజలు నమ్మి ఓటు వేసి గెలిపిస్తే తన అరాచక, అవినీతి, తుగ్లక్ పాలనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రోజు రోజుకు ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. నియోజకవర్గంలోని 80 మంది యువకులు మంగళవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే యువతను అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నేతలు సాంబశివరావు, షైడి శ్రీను, బెజ్జం జైపాల్ పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణకు

నగరపాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు

- ● 300 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు
- ● 24 గంటలూ మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రత్యేక సిబ్బంది
- ● 8 ప్రాంతాల్లో 16లక్షల మంచినీటి ప్యాకెట్లు ఏర్పాటు



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, జనవరి 2: భవానీ దీక్షల విరమణకు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఏర్పాట్లు చేసింది. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఏర్పాట్లపై మంగళవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు అందుబాటులో ఉండేలా వివిధ ప్రదేశాల్లో 300 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. 24 గంటలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బందిని నియమించి టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం ఉండేలా చర్యలు తీసుకున్నారు. మరుగుదొడ్లలో నిరంతరం నీటి సరఫరా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. దేవస్థానం పరిసర ప్రాంతాలతో పాటు భవానీలు గిరి ప్రదక్షణ చేయు మార్గములో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి తాగునీరు ట్యాంక్‌లతోపాటు, మంచినీటి ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. యాత్రికుల సౌకర్యార్థం ఎస్టేట్ విభాగం ద్వారా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద, రాజీవ్‌గాంధీపార్కు, రథంసెంటర్, హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మపాదాల వద్ద సామాన్లు, పాదరక్షలు భద్రపరిచేందుకు 24 గంటలు పని చేసేలా 5 ప్రదేశాల్లో క్లోక్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు.

పారిశుధ్యానికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజారోగ్య విభాగం ద్వారా పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పారిశుధ్యానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూడు షిఫ్టులలో 24 గంటలు అన్ని ప్రాంతాల్లో శుభ్రం చేసి తగు క్రిమి సంహారకాలు జల్లుతూ ఫాగింగ్ వంటి చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు విడిచే బట్టలను కన్వీయర్ బెల్ట్ ద్వారా నిరంతరం ట్రాక్టర్లతో తరలించేలా ఏర్పాటు చేశారు. సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విధ్వంసకారులకే వైసీపీలో పదవులు, టికెట్లు

భవిష్యత్తుకు గ్యారెంటీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


10వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 2 : విధ్వంసం చేసిన వారికే వైసీపీలో పదవులు, టికెట్లు ఇస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలో 10వ డివిజన్‌లోని న్యూ పోస్టల్ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలను గద్దె ఇంటింటికి పంపిణీ చేశారు. జగన్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రజల సానుభూతి పొంది వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి కొంతమంది నాయకులు చెప్పే మాటలు వినకుండా ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. జగన్ ప్రభుత్వం వేధింపుల వల్ల పారిశ్రామికవేత్తలు పొరుగు రాష్ట్రాలకు తరలి వెళుతున్నారన్నారు. కరోనా వైరస్ వల్ల జరిగిన మరణాల కంటే జగన్ విక్రయించిన మద్యం తాగి మరణించిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని అన్నారు. గంజాయి విక్రయాలు జగన్ పాలనలో విచ్చలవిడిగా జరుగుతున్నాయని అన్నారు. కల్తీ మద్యాన్ని విక్రయించి జగన్ సొమ్ము చేసుకుంటుంటే, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు రాష్ట్రంలో గంజాయిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని తెలిపారు. టీడీపి ఆఫీస్‌పై దాడి చేసి 25 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారు తూర్పు నియోజకవర్గ పరిధిలోని నాయకులేనని చెప్పారు. మా నాన్నను చూసి ఓట్లేయండి నన్ను చూసి ఓట్లేయండి అని నాయకులు అడుగుతూ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, కాలనీ పెద్దలు మన్నె వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షులు పి. శ్రీనివాస్, పొలగాని జగన్‌మోహన్‌రావు, సీహెచ్ గాంధీ, ఈ. రామారావు, డి. చంద్రశేఖర్, పి. ఈశ్వర్, వి. శ్రీనివాస్, పి. దర్శిత్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి తప్పదు: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: ఒక్క ఛాన్స్ అని బూటకపు హామీలు ఇచ్చి గద్దె నెక్కిన జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 24వ డివిజన్ విజయ టాకీస్ వద్ద మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానిక ప్రజలకు వివరించి, టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే నేనేంటో చూపిస్తానన్న జగన్ ప్రగల్భాలు ఉత్తర ప్రగల్భాలే అని, జగన్ ఇక నో ఛాన్స్ అని పేర్కొన్నారు. నవనీతం సాంబశివరావు, డివిజన్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ వ్యతిరేక విధానాలు వివరిస్తూ టిఫిన్ వేస్తున్న బొండా ఉమా

18 నిండిన ప్రతి ఒక్కరూ

ఓటరుగా నమోదు చేయించుకోవాలి

ఎలక్టోరల్ రిజస్ట్రేషన్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ ●కొత్త ఓటర్లకు ప్రత్యేక శిబిరాలు

చిట్టినగర్, జనవరి 2: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించకోవాలని, కొత్త ఓటర్లకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని సెంట్రల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజస్ట్రేషన్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కళాశాలలో, సచివాలయాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని ఏఆర్‌వోలను ఆదేశించారు. 18 ఏళ్లు నిండినప్పటికి అవగాహన లేక కొత్త ఓటరుగా నమోదు చేసుకోని వారికి అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మూడు నియోజకవర్గాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఏఆర్వోలను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు నవనీతం సాంబశివరావు(టీడీపీ), వై సుందర్‌పాల్(వైసీపీ) వెంకట్(బీజేపీ) సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, జోనల్ కమిషనర్-2మల్యాద్రి, సెంట్రల్, నార్త్ తహసీల్దార్లు వెన్నల శ్రీను, ఎం.మాధురి పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని వ్యక్తిపై దాడి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 2 : ఇంటి అద్దె చెల్లించలేదని వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఐలం సంజయ్ రామానగర్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అయితే గత ఐదు నెలల నుంచి సంజయ్ ఇంటి యజమానికి అద్దె చెల్లించడం లేదు. దీంతో ఇంటి యజమాని ఇంటికి తాళం వేశాడు. ఈ విషయమై ఇంటి యజమానితో పాటు మరో ముగ్గురు సంజయ్‌తో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో సంజయ్ తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



విద్యాధరపురం, జనవరి 2: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని మంగళవారం ఆయన స్వగృహంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నూతన డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యలమంచిలి నాగేశ్వరరావుకు ఘన నివాళి



పటమట, జనవరి 2 : మాజీ ఎమ్మెల్యే యలమంచిలి నాగేశ్వరరావు 19వ వర్థంతి వేడుకలు పటమట రైతుబజార్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. యలమంచిలి రవి అనుచరుడు పసుపులేటి వేణు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా యలమంచిలి నాగేశ్వరరావు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ యలమంచిలి నాగేశ్వరరావు ఆశయాలు ముందుకు తీసుకు వెళతామని అన్నారు. అనంతరం పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ధనుంజయ్, రావి శారద, రేఖా బాబు, శెట్టి ఆదినారాయణ, బూచి సురేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో శ్రీ చైతన్య విద్యార్థినికి బంగారు పతకం


చంద్రికనాయుడును అభినందిస్తున్న డీన్ హరిబాబు

మొగల్రాజపురం, జనవరి 2: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యత సాధించాలని దీని వల్ల ఏకాగ్రత, శారీరక, మానసిక ఎదుగుదల, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని 6వ డివిజన్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్ డీన్ హరిబాబు అన్నారు. గత నెల 20, 29 తేదీల్లో కృష్ణలంక హైస్కూలులో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జూనియర్ విభాగంలో సీనియర్ ఎంపీసీ విద్యార్థిని యదల చంద్రికనాయుడు జూనియర్ విభాగంలో బంగారుపతకం సాధించిన సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రికనాయుడు జాతీయ పోటీలకు ఎంపికవడం అభినందనీయం అన్నారు. ప్రిన్సిపాల్ ఎన్. గోకర్ణేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నీలిమ, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పాయకాపురం, జనవరి 2 : అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీ రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని నున్న రూరల్ పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుడి కాలు తెగిపడి పట్టాల పక్కన ఉందన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు నీలం రంగు ప్యాంట్, షర్టు ధరించి ఉన్నాడని, వయస్సు సుమారు 38 ఏళ్లుఉంటాయని పోలీసులు తెలిపారు. ట్రాక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడా లేక రైలు నుంచి కింద పడి మృతి చెందాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం పలువురు విద్యార్థులకు గాయాలు

ఇబ్రహీంపట్నం, జనవరి 2: గుంటుపల్లి డాన్‌బోస్కో హైస్కూల్‌కు చెందిన బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో నలుగురు విద్యార్థులు గాయాల పాలయ్యారు. వీటీపీఎస్ సీ.కాలనీ వద్ద మంగళవారం పిల్లలను ఎక్కించుకున్న స్కూల్ బస్సు సీ కాలనీ వద్దకు బస్సు రాగానే స్పీడ్ బ్రేకర్లను ముందుగా గమనించలేదు. సడన్ బ్రేక్‌వేయడంతో బస్సులోని నలుగురు విద్యార్థులు కిందపడిపోయి గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి బస్సును స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాంటి వారికి బస్సులు అప్పగించి తమ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడటం ఏమిటని పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో నేటి నుంచి ఆటల పోటీలు

గన్నవరం, జనవరి 2 : గన్నవరం ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలలో బుధవారం నుంచి 12వ అంతర్ కళాశాలల ఆటల, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తు న్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పివిఎస్ కిషోర్ తెలిపారు. శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యా లయం పరిధిలోని నాలుగు కళాశాలలు, ఒక డెయిరీ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని, అంతర్ కళాశాలల పోటీలను ఐఏఎస్ గోపాలకృష్ణ ద్వివేది, విశ్వవిద్యా లయం ఉప కులపతి డాక్టర్ పి.సంపత్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

తిరువూరు, జనవరి 2: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్ 27ను రద్దు చేయాలంటూ బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన చట్టం భూకబ్జాదారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. ప్రజలకు ఇది పూర్తి వ్యతిరేకంగా ఉందని న్యాయవాదులు అన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సంకురాత్రి జనార్ధనరావు, ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజనరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, చింతల వెంకటరెడ్డి, రాజేంద్రబాబు, దారా మాధవరావు పాల్గొన్నారు.

ఆగిన కృష్ణా జలాలు.. మహిళల ఆందోళన

ఎ.కొండూరు, జనవరి 2 : మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న కృష్ణా జలాలు నిలిచిపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో చీమలపాడు పెద్దతండాలో గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సీపీఎం నేత వి.ఆనందరావు మాట్లాడుతూ పది రోజులుగా కృష్ణా జలాలు సరఫరా నిలిచిపోవడంతో 15 గిరిజన తండాల్లో తాగు నీటి సమస్య ఏర్పడిందన్నారు.

వైద్యుల సూచన మేరకు తాగు నీరు, ఆహారం, ఇతర వంటల్లో కృష్ణా జలాలు వినియోగిస్తుండటంతో కొంతమేర అనారోగ్య సమస్య నుంచి ఉపశమనం పొందుతున్నాం. ఈ సమయంలో కృష్ణా జలాలు నిలివేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు. అమ్మిరెడ్డి, దుర్గ, లలిత, సక్రి, జమలమ్మ, లక్ష్మి, చంటి పాల్గొన్నారు.

75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

గంపలగూడెం, జనవరి 2: గంపలగూడెంలో పఠాన్ అమిద్ ఖాన్ రేషన్ షాపులో 55 క్వింటాళ్లు, సొబ్బాలలో అడపా వెంకట సత్యనారాయణ కోళ్ల ఫాంలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, డీటీ శివనాగరాజు మంగళవారం రాత్రి దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హనుమాన్‌జంక్షన్, జనవరి 2: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరుగొలను వద్ద గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓగిరాల గ్రామానికి చెందిన కఠారి దుర్గా ప్రసాద్(24) విజయ వాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగ ళవారం మృతి చెందాడు. ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న గుడివాడ రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో దుర్గా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న ఒకరి అరెస్టు

గన్నవరం, జనవరి 2: మద్యం అక్రమంగా తరలిస్తున్న ఒకరిని పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సీఐ కనకారావు ఆధ్వర్యంలో పోలీస్ చెక్‌పోస్టులను తనిఖీ చేస్తుండగా కేసరపల్లికి చెందిన శివాజీ 49 క్వార్టర్ సీసాలను తీసుకు వెళుతుండగా పట్టుకున్నారు. అతనితో పాటు ద్విచక్రవాహనం, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు శ్రీనివాస్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

భారతీయుడు 2 ముగించారా?



కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియన్ 2'. (తెలుగులో 'భారతీయుడు 2). గతంలో శంకర్ దర్శకుడిగా వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది సీక్వెల్. నత్త నడకను తలపించిన ఈ చిత్రం షూటింగ్ ఎట్టకేలకు ముగిసిందని తెలుస్తోంది. కమల్‌హాసన్ యూనిట్‌తో కలసి దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ ఫొటోను బట్టి 'ఇండియన్ 2' చిత్రీకరణ ముగిసిందని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కమల్‌హాసన్ తన పోర్షన్ పూర్తి చేశారని మరికొందరు చెబుతున్నారు. నిజం ఏమిటనేదానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే దర్శకుడు శంకర్ ఈ ఫొటోలో కనిపించకపోవడం విశేషం. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

అప్పుడు అక్కడే ఉన్నా



జపాన్ వరుస భూకంప ఘటనలపై ఎన్టీఆర్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిని కుటుంబంతో కలసి సెలబ్రేట్ చేసుకునేందుకు గత వారం ఆయన జపాన్ వెళ్లారు. భూకంప హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రాత్రి ఆయన సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నేను క్షేమంగా ఇండియాకు చేరుకున్నాను. గతవారం అంతా నేను అక్కడే గడిపాను. వరుస భూకంప ఘటనలు జపాన్‌ను కుదిపేయడం బాధాకరం. అక్కడి ప్రజలు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. హిందీలో 'వార్ 2' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

క్రేజీ కాంబినేషన్ షురూ?







ఒకరితో సినిమా అనుకోవడం.. ఇంకొకరితో సినిమా చేయడం ఇవన్నీ పరిశ్రమలో కామన్. 'గుంటూరుకారం' తర్వాత తివిక్రమ్ సినిమా బన్నీతో ఉంటుందని అందరూ అనుకున్నారు. అయితే.. బన్నీ 'పుష్ప2' షూటింగ్ ఇప్పుడయ్యేలా లేదు. ఆ సినిమాను ఆగస్టులో విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. అంటే.. దాదాపు జూలై దాకా షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. మరోవైపు త్రివిక్రమ్ 'గుంటూరుకారం' రేపు సంక్రాంతికి వచ్చేస్తోంది. అంటే జులై దాకా ఆగాల్సిందే. అందుకేనేమో..! ప్రస్తుతం గురుజీ చూపు వెంకీవైపు మళ్లిందని ఫిలింనగర్ టాక్. ఈ లోపు వెంకటేశ్‌తో ఓ సినిమా చేసేయాలని ఆయన ఫిక్సయ్యారట. వెంకటేశ్ బ్లాక్‌బాస్టర్స్ నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాల రచయిత త్రివిక్రమే అన్న విషయం తెలిసిందే. వారిద్దరి కలయికలో సినిమా కోసం సగటు ప్రేక్షకుడు కూడా ఇష్టంగా ఎదురుచూస్తున్నాడు. త్రివిక్రమ్ కూడా వెంకీతో సినిమా చేయనున్నట్టు గతంలో ఓసారి చెప్పారు. ఎట్టకేలకు ఆ కాంబినేషన్ ఇప్పటికి సెట్ అయ్యిందని తెలుస్తోంది. అయితే.. ఇది వెంకీ సినిమా మాత్రమే కాదంట. ఇదో మల్టీస్టారర్ అని సమాచారం. రెండో హీరోగా నానీ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. త్వరలోనే ఈసినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల కానుందని విశ్వసనీయ సమాచారం.

కథ క్లైమాక్స్‌కొచ్చింది



'సలార్' చిత్రంతో బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్నారు ప్రభాస్. 'యానిమల్' చిత్రంతో దేశవ్యాప్తంగా సినీ ప్రియులను ఉర్రూతలూగించిన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకోబోతున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో సందీప్‌రెడ్డి వంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కొన్ని సన్నివేశాలు మినహా 'స్పిరిట్' కథ దాదాపు పూర్తయిందని తెలిపారు. ప్రభాస్ నిజాయితీపరుడైన పోలీసాఫీసర్‌గా కనిపిస్తారని చెప్పారు. యాక్షన్ ఘట్టాలు, కథలో మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయన్నారు. ప్రభాస్ పాత్ర శక్తిమంతంగా ఉంటుందని చెప్పారు. మానవ అక్రమ రవాణా నేపథ్యంలో 'షుగర్ ఫ్యాక్టరీ' అనే స్టోరీ సిద్ధమైందన్నారు. అలాగే భవిష్యత్‌లో మహేశ్‌బాబుతో కచ్చితంగా ఓ సినిమా చేస్తానని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు.

ఊహించని కలయిక





ధనుష్, శేఖర్ కమ్ముల సినిమా.. నిజంగా పొంతన లేని కాంబినేషన్ ఇది. శేఖర్ కమ్ముల యూత్‌ఫుల్ డైరెక్టర్. ధనుష్ పక్కా మాస్ హీరో. మరి వీరిద్దరికీ ఎలా సెట్ అవుతుందనేది ఇక్కడ ఆసక్తికరమైన అంశం. ధనుష్ 51వ చిత్రంగా రూపొందనున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అలాగే కథానాయికగా రష్మిక మందన్నాను ఖరారు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవిశ్రీప్రసాద్‌ని తీసుకున్నట్టు తెలిసింది. శేఖర్ కమ్ముల 'అనామిక' సినిమాకు ఎం.ఎం.కీరవాణి స్వరాలందించారు. మిగతా అన్ని సినిమాలకూ కొత్త మ్యూజిక్ డైరెక్టర్లతోనే మ్యూజిక్ చేయించుకున్నారు శేఖర్ కమ్ముల. ధనుష్ సినిమా కోసం ఇప్పుడు మళ్లీ స్టార్ కంపోజర్‌తో శేఖర్ చేతులు కలిపారని తెలిసింది. నిజానికి శేఖర్ అభిరుచి వేరు. కొత్తవాళ్లతో అద్భుతమైన సంగీతాన్ని తీసుకున్నారాయన. మరి క్లాస్, మాస్ తేడా లేకుండా అన్ని తరహా పాటలకూ మ్యూజిక్ ఇచ్చే దేవిశ్రీతో ఎలాంటి పాటలు చేయిస్తాడో చూడాలి.



చిందెయ్యరా ఘోర హర

ధనుష్ నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. కన్నడ అగ్రహీరో శివరాజ్‌కుమార్ ఇందులో కీలక పాత్ర పోషించారు. సంక్రాంతికి సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన మూడో పాటను చిత్రబృందం విడుదల చేశారు. 'ఘోర హర..' అంటూ సాగే పాటను రాకేందుమౌళి రాయగా, జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు. రాహుల్ సిప్లిగంజ్ హై ఎనర్జీతో ఆలపించారు. ఈ పాటను ధనుష, శివరాజ్‌కుమార్‌లపై చిత్రీకరించడం విశేషం. ఈ పాట ఈసినిమాకే హైలెట్‌గా నిలువనుందని, ధనుష్, శివరాజ్‌కుమార్ డాన్స్ నెక్ట్స్ లెవల్లో ఉంటుందని చిత్రబృందం చెబుతున్నారు. 1930-40 మధ్య జరిగే పీరియడ్ కథాంశంతో, భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సందీప్‌కిషన్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని.

నాకెప్పుడు న్యాయం జరుగుతుందో?



గాయని చిన్మయి మరోసారి తమిళ రచయిత వైరముత్తుపై విమర్శల దాడి చేశారు. కెరీర్ ఆరంభంలో తనను వైరముత్తు లైంగికంగా వేధించాడని 2018 మీటూ ఉద్యమం సమయంలో చిన్మయి ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే తమిళ పరిశ్రమ వైరముత్తుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా చిన్మయిపైనే నిషేధం విధించింది. గతేడాదే ఆ నిషేధం తొలగింది. వైరముత్తు రచించిన 'మహా కవితై' పుస్తకావిష్కరణ ఇటీవలే చెన్నైలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నాయకుడు చిదంబరం, కమల్‌హాసన్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో చిన్మయి సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. 'నన్ను లైంగికంగా వేధించడమే కాకుండా, నా కెరీర్‌ను నాశనం చేసిన వ్యక్తికి చాలా పెద్ద వ్యక్తుల మద్దతు ఉంది. నాకు ఎప్పుడు న్యాయం జరుగుతుందో?' అని స్పందించారు.

వరుణ్ సందేశ్ థ్రిల్లర్



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. శ్రీ అద్యాన్ష్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. మంగళవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలి షాట్‌కు వరుణ్ సందేశ్ క్లాప్ ఇచ్చారు. సినిమాటోగ్రాఫర్ అజయ్ కుమార్ చిత్రీకరించారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి. ఇప్పటి వరకూ నేను నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన కథాంశంతో వస్తున్న థ్రిల్లర్ చిత్రం. హీరో లుక్, క్యారెక్టరైజేషన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'డిఫరెంట్ మేకింగ్, టేకింగ్‌తో ఈ సినిమాను నిర్మించబోతున్నాం. లొకేషన్స్ కూడా చాలా కొత్తగా ఉంటాయి. కథ, కథనంతో పాటు విజువల్స్ కూడా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇచ్చే చిత్రంగా దీన్ని నిర్మించబోతున్నాం' అన్నారు. ఈ చిత్రంలో రఘు కారుమంచి, ప్రమోదిని, బలగం జయరామ్, వైవా రాఘవ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: రామ్ తుము.

రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం



సుహాస్ హీరోగా నటిస్తున్న 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో జీఏ2 పిక్చర్స్, మహాయాన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలోని 'మా ఊరు' లిరికల్ వీడియోను యువ హీరో తేజ సజ్జా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. 'రారో మా ఊరు సిత్రాన్ని సూద్దాం.. ఇటు రారో ఈ బతుకు పాటను ఇందాం.. ఈ సన్నాయి నొక్కుల్లోనా ఊరించే సంగతులెన్నో ఉన్నాయ్' అంటూ రెహమాన్ రాసిన ఈ పాటకు శేఖర్ చంద్ర సంగీతం అందించారు. కామెడీ డ్రామా కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో శివాని నాగరం, శరణ్య ప్రదీప్, ప్రతాప్, గోపరాజు రమణ తదితరులు నటించారు.

నా కెరీర్‌ను మలుపు తిప్పింది



2023... నటుడిగా నా కెరీర్‌ను మలుపు తిప్పిన సంవత్సరం అని శ్రీతేజ్ చెప్పారు. 'ధమాకా', 'మంగళవారం' తదితర చిత్రాలతో నటుడిగా ఆయన ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'పుష్ప2' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. తన సినీ కెరీర్ గురించి ఆయన మీడియాతో మాట్లాడారు. "కొన్నేళ్లుగా చాలా మంచి సినిమాలు చేస్తున్నా. కానీ గతేడాది మాత్రం నటుడిగా నాకు మంచి అవకాశాలు దక్కాయి. మంగళవారం' చిత్రం నాకు మంచి పేరు తెచ్చింది. 'రావణాసుర, దళారి' చిత్రాలు నటుడిగా ప్రేక్షకులకు గుర్తిండిపోయేలా చేశాయి. అలాగే ఈ ఏడాది 'బహిష్కరణ' అనే వెబ్‌సిరీస్ చేస్తున్నాను. 'ర్యాంబో' చిత్రంలో నా పాత్ర వైవిధ్యంగా ఉండబోతోంది' అన్నారు.

ఆ సినిమా ఆమె జాతకాన్ని మార్చేసింది



ఒకే ఒక్క అవకాశం చాలా మంది జీవితాల్ని మార్చేస్తుంది. గ్లామర్ నటి త్రిప్తి దిమ్రి విషయంలో అదే జరిగింది. రణ్‌బీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమాతో ఆమె ఒక్కసారిగా నేషనల్ క్రష్ అయిపోయింది. ఎవరీమె, వివరాలు ఏమిటి.. అని గూగుల్‌లో చాలా మంది సెర్చ్ చేశారు. ఆ సినిమా విడుదలైన దగ్గర నుంచి అభినందనలు, అవకాశాలు, ఫోన్లు, సందేశాలు...వాటితో క్షణం కూడా తీరిక చిక్కడం లేదు ఆమెకు. 'యానిమల్' చిత్రం నా జీవితాన్ని మార్చేసింది. ఎంతో మంది అభిమానంతో ఫోన్ చేసి అభినందిస్తున్నారు. వాళ్లు పంపే మెసేజ్‌లు చదువుతుంటే ఆనందంతో నాకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదు. కొత్త అవకాశాలు కూడా వెదుక్కుంటూ వస్తున్నాయి. దర్శకుడు సందీప్‌రెడ్డికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు' అని ఆమె ఓ ఆంగ్ల వెబ్ సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. హీరో రణబీర్ అద్భుతమైన నటుడు అని ఈ సందర్భంగా త్రిప్తి చెప్పింది. 'యానిమల్'లో హీరోయిన్‌గా నటించిన రష్మిక గురించి మాట్లాడుతూ 'సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటే ఆ ఎనర్జీ వేరు. రష్మిక చాలా మంచి వ్యక్తి. తొలి రోజు షూటింగ్‌లో కలసినప్పుడు ఆమె నా దగ్గరకు వచ్చి, హగ్ చేసుకుని అభినందనలు తెలిపింది. సెట్‌లో రష్మిక ఎలా ఉంటుందా అని మొదట నేను భయపడ్డా కానీ ఆమె తన ప్రవర్తనతో నన్ను ఆకట్టుకొంది.

ల్యాండ్ మాఫియా వస్తోంది



ప్రణయనాథ హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రం 'ల్యాండ్ మాఫియా'. మధుబాల కథానాయిక. బాబు వీఎస్ దర్శకుడు. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రణయనాథ మాట్లాడుతూ 'చిన్న సినిమాగా మొదలైన ఈ ప్రాజెక్ట్ పెద్ద చిత్రంగా మారింది. ఓ మంచి చిత్రాన్ని తీశాం. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రణయనాథ సహకారం వల్లే సినిమాను అనుకున్న విధంగా తీయగలిగాం. ఖర్చుకు వెనుకాడకుండా అన్ని హంగులతో నిర్మించాం. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. సందేశంతో పాటు అన్ని రకాల వాణిజ్య హంగులు ఉన్న చిత్రమిదని మధుబాల తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రదీప్ చంద్ర. సినిమాటోగ్రఫీ: వెంకట్ జె. ఎడిటర్: కృష్ణ మండల.

బాలరాజు రాక అప్పుడే



సోహెల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘలేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 2న 'బూట్‌కట్ బాలరాజు' చిత్రం విడుదలవుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు. ఎడిటర్:విజయ్ వర్ధన్.





ఒంటికి మెత్తగా తగులుతూ, తేలికగా, సౌకర్యంగా ఉండే కాటన్ చీరలను ఇష్టపడని మహిళలంటూ ఉండరు. మరీ ముఖ్యంగా జైపూర్ బగ్రూ కాటన్ చీరలు ఇటీవలి కాలంలో మహిళల మనసులను దోచుకుంటున్నాయి. ఆకర్షణీయమైన రంగులు, అద్దకాలతో అలరిస్తున్న బగ్రూ హ్యాండ్ ప్రింట్ కాటన్ చీరలు ఇవే!

భలే 'బగ్రూ'

ఘన చరిత్ర

300 ఏళ్ల నాటి బగ్రూ చేతి అద్దకం టెక్నిక్ మూలాలు, రాజస్థాన్, జైపూర్‌కు చెందిన 'బగ్రూ' అనే ఒక మారుమూల కుగ్రామంలో ఉన్నాయి. సంజారియా నది చుట్టుముట్టి ఉండే, బగోరా దీవి నుంచే 'బగ్రూ' అనే పేరు పుట్టుకొచ్చింది. ఆఫ్ వైట్ బ్యాక్‌గ్రౌండ్ మీద ముదురు రంగు మోటిఫ్స్ ముద్రించి ఉండడం ఈ చీరల ప్రత్యేకత. రాజస్థాన్‌లోని 'చిప్ప', 'ఖరాడి' అనే కమ్యూనిటీకి చెందిన వాళ్లు ఈ సంప్రదాయ అద్దకాన్ని వందల ఏళ్ల నుంచీ కొనసాగిస్తూ ఉండడం విశేషం.



పరిమిత డిజైన్లలో...

వైవిధ్యమైన పూల మోటిఫ్స్‌ను కలిగి ఉండే బగ్రూ చీరలు ఎక్కువగా ఇండిగో, నారింజ, పసుపు రంగుల్లో తయారవుతూ ఉంటాయి. మోటిఫ్స్‌తో పాటు బుటా, ఝుర్ లేదా బార్డర్‌లను కలిగి ఉండడం ఈ చీరల ప్రత్యేకత. ఈ చీరలన్నీ పాత కళాకృతులు, పొద్దుతిరుగుడు, గులాబీ, ఇతర స్థానిక పువ్వుల డిజైన్లనే కలిగి ఉంటాయి.



ఇలా శింగారించాలి

బగ్రూ కాటన్ చీరలను డైలీ వేర్‌గా, ఆఫీస్ వేర్‌గా వాడుకోవచ్చు. ఫ్యాషన్ ఐకాన్‌గా కనిపించాలనుకుంటే, మెటల్ జ్యువెలరీ ధరించాలి. చీరకు మ్యాచింగ్ బ్లౌజ్ స్టైలిష్‌గా ఉండేలా చూసుకోవాలి. కొల్హాపురి చెప్పులు ఈ చీరలకు చక్కగా నూటవుతాయి. వీలైనంత వరకూ సింపుల్ జ్యువెలరీనే ఎంచుకోవాలి.



ఆమె వంటకు మాస్టర్ షెఫ్‌లు ఫిదా అయిపోతారు. ఒకటో తరగతి కూడా చదవని ఆమె... ఇంట్లో అప్పాల అమ్మకం మొదలుపెట్టి... నేడు దాన్ని ఒక పరిశ్రమ స్థాయికి తీసుకువెళ్లారు. తెలంగాణ పిండి వంటలకు బ్రాండ్ ఇమేజ్ తెచ్చి... ఎనభై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో గరిటె తిప్పుతున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ఇటీవల ఆవిష్కరించిన '50మంది స్ఫూర్తిదాయక మహిళలు' పుస్తకంలో ప్రత్యేక స్థానం పొందిన **వంగపల్లి సావిత్రమ్మ** తన పాతికేళ్ల ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.





'అప్పాలమ్ముకుంటావా' అని నవ్వారు..!

"నా చిన్నతనంలో సంక్రాంతి, దసరా లాంటి పండుగలప్పుడు మా ఇంట్లో వారం ముందే సందడి మొదలయ్యేది. ఇరుగుపొరుగు మహిళలందరూ ఒకచోట చేరి పిండి వంటలు చేసేవారు. అప్పాలు ఒత్తడం, అరిసెల పాకం పట్టడం, సకినాలు చుట్టడం, మురుకులకు పిండి కలపడం... వాళ్ల పక్కనే కూర్చొని అన్నిటినీ ఆసక్తిగా గమనిస్తుండే దాన్ని. కొన్నాళ్లకు నేను కూడా వారితో కలిసి గరిటె తిప్పడం ప్రారంభించాను. ఆ ఇష్టమే ఇవాళ నన్ను 'సకినాల సావిత్రమ్మ'గా ఈ లోకానికి పరిచయం చేసింది. నేడు నా చేతి పిండి వంటలు, పచ్చళ్లు దేశ, విదేశాలకు వెళుతున్నాయి. చిన్నజీయర్‌స్వామి లాంటి మహానుభావుల నుంచి సత్కారాన్ని అందుకున్నాను. 'తెలంగాణ పిండివంటలకు మంచి పేరు తెచ్చావమ్మా' అని తెలిసినవారంతా అంటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. అయితే ఇంతటి పేరు వెనుక కొన్నేళ్ల కష్టం ఉంది.

'బావున్నాయమ్మా' అంటే...

చిన్నతనం నుంచి పిండివంటలు చేయడం, వాటిని ఇతరులకు ఇవ్వడం నాకు చాలా ఇష్టం. అవి తిన్నవారు 'బావున్నాయమ్మా' అంటే... ఆనందంతో నా కడుపు నిండిపోతుంది. ఖాళీగా కూర్చోడమంటే నాకు మహా చికాకు. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తుండాలి. అది నలుగురికీ మేలు చేసేది అయుండాలని అనుకొంటాను. నేనేమీ చదువుకోకున్నా... ఇదివరకు జగిత్యాలలో కొంతమంది కేరళ ఉపాధ్యాయులతో స్కూలు నిర్వహించాను. పదేళ్లు దాన్ని విజయవంతంగా నడిపించాను. హన్మకొండలో విద్యార్థుల కోసం హాస్టల్ పెట్టాను. కొంత కాలం మెస్ కూడా నడిపాను. మా సొంతూరు కరీంనగర్ జిల్లా బీర్పూర్. నా భర్త సత్యంరావు సివిల్ కాంట్రాక్టర్. 1990లో మేం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాం. అప్పుడు మా ఇంటి ముందే టెలిఫోన్‌బూత్ ప్రారంభించాను. నలుగురికీ వండిపెట్టిన చెయ్యి కదా... ఊరికే ఉండలేకపోయాను. ఒకరోజు మూడు గ్లాసుల బియ్యం మిక్సీ పట్టి సకినాలు చేశాను. వాటిని మా ఎస్టీడీ బూత్ ముందు పెడితే అన్నీ ఒక్కపూటలో అమ్ముడయ్యాయి.

కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ...

క్రమంగా సకినాలకు ఆదరణ పెరిగింది. దాంతో సర్వపిండి, మురుకులు, లడ్డూ... ఇలా ఒక్కో వంటకం రోజుకు రెండు కేజీల చొప్పున చేయడం మొదలుపెట్టాను. ఆనోటా ఈనోటా పాకడంతో తక్కువ సమయంలోనే అమ్మకాలు పుంజుకున్నాయి. మెల్లగా పెళ్లి, వడిబియ్యం సారెలకు పిండివంటల ఆర్డర్లు వచ్చాయి. సంప్రదాయాలమీద నాకు కొంత అవగాహన ఉండటంతో శుభకార్యాలనుబట్టి సారెకు ఎన్ని రకాల ఐటెమ్స్ పంపాలి, అందులోనూ ఎన్ని చుట్లు సకినాలు చేయాలి లాంటి విషయాలను కస్టమర్లకు చెబుతుండే దాన్ని. దాంతో 'సావిత్రమ్మ దగ్గర సారె వంటలు తీసుకెళితే' అవతలి వైపు నుంచి పల్లెత్తు మాట రాదని వారంతా అనుకొనేవారు. అలా కేటీఆర్ పెళ్లి సారె, కవిత ఒడి బియ్యం సారె... ఇలా కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ పిండివంటలు మా దగ్గర నుంచే వెళ్లాయి. ఇంతవరకు 'మా పిండి వంటలు కొనండి' అని నేనెన్నడూ ఒక కరపత్రం వేయించలేదు. గోడ పత్రిక ముద్రించలేదు. మా కస్టమర్లే మాకు ప్రచారకర్తలు.

నన్ను చూసి నవ్వినవారే...

నా చేతి వంటలకు మంచి ఆదరణ రావడంతో నా కోడలు రేణుకతో కలిసి 1998లో 'శ్రీదేవి తెలంగాణ పిండివంటకాలు' పేరుతో స్వగృహ ఫుడ్స్ ప్రారంభించాం. రోజుకు రెండు కేజీల అప్పాలతో మొదలైన వ్యాపారం ఇప్పుడు ఆరు క్వింటాళ్లకు అమ్మకాల స్థాయి పెరిగింది. పండుగలప్పుడైతే పది క్వింటాళ్లు కూడా చేస్తుంటాం. మొదట్లో మా ఊళ్లో వారంతా 'పట్నం పోయి అప్పాలమ్ముకుంటున్నావా' అంటూ నన్ను చూసి నవ్వారు. ఇప్పుడు వారే నా గురించి నలుగురికీ గర్వంగా చెబుతుంటారు. ఇంకొందరు సొంతంగా అప్పాలు చేసి తెలంగాణ పిండివంటల పేరుతో అమ్ముతున్నారు. అందుకు నాకూ సంతోషంగా ఉంది. పదిహేనేళ్ల కిందట నిజాం కాలేజీ మైదానంలో తెలంగాణ సంబురాలప్పుడు ప్రత్యేక స్టాల్ పెట్టాం. అందులో గట్కా, సర్వపిండి, అరిసెలు, సకినాలు, బిళ్ల అప్పాలు లాంటివన్నీ ఒక్కపూటలో అయిపోయాయి. ఆ స్టాల్‌వల్ల మా వంటకాలకు బోలెడంత ప్రచారం వచ్చింది.

విమానంలో తీసుకెళితే...

పిండివంటల తయారీ అంతా చాలా కాలం వరకు ఇంటి పట్టునే కొనసాగించాం. ఆస్ట్రేలియాలో ఎంబీఏ చేసిన నా మనవడు రాంగోపాల్ నిరుడు సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చినప్పుడు, కస్టమర్లకు సమయానికి వంటకాలను అందించడానికి మేము పడుతున్న అవస్థ గమనించాడు. మురుకులు, కారప్పూస తయారీ మిషన్లను తెప్పించాడు. సకినాల పిండి కలిపేందుకు, చిప్స్ కోసం ఆలుగడ్డ తరిగేందుకు, పల్లీలు రాకేందుకు యంత్రాలు కొనుగోలు చేశాడు. విదేశాల్లో ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లకుండా, మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాడు. నా మనవడి చొరవతోనే ఇంట్లో మొదలైన అప్పాల తయారీ ఇప్పుడు నాచారంలో చిన్న పరిశ్రమ స్థాయికి ఎదిగింది. మా దగ్గర వందమందికి పైగా ఉద్యోగులున్నారు. వారికి రోజూ మధ్యాహ్న భోజనం, ప్రతి పండుగకు బోనస్, కొత్త దుస్తులు ఇస్తున్నాం. ఏడాదికి ఒకసారి వారందరినీ యాత్రలకు తీసుకెళుతుంటాను. అలా గత ఏడాది ఉద్యోగులను విమానంలో తిరుపతి తీసుకెళితే... వారి ఆనందం మాటల్లో చెప్పలేనిది. నన్ను వారంతా 'పెద్దమ్మ' అని అప్యాయంగా పిలుస్తారు. అలా పిలిపించుకోవడమే నాకు ఇష్టం. వారికి ఏ కష్టం వచ్చినా, సాయం అందిస్తుంటాను. మా ఉద్యోగులు కూడా సంస్థను తమదిగానే భావించి పని చేస్తుంటారు.

అదే రహస్యం...

'మేం ఎంతగా ప్రయత్నించినా మా ఇళ్లల్లో వండిన వాటికి మీ దుకాణంలోని అప్పాలంత రుచి రావడం లేదు. మీరేమైనా కలుపుతారా? ఆ రహస్యమేంటో మాకూ చెప్పచ్చు కదా" అని తెలిసినవాళ్లంతా నన్ను అడుగుతుంటారు. మేము ఇంట్లో చేసుకొనే పద్ధతిలోనే మా స్వగృహ ఫుడ్స్‌లోనూ తయారు చేస్తాం. కనీసం పచ్చళ్ల నిల్వ కోసం కూడా ఏమీ కలపం. ఒక వంట కానికి వాడిన నూనెను మరొకదానికి ఉపయోగించం. సకినాలు, మురుకులు ఇలా ప్రతి వెరైటీకి వేర్వేరు మూకుడులు వాడతాం. పల్లీలు, నువ్వులు, పప్పులు లాంటి ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీపడం. అందుకే రుచిగా ఉంటాయి. అంతకు మించిన రహస్యం మరేమీ లేదు.



కష్టాలను దాటి...

జీవితమన్నాక కష్టసుఖాలు, వ్యాపారమన్నాక లాభనష్టాలు లేకుండా ఉండవు కదా. పిండివంటల వ్యాపారమనగానే చాలామందికి లాభమే కనిపిస్తుంది. దాని వెనుక ఎంతో చాకిరీ ఉంటుంది. ఇక నష్టం సంగతి చెప్పక్కర్లేదు. ఒక్కోసారి పచ్చళ్లు పాడవుతుంటాయి. పిండివంటలు మిగిలిపోతాయి. అప్పుడు వాటన్నింటినీ చెత్తలో పడేయాల్సిందే. మరికొన్ని సందర్భాల్లో ఆర్డర్లు చివరి నిమిషంలో క్యాన్సిల్ చేస్తుంటారు. ఒక్కొక్కరు రుచి సరిగ్గా లేదని వంకలు పెడుతుంటారు. అప్పుడు మళ్లీ ఫ్రెష్‌గా ఇవ్వడం లేదా డబ్బులు తిరిగి ఇచ్చేయడమో చేస్తుంటాం. ఆహార పదార్థాల ధరలు అమాంతం పెరుగుతాయి. అలాంటప్పుడు ఒకేసారి మేము ధర పెంచలేము కదా. ఇలా ఒకటా రెండా... బోలెడు సమస్యలుంటాయి. వాటన్నిటినీ దాటి ఇక్కడి వరకు వచ్చాను. నా విజయ రహస్యం అంటే... నా కుటుంబ సహకారమే. నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. నా కోడలు రేణుక నాకు మొదటి నుంచి అండగా ఉంటోంది. తెలంగాణలోని '50మంది స్ఫూర్తిదాయక మహిళల' జాబితాలో నాకూ స్థానం దక్కడం ఆనందంగా ఉంది. మాస్టర్ షెఫ్ కునాల్ కపూర్ పచ్చళ్ల తయారీపై నాతో స్పెషల్ షో చేయించారు. 'కష్టపడి పని చేయాలి. తద్వారా మరొకరికి మేలు కలగాలి. ఆ తర్వాతే ఫలితం ఆశించాలి' అనేది నేను నమ్ముతాను. అదే ఇప్పటి వాళ్లకు చెబుతాను. ఇవాల్టికీ ఖాళీగా మాత్రం కూర్చోను. రోజూ ఇంట్లోని వంటతో పాటు దుకాణంలో నాలుగు గంటలైనా పని చేస్తుంటాను. అలా పని చేయబట్టే ఆరోగ్యంగా ఉన్నాను.

మేనకాగాంధీకి పచ్చళ్లు...

నేను వండిన అప్పాలంటే చాలా మందికి ఇష్టం. శుభకార్యాలు, పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాలప్పుడు సినిమా, రాజకీయ నాయకులు మా పిండివంటలు తీసుకెళతారు. హీరో విజయ్ దేవరకొండ మొన్న దీపావళికి సకినాలు, సర్వపిండి, అరిసెలు మా దగ్గరే చేయించుకున్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజకీయ నాయకులు మధుయాష్కీ, బి.వినోద్‌కుమార్, చెన్నమనేని విద్యాసాగరరావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితర ప్రముఖుల ఇళ్లల్లోని శుభకార్యాలకు స్వీట్, హాట్ ఐటెమ్స్ మా దగ్గరే కొంటారు. ఇందిరమ్మ కోడలు, రాజకీయ నాయకురాలు మేనకాగాంధీకి నా చేతి పచ్చళ్లంటే చాలా ఇష్టం. గోనె ప్రకాశరావు ఆమె కోసమే నాతో ప్రత్యేకంగా చింతకాయ, పండుమిరప పచ్చళ్లు పెట్టించేవారు. విజయశాంతి కూడా నా వంటలను రుచి చూసి 'చాలా బావున్నాయి' అని మెచ్చుకొన్నారు.

• సాంత్వన్

దశాబ్దాల వైషమ్యంతో... ఎల్లప్పుడూ ఘర్షణాత్మక వాతావరణంతో ఉండే భారత్, పాకిస్తాన్ దేశాల ప్రజల మధ్య సుహృద్భావాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తున్నారు **శ్రేయా మజుందార్**. దీనికోసం తొమ్మిదేళ్లుగా ఇరు దేశాల్లోని వ్యక్తులతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన 'పాక్ బంధు' గురించి ఆమె ఏం చెబుతున్నారంటే...



ఇరుదేశాల 'శ్రేయ'స్సు కోసం..

"దేశ విభజన తరువాత.. 1947లో పాకిస్తాన్‌ను వదిలి భారతదేశానికి వచ్చి, లఖ్‌నవూలో స్థిరపడిన కుటుంబాల్లో మాదీ ఒకటి. పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో... మా బామ్మ పూర్వీకుల ఇల్లు ఉండేది. ఆ ప్రాంతాల్నీ, అక్కడి వాతావరణాన్నీ, ఆడుతూ పాడుతూ గడిపిన రోజుల గురించీ ఆమె మరణించేవరకూ గుర్తు చేసుకొనేవారు. ఆ కథలన్నీ వింటూ పెరిగాను. సరిహద్దును దాటి నా ఊహలు పయనించేవి. భారత్-పాక్... ఒకే నాణేనికి రెండు పార్శ్వాలనే ఆలోచన నాలో స్థిరపడిపోయింది. అదే సమయంలో... రెండు దేశాల మధ్యా నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణం గురించి వార్తలు వినని రోజంటూ ఉండేది కాదు. సరిహద్దుకు అటూ... ఇటూ ఎన్నో లక్షలమంది మనసుల్లో... ఒకప్పుడు కలిసి ఉన్న నాటి జ్ఞాపకాలు, విభజన తరువాత అవతలి దేశంలోకి వచ్చాక... మళ్లీ ఎన్నటికీ ఆ వైపు వెళ్ళలేని నిస్సహాయత గూడుకట్టుకొని ఉంటాయనే వాస్తవం నన్ను ఎల్లప్పుడూ వెంటాడుతూ ఉండేది.

అది దేశాలకు అతీతం...

నేను ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ పొందాను. ఒక ప్రముఖ సంస్థలో కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సమయంలో... 2014లో, పెషావర్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ మీద దాడి జరిగింది. 'తెహ్రీక్- ఇ- తాలిబన్ పాకిస్తాన్'కి చెందిన ఆరుగురు సాయుధులు సాగించిన ఈ నరమేధంలో... 132మంది విద్యార్థులతో సహా 149 మంది మరణించారు. ఈ సంఘటనకు భారత దేశం కూడా చలించిపోయింది. ఇరు దేశాల్లోనూ ప్రజలు మృతుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సంఘీభావం నన్ను కదిలించింది. ఎవరికైనా బాధ కలిగినప్పుడు 'అయ్యో' అని స్పందించే మానవీయత... దేశాలకు అతీతం. భారత్, పాక్ మధ్య ఉన్న విభేదాలు, విద్వేషాల గురించి కాకుండా... సారూప్యతల గురించి ప్రచారం చేస్తే... సామరస్యపూర్వకమైన వాతావరణం నెలకొంటుందనిపించింది. 2015లో 'పాక్ బంధు' అనే ఆన్‌లైన్ ఫోరమ్‌ను ఇరుదేశాల ప్రజల కోసం ప్రారంభించాను. 'పాక్' అంటే ఇస్లాంలో 'స్వచ్ఛమైన' అనే అర్థం ఉంది. 'బంధు' అంటే సంస్కృతంలో 'స్నేహితుడు' అని అర్థం. 'పాక్ బంధు' అంటే 'స్వచ్ఛమైన స్నేహితులు'. భావసారూప్యత ఉన్న మిత్రులు అందులో భాగస్వాములయ్యారు. క్రమంగా నా ప్రయత్నానికి ఆదరణ పెరిగింది. భారత్-పాక్ మధ్య స్నేహసంబంధాల కోసం ఏం చెయ్యాలనేది చర్చించినప్పుడు... ఇరు ప్రాంతాల అనుసంధానానికి కళలే వారధిగా ఉపయోగపడతాయని అందరం అభిప్రాయపడ్డాం. మన హిందీ పాటలంటే చాలామంది పాకిస్తానీయులకు ఇష్టం. అందుకని ఆన్‌లైన్ అంత్యాక్షరి మొదలుపెట్టాం. 2017లో... పాకిస్తాన్ ఫిక్షన్, నాన్ ఫిక్షన్ సినిమాలతో ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహించాం. భావోద్వేగాలపరంగా వాటికీ, భారతీయ చిత్రాలకూ ఉన్న పోలికల గురించి చర్చా వేదిక ఏర్పాటు చేశాం. దానికి మంచి స్పందన వచ్చింది. ఆ తరువాత ఇరు దేశాల కవులు, సంగీత కళాకారులు, సినీ రూపకర్తలు, యాసిడ్ దాడులకు గురైనవారు, కథకులు, సామాజిక కార్యకర్తలు, ట్రాన్స్‌జెండర్స్ తదితర కమ్యూనిటీలకు చెందినవారితో రెండేళ్ళపాటు వరుసగా సెమినార్లు ఏర్పాటు చేశాం. ముందుగా ఎంపిక చేసుకున్న అంశాలపై చర్చా గోష్ఠులు నిర్వహించాం. 'రుబారూ ఆన్‌లైన్ ఇంటరాక్షన్స్' పేరుతో మాకొక విభాగం ఉంది. దీనిలో ప్రముఖ పాకిస్తానీ కళాకారులు, సామాజిక కార్యకర్తలు తమ కార్యాచరణ గురించి చర్చిస్తారు. గుర్తింపు, జాతీయత, మతం, సృజనాత్మకత తదితరాల విషయాల్లో భారత్, పాక్ మధ్య ఉన్న పోలికలే కాదు అంతరాలనూ వివరిస్తారు. అంతరాలను అధిగమించే మార్గాలను సూచిస్తారు. కొవిడ్ సమయంలోనూ ఈ కార్యక్రమాలు కొనసాగాయి. కిందటి ఏడాది లఖ్‌నవూలో... భారత్, పాకిస్తానీ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేశాం. ప్రతి నెలా కనీసం మూడు కార్యక్రమాలు జరుగుతాయి. కొన్ని వేలమంది పాక్ బంధులో సభ్యులుగా ఉన్నారు. దాదాపు 2,500 మంది చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

'మరే పనీ దొరకలేదా?' అన్నారు...


తొమ్మిదేళ్ళ ఈ ప్రయాణమంతా సజావుగా సాగిపోయిందనుకుంటే పొరపాటే. నా జెండర్, జాతీయత మీద అనేకమంది అసభ్యమైన వ్యాఖ్యలు చేశారు. "నువ్వు చెయ్యడానికి ఇంతకన్నా మరే పనీ దొరకలేదా?" అని స్వయంగా మా అమ్మా, నాన్న అన్నారు. నా స్నేహితుల్లో చాలామంది నా పనిని ఆమోదించలేదు. "ఇది చెయ్యడంలో నాకు సంతృప్తి లభిస్తోంది. అలాంటప్పుడు ఎందుకు మానెయ్యాలి?" అనేది నా జవాబు. ఇప్పుడు అనేకమంది ప్రముఖులు 'పాక్ బంధు'లో భాగమయ్యారు. భారత్‌లోకి పాక్ కళాకారుల రాకకు మళ్ళీ ఆమోదించాలని కోరుతూ ప్రభుత్వానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం. రెండు దేశాలూ ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యలపై డాక్యుమెంటరీల రూపకల్పన కోసం ప్రణాళికలు వేస్తున్నాం. చిన్న స్థాయిలో మేం చేస్తున్న కార్యక్రమాల వల్ల... తక్షణమే శాంతి నెలకొంటుందని భావించడం లేదు. కానీ ఒకప్పుడు కలిసి ఉన్న దేశాల ప్రజల మధ్య తిరిగి స్నేహం చిగురించాలంటే ఏదో ఒకవైపు నుంచి ప్రయత్నం ప్రారంభం కావాలి. ఆ దిశగా మేము వేసిన ఒక చిన్న అడుగు- పాక్ బంధు"



అలొవెరాతో కురులు ఆరోగ్యం

అలొవెరాలో విటమిన్లు, అమినో యాసిడ్స్ ఉండటం వల్ల జుట్టుకెంతో మంచిది. ముఖ్యంగా జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. సులువుగా ఇంట్లోనే తయారు చేసుకునే హెయిర్ ప్యాక్స్ ఏంటో చూద్దాం.

- బౌల్‌లో టేబుల్ స్పూన్ అలొవెరా జెల్‌తో పాటు టీస్పూన్ మందారపూల పొడిని తీసుకోవాలి. బాగా మిక్స్ చేసి జుట్టుకు పట్టిస్తే వెంట్రుకల డ్యామేజీని అరికడుతుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల అలొవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి గంటపాటు వదిలేయాలి. ఆ తర్వాత చన్నీళ్లతో జుట్టును శుభ్రం చేసుకోవాలి. ఇలా నెలకు రెండుసార్లు చేస్తే చుండ్రు తగ్గిపోతుంది. జుట్టులో మెరుపు వస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలొవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనెను ఒక బౌల్‌లో వేసి మిక్స్ చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత గోరు వెచ్చటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే జుట్టు పొడవుగా పెరగటంతో పాటు గట్టిగా ఉంటుంది.
- బౌల్‌లో మూడు టేబుల్ స్పూన్ల అలొవెరా జెల్, మూడు టేబుల్ స్పూన్ల పచ్చికొబ్బరి పాలు, టేబుల్ స్పూన్ కొబ్బరినూనె వేసిన తర్వాత బాగా మిక్స్ చేయాలి.
- కోడిగుడ్డు సొన, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, మూడు టేబుల్ స్పూన్ల అలొవెరాజెల్‌ను బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత జుట్టు కుదుళ్లు తాకేట్లు పట్టించాలి. పది నిముషాల పాటు మసాజ్ చేసినట్లు పట్టించాలి. నలభై నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు ఊడిపోవటం తగ్గుతుంది.
- అరకప్పు అలొవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పట్టిస్తే జుట్టులో ఉండే రెడ్‌నెస్‌తో పాటు ఇరిటేషన్లు ఉండే తొలగిపోతాయి.



సమం చేస్తారా?

● గెలుపే లక్ష్యంగా టీమిండియా
● పేసర్లదే భారం ● జోష్‌లో దక్షిణాఫ్రికా
● నేటి నుంచి రెండో టెస్టు

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాపై తొలి టెస్టును ఇన్నింగ్స్ తేడాతో.. అదీ మూడు రోజుల్లోనే కోల్పోయిన భారత జట్టు ఇప్పుడు తీవ్ర ఒత్తిడిలో ఉంది. సఫారీ గడ్డపై ఎన్నిసార్లు పర్యటించినా టెస్టు సిరీస్ సాధించలేకపోతున్న వేళ.. బుధవారంనుంచి జరిగే ఆఖరిదైన రెండో టెస్టులోనైనా గెలిచి 1-1తో సమం చేయాలనుకుంటోంది. అదే జరిగితే కొత్త ఏడాదిని టీమిండియా ఓ చక్కని విజయంతో ఆరంభించినట్టవుతుంది. సెంచూరియన్ పిచ్‌పై పేస్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకోవడంలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కనీసం ఆఖరి టెస్టులోనైనా తమ లోపాలను సరిదిద్దుకుని సఫారీ బ్యాటర్లను కట్టడి చేస్తేనే కేప్‌టౌన్‌లో 'తొలి' టెస్టు విజయంపై ఆశలు పెట్టుకోవచ్చు. అలాగే కెప్టెన్ రోహిత్ కూడా బౌలర్లను సరైన రీతిలో వినియోగించుకోవాల్సి ఉంది. మరోవైపు మన బ్యాటర్లు విఫలమైన చోట సౌతాఫ్రికా బ్యాటర్లు మాత్రం అదరగొట్టారు. అలాగే ఆ జట్టు బౌలర్లు భారత్‌ను ఎలా ఇబ్బందిపెట్టారో ఇన్నింగ్స్ ఓటమి ద్వారా తెలిపోయింది. ఇదే ఉత్సాహంతో ఆతిథ్య జట్టు సిరీస్‌పై కన్నేసింది.

జడేజా రాకతో సమతూకం

గాయంతో సెంచూరియన్ టెస్టుకు దూరమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. దీంతో మిడిలార్డర్ కాస్త పటిష్టంగా మారనుంది. అలాగే ఈ పిచ్ స్పిన్‌కు కూడా అనుకూలించే అవకాశం ఉండడంతో అతడి బౌలింగ్ కీలకం కానుంది. అయితే పేసర్లు ప్రసిద్ధ్, శార్దూల్ దారుణంగా విఫలం కావడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళన పరుస్తోంది. ప్రసిద్ధ్‌కు అనుభవం కొరవడగా, శార్దూల్‌లో నిలకడ లోపించింది. బుమ్రా ఒక్కడే అంచనాలను అందుకుంటుండగా, సిరాజ్ ఫర్వాలేదనిపిస్తున్నాడు. కొత్త బంతిని స్వింగ్ చేస్తే వికెట్లను రాబట్టవచ్చు. ఈ నేపథ్యంలో ముకేశ్, అవేశ్‌లలో ఒకరికి పిలుపు రావచ్చు. ఏదేమైనా బౌలింగ్‌లో పదును లేకపోతే రెండో టెస్టు గెలవడం కష్టమే. ఇక బ్యాటింగ్ విషయానికి వస్తే.. జైస్వాల్, గిల్, శ్రేయాస్ బౌన్సర్లను ఆడే విషయంలో తేలిపోతున్నారు. కెప్టెన్ రోహిత్ సఫారీ గడ్డపై ఆడిన పది ఇన్నింగ్స్‌లో 128 పరుగులు మాత్రమే చేయగలిగాడు. విరాట్, రాహుల్ మాత్రం ఆతిథ్య బౌలర్లను దీటుగా ఎదుర్కోగలుగుతున్నారు.

సఫారీలు అన్నింటా సూపర్..

భారత్‌కు పూర్తి విరుద్ధంగా ఆతిథ్య జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాటుదేలి ఉంది. కెరీర్‌లో చివరి టెస్టు ఆడనున్న కెప్టెన్ ఎల్గర్‌కుతోడు జోర్జి, మార్‌క్రమ్, పీటర్సన్, బెడింగమ్‌లతో బ్యాటింగ్ లైనప్ మరోసారి భారత బౌలర్లకు సవాల్ విసరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక పేసర్లు రబాడ, జాన్సెన్, బర్గర్ తొలి టెస్టులో అదరగొట్టిన విషయం తెలిసిందే. గాయపడిన బవుమా స్థానంలో హమ్జా ఆడనున్నాడు. దీనికితోడు న్యూలాండ్స్ మైదానంలో భారత జట్టుపై ఓటమి లేకపోవడం వీరికి కలిసి రానుంది.


దక్షిణాఫ్రికా పేసర్ రబాడ


కెరీర్ ఆఖరి టెస్టు బరిలో ఎల్గర్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, విరాట్, శ్రేయాస్, రాహుల్, జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్/ముకేశ్.
దక్షిణాఫ్రికా: ఎల్గర్ (కెప్టెన్), మార్‌క్రమ్, జోర్జి, పీటర్సన్, హమ్జా, బెడింగమ్, వెరీనె, జాన్సెన్, కేశవ్/ఎన్‌గిడి, రబాడ, బర్గర్.

పిచ్

వికెట్‌పై పచ్చిక ఉండడంతో ఆరంభంలో పేసర్లకు అనుకూలించవచ్చు. అయితే మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లు కూడా లాభపడే అవకాశముంది. ఇక వర్షం కురిసే అవకాశాల్లేవు.

టాప్-3 లోకి దబాంగ్ ఢిల్లీ



నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-10లో వరుస విజయాలతో ఊపు మీదున్న గుజరాత్ జెయింట్స్‌కు దబాంగ్ ఢిల్లీ షాకిచ్చింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 35-28తో గుజరాత్‌పై నెగ్గింది. ఈ విజయంతో ఢిల్లీ.. జైపూర్‌ను వెనక్కి నెట్టి పాయింట్ల పట్టికలో టాప్-3లోకి ప్రవేశించింది. ఢిల్లీ రైడర్లు అషు మాలిక్ (11 పాయింట్లు), మంజిత్ (9 పాయింట్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్ స్టార్ రైడర్ ప్రతీక్ దహియా (9 పాయింట్లు) గెలిపించడానికి శతవిధాలా ప్రయత్నించినా, చివరికి నిరాశే ఎదురైంది.

రెండు మ్యాచ్‌లూ టై

అల్టిమేట్ ఖో-ఖో

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో మంగళవారం జరిగిన రెండు మ్యాచ్‌లూ టైగా ముగియడం విశేషం. తొలి మ్యాచ్‌లో తలపడిన చెన్నై క్విక్‌గన్స్-ఒడిశా జగర్‌నాట్స్ ఈ సీజన్‌లో తలపడడం రెండోసారి కాగా, వారిమధ్య రెండో మ్యాచ్ కూడా ఫలితం తేలకుండానే 30-30 స్కోరుతో టైగా ముగిసింది. ఒడిశా దూకుడుగా ఆడి, చెన్నై స్టార్ ప్లేయర్లకు ముకుతాడు వేసింది. ఈ మ్యాచ్‌లో చెన్నై అటాకర్స్ స్థాయికి తగ్గట్టు ఆడలేకపోవడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీశాయి. ఇక, ముంబై ఖిలాడీస్-గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ కూడా 26-26 స్కోరుతో టైగా ముగిసింది.


లిచ్‌ఫీల్డ్ (119)

హర్మన్ సేన ఫ్లాప్ షో

● మూడో వన్డేలో భారత్ చిత్తు
● లిచ్‌ఫీల్డ్ శతకం ● 3-0తో ఆసీస్ క్లీన్ స్వీప్

ముంబై: ఆల్‌రౌండ్ వైఫల్యంతో భారత మహిళల జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (125 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 119) సెంచరీతో.. మంగళవారం ఏకపక్షంగా జరిగిన మూడో, ఆఖరి వన్డేలో ఆసీస్ 190 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 338 పరుగుల స్కోరు చేసింది. వన్డేల్లో భారత్‌పై కంగారూలకు ఇదే అత్యధిక స్కోరు. కెప్టెన్ అలిస్సా హీలీ (82) రాణించింది. శ్రేయాంక పాటిల్ మూడు వికెట్లు, అమన్‌జోత్ రెండు వికెట్లు పడగొట్టారు. స్పిన్నర్ మన్నత్ కశ్యప్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసింది. ఛేదనలో భారత్ 32.4 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలింది. దీప్తి శర్మ (25 నాటౌట్), స్మృతీ మంధాన (29), జెమీమా (25) టాప్ స్కోరర్లు. యాస్తిక (6), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (3)తోపాటు రిచా (19) విఫలం కావడంతో టీమిండియా మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకొంది. వేర్హమ్ మూడు వికెట్లు పడగొట్టగా.. సదర్లాండ్, మేగన్ స్కట్, అలనా కింగ్‌లు తలో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. లిచ్‌ఫీల్డ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచింది.

3 పరుగుల పరంగా భారత్‌కు ఇది మూడో అతిపెద్ద ఓటమి.

4 వన్డేల్లో 100 వికెట్లు తీసిన నాలుగో భారత బౌలర్‌గా దీప్తి శర్మ. జులన్ గోస్వామి (255), నీతూ డేవిడ్ (141), నౌషీన్ (100) ముందుగా ఈ ఘనతను అందుకొన్నారు.

9 టీమిండియాపై ఆసీస్‌కు ఇది వరుసగా 9వ సిరీస్ విజయం.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: లిచ్‌ఫీల్డ్ (సి) హర్మన్ (బి) దీప్తి 119, హీలీ (బి) వస్త్రాకర్ 82, పెర్రీ (ఎల్బీ) అమన్‌జోత్ 16, మూనీ (ఎల్బీ) పాటిల్ 3, మెక్‌గ్రాత్ (ఎల్బీ) పాటిల్ 0, గార్డ్‌నర్ (బి) పాటిల్ 30, సదర్లాండ్ (సి) హర్మన్ (బి) అమన్‌జోత్ 23, వేర్హమ్ (నాటౌట్) 11, అలనా కింగ్ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 50 ఓవర్లలో 338/7; వికెట్ల పతనం:** 1-189, 2-209, 3-216, 4-216, 5-256, 6-295, 7-299; **బౌలింగ్:** రేణుక 7-0-52-0, వస్త్రాకర్ 10-0-68-1, పాటిల్ 10-0-57-3, కశ్యప్ 3-0-30-0, దీప్తి 10-0-53-1, అమన్‌జోత్ 10-0-70-2.

భారత్: యాస్తిక (బి) స్కట్ 6, మంధాన (సి) గార్త్ (బి) స్కట్ 29, రిచా (బి) వేర్హమ్ 19, హర్మన్‌ప్రీత్ (సి) మూనీ (బి) వేర్హమ్ 3, జెమీమా (సి) కింగ్ (బి) గార్డ్‌నర్ 25, దీప్తి (నాటౌట్) 25, అమన్‌జోత్ (సి) లిచ్‌ఫీల్డ్ (బి) కింగ్ 3, పూజా వస్త్రాకర్ (బి) కింగ్ 14, పాటిల్ (సి) మెక్‌గ్రాత్ (బి) సదర్లాండ్ 2, రేణుక (సి) హీలీ (బి) సదర్లాండ్ 0, మన్నత్ (సి) మూనీ (బి) వేర్హమ్ 8; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 32.4 ఓవర్లలో 148 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-32, 2-43, 3-57, 4-72, 5-98, 6-102, 7-128, 8-135, 9-135; **బౌలింగ్:** మేగన్ స్కట్ 6-1-23-2, కిమ్ గార్త్ 5-0-33-0, వేర్హమ్ 6.4-0-23-3, గార్డ్‌నర్ 7-0-38-1, అలనా కింగ్ 5-0-21-2, సదర్లాండ్ 3-0-9-2.

క్లీన్‌స్వీప్‌పై ఆసీస్ దృష్టి

ఆఖరి టెస్ట్ ఆడనున్న వార్నర్



సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన కెరీర్‌లో చివరి టెస్టుకు సిద్ధమయ్యాడు. బుధవారం నుంచి పాకిస్థాన్‌తో అతడి సొంత మైదానంలోనే ఆసీస్ మూడో టెస్టు ఆడబోతోంది. ఇప్పటికే రెండు టెస్టులు గెలిచిన కమిన్స్ సేన క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. ఇక ఓదార్పు విజయం కోసం చూస్తున్న పాక్ తమ స్టార్ పేసర్ షహీన్‌షాకు విశ్రాంతినివ్వగా, ఓపెనర్ ఇమామ్‌పై వేటు వేసింది. అతడి స్థానంలో 21 ఏళ్ల సయీమ్ అయూబ్ అరంగేట్రం చేయనున్నాడు.

రాణించిన అవనీశ్

అండర్-19 ముక్కోణపు టోర్నీ

జొహానె్‌స్‌బర్గ్: అండర్-19 ముక్కోణపు సిరీస్‌లో భారత కుర్రాళ్లు దూసుకెళ్తున్నారు. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబరిచిన భారత్ ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. తెలంగాణ బ్యాటర్ అవనీశ్ (60 నాటౌట్)తో పాటు ఓపెనర్లు అర్షిన్ (91), ఆదర్ష్ (66) విజయంలో కీలక పాత్ర పోషించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరాధ్య శుక్లాకు 4, సౌమీకి 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో భారత్ 40.5 ఓవర్లలో 3 వికెట్లకు 244 పరుగులు చేసి గెలిచింది.

జాగ్రెబ్ ఓపెన్‌కు భారత రెజ్లర్లు వీరే!

న్యూఢిల్లీ: క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో ఈనెల 10 నుంచి జరిగే రెజ్లింగ్ పోటీల్లో 13 మంది భారత రెజ్లర్లు బరిలోకి దిగనున్నారని జాతీయ రెజ్లింగ్ సమాఖ్య అడ్‌హాక్ కమిటీ వెల్లడించింది. 12 మంది సహాయ సిబ్బంది క్రొయేషియా వెళ్లనున్నారని, వీరికి వీసా సమస్య ఎదురవగా క్రీడాశాఖ చొరవ తీసుకొని పరిష్కరించిందని అడ్‌హాక్ కమిటీ తెలిపింది.
ఫ్రీస్టయిల్: అమన్ (57 కిలోలు), యశ్ (74 కి.), దీపక్ పూనియా (86 కి.), విక్కీ(97 కి.), సుమిత్ (125 కి.), **గ్రీకో రోమన్:** జ్ఞానేందర్(60కి.),నీరజ్(67 కి.), వికాస్ (77 కి.), సునీల్ (87 కి.), నరేందర్(97 కి.), నవీన్ (130 కి.), **మహిళల కేటగిరీలో** సోనమ్ (62 కి.), రాధిక (68 కి.).

బిజినెస్

బ్యాంకుల డివిడెండ్‌పై కొత్త మార్గదర్శకాలు



ఆదేశాలు జారీ చేసిన ఆర్‌బీఐ

ముంబై: డివిడెండ్‌ల చెల్లింపులపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)..బ్యాంకులకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 6 శాతం కంటే తక్కువ ఉన్న బ్యాంకులకు మాత్రమే డివిడెండ్ చెల్లించే అర్హత ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దీనికి తోడు ఆ వాణిజ్య బ్యాంకుల క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి (సీఏఆర్) 11.5 శాతం ఉండాలని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2005లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం నికర ఎన్‌పీఏలు ఏడు శాతం లోపు ఉన్న బ్యాంకులకు మాత్రమే వాటాదారులకు డివిడెండ్ ప్రకటించే అధికారం ఉంటుంది.

బాసెల్ 3 నిబంధనల నేపథ్యంలో: బాసెల్ 3 నిబంధనల అమలు, సత్వర దిద్దుబాటు చర్యల సమీక్ష అనంతరం ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. డివిడెండ్ చెల్లింపునకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకుల సీఏఆర్ మాత్రం 15 శాతం ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. లోకల్ ఏరియా బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల సీఏఆర్ మాత్రం 9 శాతం ఉన్నా డివిడెండ్ చెల్లించ వచ్చని తెలిపింది. చెల్లించే డివిడెండ్‌పై ఉన్న పరిమితినీ పెంచింది. జీరో నికర ఎన్‌పీఏలు ఉన్న బ్యాంకులు తమ నికర లాభంలో 50 శాతం వరకు డివిడెండ్‌గా చెల్లించవచ్చని పేర్కొంది. ఇంతకు ముందు ఈ పరిమితి 40 శాతంగా ఉండేది.

సమయ పాలనలో హైదరాబాద్ విమానాశ్రయం బెస్ట్

అంతర్జాతీయంగా రెండో స్థానం
మూడో స్థానంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్



న్యూఢిల్లీ: నిర్వహణాపరమైన పనితీరు, సమయపాలనలో మన దేశానికి చెందిన హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా విమానాశ్రయాలు తమ సత్తా చాటాయి. ఈ విషయంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయంగా పెద్ద ఎయిర్‌పోర్టుల్లో విభాగంలో రెండో స్థానంలో నిలవగా బెంగళూరు విమానాశ్రయం మూడో స్థానంలో, కోల్‌కతా ఎయిర్‌పోర్టు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. 'ఆన్- టైమ్ పెర్ఫార్మెన్స్ (ఓటీపీ) రివ్యూ' పేరుతో సిరియం అనే ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక ఈ విషయం తెలిపింది. నిర్వహణపరమైన పనితీరు, సమయ పాలనపరంగా అమెరికా, మిన్నెపొలిస్‌లోని సెయింట్ పాల్ అంతర్జాతీయ విమానాశ్రయం 84.44 శాతం ఓటీపీతో అగ్రస్థానంలో నిలవగా, హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) 84.42 శాతం ఓటీపీతో రెండో స్థానంలో, బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం 84.08 శాతం ఓటీపీతో మూడో స్థానంలో నిలిచాయి. మీడియం విమానాశ్రయాల విభాగంలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 83.91 శాతం ఓటీపీతో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

ఎనిమిదో స్థానంలో ఇండిగో ఎయిర్‌లైన్స్

బడ్జెట్ ఎయిర్‌లైన్స్ విభాగంలో దక్షిణాఫ్రికాకు చెందిన సఫైర్ 92.36 శాతం ఓటీపీతో అగ్రస్థానంలో నిలిచింది. మన దేశానికి చెందిన ఇండిగో ఎయిర్‌లైన్స్ 82.12 శాతం ఓటీపీతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతం పరంగా చూస్తే లో బడ్జెట్ ఎయిర్‌లైన్స్ విభాగంలో జపాన్‌కు చెందిన ఆల్ నిప్పాన్ ఎయిర్‌వేస్ (82.75 శాతం ఓటీపీ), జపాన్ ఎయిర్‌లైన్స్ (82.58 శాతం ఓటీపీ), థాయ్ ఎయిర్ ఏషియా (82.52 శాతం ఓటీపీ) తొలి మూడు స్థానాల్లో ఉండగా మన దేశానికి చెందిన ఇండిగో నాలుగో స్థానంలో ఉంది.

ఆల్టర్నేటివ్ ఫండ్స్ కోసం కేఫిన్‌టెక్ కొత్త ప్లాట్‌ఫామ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) కోసం కేఫిన్‌టెక్ కొత్త అడ్మినిస్ట్రేషన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫండ్ నిర్వహణలో ఉన్న భద్రత, అనుకూలతల కారణంగా ఏఐఎఫ్ విభాగంలోని ఫండ్లలోకి మరిన్ని పెట్టుబడులు రావడానికి ఈ ప్లాట్‌ఫామ్ దోహదం చేయగలదని కేఫిన్‌టెక్ వెల్లడించింది. సమగ్ర ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ప్లాట్‌ఫామ్ అయిన 'ఎక్స్‌ఏఎల్‌టీ' ఫండ్ మేనేజర్లు, ఇన్వెస్టర్లకు ఏఐఎఫ్‌లలోని క్లిష్టమైన అంశాలను అర్థం చేసుకోవడానికి దోహదం పడుతుందని పేర్కొంది.

క్రూడాయిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంపు

న్యూఢిల్లీ: దేశంలో ఉత్పత్తి అయ్యే ముడి చమురుపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం మరింత పెంచింది. ఇప్పటి వరకు టన్నుకు రూ.1,300గా ఉన్న ఈ ట్యాక్స్‌ను రూ.2,300కు పెంచింది. డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై ఉన్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పూర్తిగా ఎత్తివేసింది. పెట్రోల్ ఎగుమతులపై ఉన్న నిల్ డ్యూటీని యథాతథంగా ఉంచింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆయిల్ కంపెనీల అసాధారణ లాభాలపై ఇతర దేశాల్లా మన దేశం కూడా విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది. ఈ పెంపు, సవరణలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

సెజ్‌లకు ఊరట

న్యూఢిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని పరిశ్రమలకు ప్రభుత్వం మరో ఊరట కల్పించింది. ఈ సంస్థలు ఉపయోగించిన లాప్‌ట్యాప్‌లు, డెస్క్‌టాప్‌లు, ప్రింటర్లు, మానిటర్లను లైసెన్సు లేకుండానే దేశీయ టారిఫ్‌లు ఉండే ప్రాంతాలకు బదిలీ చేసేందుకు విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ అనుమతించింది. అయితే సెజ్‌ల్లోని కంపెనీలు ఈ వస్తువులను కనీసం రెండేళ్ల పాటు ఉపయోగించి ఉండడంతో పాటు తయారీ తేదీ నుంచి అవి ఐదేళ్లకు మించి పాతవిగా ఉండకూడదని స్పష్టం చేసింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 379 పాయింట్లు డౌన్

ముంబై: ఐటీ, బ్యాంకింగ్, వాహన రంగ షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. సెన్సెక్స్ 379.46 పాయింట్లు కోల్పోయి 71,892.48 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 658 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ ఫార్మా, ఎనర్జీ రంగ షేర్లలో కొనుగోళ్లు సూచీల నష్టాలను తగ్గించాయి. నిఫ్టీ విషయానికొస్తే, 76.10 పాయింట్ల నష్టంతో 21,665.80 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. రంగాలవారీ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్, ఆటో, బ్యాంకెక్స్, రియల్టీ, ఐటీ, 1శాతానికి పైగా క్షీణించాయి.

● ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు కోల్పోయి 83.32 వద్ద ముగిసింది.
● అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 2శాతానికి పైగా పెరిగి 78.58 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఐపీఓ కోసం రేస్ పవర్ ఇన్‌ఫ్రా దరఖాస్తు

పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోసం సోలార్ ఈపీసీ కంపెనీ రేస్ పవర్ ఇన్‌ఫ్రా, ఇంటిగ్రేటెడ్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీ ఎస్కోనెట్ టెక్నాలజీస్ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించాయి. ఐపీఓలో భాగంగా రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లకు చెందిన 29.95 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు రేస్ పవర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. కాగా, పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా 33.60 లక్షల తాజా షేర్లను అమ్మకానికి పెట్టనున్నట్లు ఎస్కోనెట్ టెక్నాలజీస్ పేర్కొంది. ఎస్కోనెట్ ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ కావాలనుకుంటోంది. ఇకపోతే, ఈ ఏడాదిలో ఐపీఓకు రావాలనుకుంటున్నట్లు డివైన్ పవర్ ఎనర్జీ ప్రకటించింది.

రూ.152 కోట్ల విలువైన వీఎస్‌టీ షేర్లను విక్రయించిన మ్యూచువల్ ఫండ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఓపెన్ మార్కెట్లో వీఎస్‌టీ ఇండస్ట్రీస్‌కు చెందిన 2.9 శాతం వాటాకు సమానమైన 4.5 లక్షల షేర్లను హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ విక్రయించాయి. రూ.152 కోట్లకు ఈ వాటాను విక్రయించాయి. ఒక్కో షేర్‌ను రూ.3,390-3,390.13 శ్రేణి ధరలో విక్రయించారు. కాగా ఎస్‌బీఐ ఎంఎఫ్ 2.25 లక్షల షేర్లను కొనుగోలు చేయగా.. అవెన్యూ సూపర్ మార్ట్స్ (డీమార్ట్) ప్రమోటర్ రాధాకిషన్ దమానీ 2.22 లక్షల షేర్ల వరకూ సొంతం చేసుకున్నారు.

రూ.64,000 దాటిన గోల్డ్

ఈ ఏడాదిలో రూ.70,000కు చేరే అవకాశం: జీజేసీ

విలువైన లోహాల ధరలు మరింత ఎగబాకాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర మంగళవారం రూ.280 పెరిగి రూ.64,200కు చేరుకుంది. కిలో వెండి రేటు రూ.300 పెరుగుదలతో రూ.78,800గా నమోదైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లను గణనీయంగా తగ్గించవచ్చన్న అంచనాల నేపథ్యంలో బులియన్‌కు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,075 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 24 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాదిలో ఔన్స్ గోల్డ్ 2,300 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని.. దేశీయంగా తులం పసిడి రూ.70,000కు పెరగవచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేసింది.

2030 నాటికి రూ. లక్ష కోట్ల మత్స్య ఎగుమతులు

ఏపీలో రూ.20,000 కోట్లతో ఫిషింగ్ హార్బర్, ప్రాసెసింగ్ యూనిట్లు ● కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

రేపల్లె: మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవటంతో పాటు 2030 నాటికి భారత్ నుంచి రూ.లక్ష కోట్ల విలువైన మత్స్యసంపద ఎగుమతి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. మంగళవారం నాడు బాపట్ల జిల్లా నిజాంపట్నం హార్బర్‌లో సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా సాగర్ పరిక్రమ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 146.15 లక్షల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. దేశవ్యాప్తంగా పది తీర ప్రాంత రాష్ట్రాల్లోని 88 ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గుజరాత్‌లోని మాండ్వి నుంచి ఈ అభివృద్ధి మొదలైందన్నారు. కాగా చెన్నై పోర్టు నుంచి ప్రారంభమైన 10వ దశ సాగర్ పరిక్రమ ద్వారా రూ.20,000 కోట్ల పెట్టుబడులతో జువ్వలదెన్నె, ఫిషింగ్ హార్బర్, కొత్తపట్నం, చీరాల ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్, గిలకలదిండి గ్రామం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్, ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని తెలిపారు.


ఆంధ్రప్రదేశ్‌లో 975 కిలో మీటర్ల సముద్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు ఆక్వా పార్కులు మంజూరు చేశామన్నారు. నిజాంపట్నం హార్బర్‌ను రూ.455 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మత్స్యకారులకు వాకీటాకీలు, జీపీఎస్‌లు సబ్సిడీ రుణాలను అందజేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బల్క్ డిపాజిట్ స్కీమ్

వార్షిక వడ్డీ 7.5 శాతం వరకు...

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 175 రోజుల కాలపరిమితి గల కొత్త బల్క్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. జనవరి 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిన ఈ స్కీమ్ కింద రూ.2 కోట్ల నుంచి రూ.50 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.50% వార్షిక వడ్డీ అందిస్తుంది. గతంలో 174 రోజుల కాలపరిమితి గల ఇదే డిపాజిట్‌పై 6% వడ్డీ ఇచ్చే వారు. ఈ స్కీమ్ రుపీ టర్మ్ డిపాజిట్లకు మాత్రమే పరిమితం. అలాగే పరిమిత కాలం వరకు మాత్రమే ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.

డీసీబీ హ్యాపీ సేవింగ్స్ అకౌంట్: ప్రైవేట్ రంగంలోని డీసీబీ హ్యాపీ సేవింగ్స్ అకౌంట్‌ను ప్రారంభించింది. అకౌంట్ హోల్డర్లు దేశంలో చేసే అర్హత గల యూపీఐ డెబిట్ లావాదేవీలపై క్యాష్‌బాక్ పొందుతారు. ఈ రివార్డు రూ.7,500 వరకు కూడా ఉండవచ్చు. కనీస లావాదేవీ మొత్తం రూ.500. అయితే ఈ ఖాతా తెరిచే వారు ఖాతాలో కనీస నగదు నిల్వ రూ.25,000 ఉంచాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	64,090 ▲	58,750 ▲	80,300 ▲
ముంబై	63,602 ▲	58,259 ▲	74,133 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ	
హైదరాబాద్	582
3 జనవరి	
చిత్తూరు	608
గోదావరి	585
విజయవాడ	585
విశాఖపట్నం	625
వరంగల్	584
దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	102
వరంగల్	102
కరీంనగర్	102
మహబూబ్‌నగర్	102
కర్నూలు	102
విశాఖపట్నం	99
గోదావరి	104
విజయవాడ	104
గుంటూరు	100
ఒంగోలు	100
చిత్తూరు	105

విజయసాయిరెడ్డి బావమరిది ద్వారకానాథరెడ్డి నేడు టీడీపీలో చేరిక


గడికోట ద్వారకానాథరెడ్డి

రాయచోటి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి స్వయానా బావమరిది, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. బుధవారం విజయవాడలో చంద్రబాబు సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకోనున్నారు. 1994లో గడికోట ద్వారకానాథరెడ్డి లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ తరఫున గెలుపొందారు. 1999లో తెలుగుదేశం పార్టీ ఇవ్వకపోవడంతో అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009లో సైతం టికెట్ కోసం ప్రయత్నించినా దక్కలేదు. వైసీపీ ఆవిర్భావం తర్వాత 2014లో ఆ పార్టీ టికెట్‌ను ఆశించారు. 2019లో సైతం వైసీపీ, తెలుగుదేశం పార్టీల తరఫున టికెట్‌ను ఆశించినా దక్కలేదు. అనంతరం ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ప్రస్తుతం ఆయన రాయచోటి టీడీపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ద్వారకానాథరెడ్డి తండ్రి రామసుబ్బారెడ్డి 1978లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 నుంచి ఈయన కుటుంబం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంది. ఎంపీ విజయసాయిరెడ్డి భార్య ద్వారకానాథరెడ్డికి స్వయానా అక్క. ద్వారకానాథరెడ్డితో పాటు ఆయన అన్న గడికోట సురేంద్రనాథరెడ్డి, అక్క హరెమ్మ (నందమూరి తారకరత్నకు స్వయానా అత్త) కూడా నేడు టీడీపీలో చేరనున్నారు. ఇప్పటికే రాయచోటి ఎమ్మెల్యే టికెట్‌ను టీడీపీ తరఫున ముగ్గురు నాయకులు ఆశిస్తుండగా ద్వారకానాథరెడ్డి చేరిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

వైసీపీకి దాడి ఫ్యామిలీ రాజీనామా

- కుమారులతో కలసి నేడు టీడీపీలోకి వీరభద్రరావు

అనకాపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీ వైసీపీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు కుటుంబం పార్టీకి రాజీనామా చేసింది. వీరభద్రరావుతోపాటు ఆయన కుమారులు దాడి రత్నాకర్, దాడి జైవీర్‌లు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పార్టీ అధినేత, సీఎం జగన్‌తో పాటు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం వీరభద్రరావు ఇద్దరు కుమారులు మీడియాతో మాట్లాడారు. పార్టీలో తగిన ప్రాధాన్యం లేనందునే రాజీనామా చేసినట్టు తెలిపారు. తమ అనుచరులు కూడా రాజీనామా చేస్తారని చెప్పారు. బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌ల సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు.

టీడీపీతోనే భవిష్యత్తు!.. వైసీపీలో కొనసాగలేం

- దేశంలో చేరేందుకు క్యూ కట్టిన బాపట్ల జిల్లా నేతలు

బాపట్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): "టీడీపీతోనే భవిష్యత్తు. అభివృద్ధికి అర్థం తెలియని వైసీపీలో కొనసాగలేం. నాలుగున్నరేళ్లుగా మాకు కనీస గుర్తింపు ఇవ్వకుండా పూచికపుల్లతో సమానంగా చూశారు. ఇక స్థానిక నేతల దోపిడీకి అంతు లేకుండా పోయింది" అని బాపట్ల వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలో ఒకరి వెంట ఒకరు టీడీపీ బాట పట్టారు. మొన్న నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య టీడీపీలో చేరగా, నిన్న పిట్టలవానిపాలెం జడ్పీటీసీ సురేఖ స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. తాజాగా ఇదే నియోజకవర్గం పరిధిలోని కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి సైతం వైసీపీకి రాంరాం చెప్పారు. బుధవారం ఆయన చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. ఇక, వేమూరులో వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళీకృష్ణ తన పదవికి రాజీనామా చేసి, మంత్రి మేరుగ నాగార్జునపై నిప్పులు చెరిగారు. ఈయన కూడా టీడీపీలో చేరనున్నారని తెలిసింది.

వైసీపీలోకి బళ్లారి శాంత

- ఆ వెంటనే హిందూపురం ఎంపీ టికెట్
- బీజేపీ నేత శ్రీరాములు సోదరికి ప్రాధాన్యం

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక బీజేపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు సోదరి, బళ్లారి మాజీ ఎంపీ జె.శాంత వైసీపీలో చేరారు. మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ పార్టీ కండువా కప్పి ఆమెను ఆహ్వానించారు. ఆ వెంటనే ఆమెకు హిందూపురం ఎంపీ టికెట్ ఇచ్చేశారు. గాలి జనార్దన రెడ్డి అత్యంత సన్నిహితుడైన శ్రీరాములుకు శాంత సొంత సోదరి. గాలి జనార్దన రెడ్డి ప్రోద్బలంతోనే రాజకీయాల్లో అడుగుపెట్టారు. గతంలో బళ్లారి ఎంపీగా గెలిచారు. ఇప్పుడామెను పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుని మరీ వైసీపీ టికెట్ ఇచ్చేశారు. కానీ... ఆమెను గుంతకల్లు వాసిగా చూపించడం గమనార్హం. శ్రీరాములు సిఫారసు మేర కు గతంలోనూ జగన్ కొందరికి ఎమ్మెల్యే టికెట్లిచ్చారు. మంత్రి పదవులూ కట్టబెట్టారు. గాలితోజగన్ బాంధవ్యం కొనసాగుతోందనేందుకు ఇది తాజా నిదర్శనం.

రేపే కాంగ్రెస్‌లోకి షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు వారికి స్పష్టత ఇచ్చారు. ఏఐసీసీలో కీలక పదవి, ఆంధ్రప్రదేశ్ పీసీసీ బాధ్యతలు తనకిచ్చే అవకాశం ఉందనీ వారికి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన బాధ్యత స్వీకరించి పోరాటానికి సిద్ధపడతానని షర్మిల పేర్కొన్నారు. అన్ని అంశాలపై రెండ్రోజుల్లో స్పష్టత ఇస్తానని షర్మిల మీడియాకు చెప్పారు. తన వెంట నడుస్తానని ప్రకటించిన ఆళ్ల రామకృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

చేరికపై ఇదివరకే నిర్ణయం: షర్మిల

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని, దీనిపై ఇది వరకే నిర్ణయం తీసుకున్నానని షర్మిల తెలిపారు. ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వేదికగా సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించారు. మంగళవారం వైఎస్ఆర్ ఘాట్‌ను షర్మిల, ఆమె తల్లి వైఎస్ విజయలక్ష్మి, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ, ఆమె తల్లిదండ్రులు అట్లూరి శ్రీనివాస్, మాధవితో కలిసి సందర్శించారు. కుమారుడి వివాహ పత్రికను వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద ఉంచారు. సమాధి వద్ద, ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని తండ్రి చెంతకు వచ్చామని, ఆయన ఆశీర్వాదం తీసుకున్నామని షర్మిల అన్నారు. కొత్త జంట సంతోషంగా ఉండాలని ప్రజలంతా కోరుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌లో పనిచేయాలని ఇదివరకే నిర్ణయించామని, తెలంగాణలో కాంగ్రెస్‌కు తాము మద్దతివ్వడం వల్లే అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని దించడంలో వైఎస్ఆర్‌టీపీ చాలా పెద్దపాత్ర పోషించిందని.. 31 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, తాము పోటీచేయకపోవడమే దీనికి కారణమని తెలిపారు. తాము పోటీ చేసి ఉంటే కాంగ్రెస్‌కు ఇబ్బంది తలెత్తేదని, తమ పార్టీ, తాను చేసిన త్యాగానికి విలువిచ్చి.. కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. 'ఆ పార్టీతో కలిసి పనిచేసేందుకు అభ్యంతరం లేదు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ. ప్రజల భద్రత కోసం పని చేసే పార్టీని బలపరచాలని నిర్ణయించాం. బుధవారమే ఢిల్లీ వెళ్తున్నా. ఒకట్రెండు రోజుల్లో మీ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది' అని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరాక షర్మిల విజయవాడ రానున్నారు. ఆమె సమక్షంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరతారు.



అన్నా.. మేనల్లుడి పెళ్లికి రా!

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టనున్న వైఎస్ఆర్‌టీపీ నాయకురాలు వైఎస్ షర్మిల.. తన అన్న, సీఎం జగన్మోహన్‌రెడ్డితో బుధవారం తాడేపల్లిలో సమావేశం కానున్నారు. తన కుమారుడు, ఆయన మేనల్లుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేయనున్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు తాడేపల్లి ప్యాలెస్‌కు రావాలని షర్మిలకు జగన్ నుంచి సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె విజయవాడ రానున్నారు. తాడేపల్లి వెళ్లి జగన్‌కు పెళ్లి పత్రికను అందజేసి ఆహ్వానించాక.. నేరుగా గన్నవరం వెళ్లి.. ఢిల్లీ బయల్దేరతారు. తన విజయవాడ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని ఆమె కాంగ్రెస్ నేతలకు తెలియజేసినట్లు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారం ఉదయమే ఢిల్లీ వెళ్తున్నారు.

బడుగులే బలి!

తప్పు జగన్‌ది.. శిక్ష ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు.. నిధులివ్వరు.. అభివృద్ధి చేయరు

- కానీ ప్రజావ్యతిరేకత అంటూ సీటు కట్
- దళిత, గిరిజన ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్మోహన్‌రెడ్డి వైసీపీలోని బడుగు నేతల రాజకీయ జీవితాలను బలి పెడుతున్నారు. బహిరంగ వేదికల్లో నా ఎస్సీలూ, నా ఎస్టీలూ అంటూ దీర్ఘాలు తీస్తూనే.. నయవంచనకు పాల్పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో సబ్‌ప్లాన్ నిధులివ్వకుండా.. అభివృద్ధి పనులు చేయకుండా .. నిధులు విదల్చకుండా.. రిజర్వుడు నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోందంటూ సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికులకు టికెట్లు నిరాకరిస్తున్నారు. ప్రజల్లో గ్రాఫ్ తగ్గిందంటూ.. ఏవేవో సర్వేలను బూచిగా చూపి.. మంత్రి మేరుగ నాగార్జునను బాపట్ల జిల్లా వేమూరు నుంచి ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు తరిమేశారు. ఆయన పనితీరుపై నియోజకవర్గ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. పనితీరు బాగోనప్పుడు శాఖ మార్చాలి గానీ.. ఏకంగా ఎక్కడికో పంపడం ఏమిటని నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా కొండపి నేత అశోక్‌బాబును తమ ఇన్‌చార్జిగా నియమించడంపై మండిపడుతున్నాయి. ఇక పురపాలక మంత్రి ఆదిమూలపు సురేశ్‌ను కూడా యర్రగొండపాలెం నుంచి కొండపికి పంపారు. అలాగే హోం మంత్రి పదవి నుంచి తొలగించిన మేకతోటి సుచరితను.. ప్రత్తిపాడు నుంచి తాడికొండకు బదిలీ చేశారు. ఈ బదిలీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్థానికేతరులను పంపితే దశాబ్దాలుగా రాజకీయ పునాదులు వేసుకున్న నేతలు సహకరిస్తారా అని వైసీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. జగన్ సామాజికవర్గానికి చెందిన నేతలను ఇలా బదిలీ చేస్తారా అని నిలదీస్తున్నారు.

వారితో కనీసం చర్చల్లేవీ..?

జగన్ ఏనాడూ పట్టుమని పది సెకన్లు కూడా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడలేదు. గతంలో ఏటా ఒకసారైనా అసెంబ్లీ సమావేశాల సమయంలో వారితో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యే సంప్రదాయం ఉండేది. జగన్ పగ్గాలు చేపట్టాక ఈ ఆనవాయితీని తుంగలో తొక్కారు. ప్రత్యేక సమావేశాల సంగతి దేవుడెరుగు.. మంత్రులతోనూ వారి శాఖలపై సమీక్షలు నిర్వహించలేదు. గిరిజన సంక్షేమ మంత్రి పదవి నుంచి పాముల పుష్పశ్రీవాణిని ఎందుకు తొలగించారో వివరణ కూడా ఇవ్వలేకపోయారు. సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరను ఉప ముఖ్యమంత్రిని చేసినా.. ఇప్పటిదాకా గిరిజన సంక్షేమంపై అసెంబ్లీలో చర్చే జరుగలేదు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులేమయ్యాయో తెలియదు. 2019 ఎన్నికల్లో కొండపి, రాజోలులో తప్ప అన్ని రిజర్వుడు నియోజకవర్గాల్లో వైసీపీ విజయం సాధించింది. ఇందులో రాజోలులో గెలిచిన జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వైసీపీలోకి ఫిరాయించారు. వైసీపీ బలోపేతంలో ప్రముఖ పాత్ర పోషించిన ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల అభివృద్ధిపై జగన్ పూర్తి నిర్లక్ష్యం వహించారు. రిజర్వుడు స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గం నేతలకు బాధ్యతలు కట్టబెట్టారు. నందికొట్కూరు(ఎస్సీ)లో ఎమ్మెల్యే ఆర్థర్ బదులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధిపత్యమే. కనీసం ప్రొటోకాల్ కూడా పాటించని వైనాన్ని సీఎం ఒక్కరోజు కూడా పట్టించుకోలేదు. కడప జిల్లా బద్వేలు, చిత్తూరు జిల్లా సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలపైనా రెడ్ల ఆధిపత్యమే. ఈ సారి వీరికి టికెట్లు ఇచ్చేది లేదని.. ప్రజావ్యతిరేకత ఉందని సీఎం చెప్పేశారు. ఇద్దరు రెడ్లు తమ నియోజకవర్గాల్లో పెత్తనం సాగిస్తున్నారని.. వారు చెప్పినట్లే చేస్తున్నామని.. ఏమైనా వ్యతిరేకత ఉంటే వారిపై ఉండాలని.. తమపై ఎందుకు ఉంటుందని ఇటీవల వారు సీఎంను ప్రశ్నించారు కూడా. దీనికి ఆయన జవాబివ్వలేదు. తాము పనిచేసుకునేందుకు ఎక్కడ స్వేచ్ఛ ఇచ్చారని వారు నిలదీశారు.

ఇదేం సామాజిక న్యాయం?

శ్రీకాకుళం జిల్లా రాజాం నుంచి మొదలుకొని చిత్తూరు జిల్లా పూతలపట్టు దాకా రిజర్వుడు నియోజకవర్గాల్లో మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని టికెట్ నిరాకరించనున్నారు. దీంతో ఇదేనా సామాజిక న్యాయమని వారు నిలదీస్తున్నారు. వైసీపీ నాయకత్వం అధికారికంగా టికెట్లు ప్రకటించాక అందరూ కలిసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే ఆలోచనలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఆ గౌరవం ఇక్కడేదీ?

నోరు తెరిస్తే నా ఎస్సీలని మాట్లాడే జగన్.. తమను రెడ్ల చేతిలో కీలు బొమ్మలు చేశారంటూ ఎస్సీ ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన దళిత వర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్కకు లభిస్తున్న గౌరవం.. ఈ నాలుగున్నరేళ్లలో ఇక్కడి ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామికి లభించిందా అని ప్రశ్నిస్తున్నారు. వైసీపీలో కీలకమైన పెద్దిరెడ్డి దగ్గర నారాయణస్వామి స్థానమేంటో చిత్తూరు జిల్లాలో చెబుతారని అంటున్నారు. కోనసీమ సభలో జగన్ స్థానిక మంత్రి విశ్వరూప్‌ను ఎక్కడ కూర్చోబెట్టారో చూశారని గుర్తుచేస్తున్నారు. అన్నిటికీ రోజారెడ్డే కనిపిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలే.

బాబును తెగతిట్టినా..

అసెంబ్లీ వేదికగా జగన్ ఆదేశాల మేరకు ప్రతిపక్ష నేత చంద్రబాబును వ్యక్తిగతంగా తిట్టిపోసిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబుకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదు. ఇందుకు కారణమేంటో ఆయనకు చెప్పలేదు. ఇక అమలాపురం ఎమ్మెల్యే, మంత్రి పినిపె విశ్వరూప్ పరిస్థితి మరీ దారుణం. టికెట్ కోసం ఆయనకు, ఆయన కుమారుడికి మధ్య లడాయి పెట్టారు. సీనియర్ నాయకుడైన విశ్వరూప్ అభిప్రాయాన్ని కోరకుండానే ఆయన కొడుకు శ్రీకాంత్‌కు అమలాపురం టికెట్ కేటాయించామని వైసీపీ లీకులు ఇస్తోంది. దీనిపై మంత్రి ప్రాంతీయ సమన్వయకర్త విథున్‌రెడ్డి వద్ద నిరసన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకూ ఈసారి టికెట్ లేదు. తాజాగా మంగళవారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణను తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. వైఎస్ జమానా నుంచి ఆ కుటుంబంతో నడుస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకూ టికెట్ లేదని చెప్పేశారు.

దళితుడిగా పుట్టడమే తప్పా?

వైసీపీలో దళితులకు తీవ్ర అన్యాయం

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం



చిత్తూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు బాగాలేదని రాష్ట్రవ్యాప్తంగా దళిత ఎమ్మెల్యేలను మార్చేస్తూ, అగ్రకులాల వారికి మాత్రం మళ్లీ సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. కేవలం దళితులపై మాత్రమే వ్యతిరేకత ఉందా? అని ఆయన ప్రశ్నించారు. డబ్బులిస్తే సర్వేలు చేసే ఐప్యాక్ పేరు చెప్పి తనకు సీటు నిరాకరించడం దారుణమన్నారు. 2019 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన ఎంఎస్ బాబుకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని వైసీపీ అధిష్ఠానం చెప్పడంతో మంగళవారం ఆయన చిత్తూరులో మాట్లాడారు. 'గడపగడపకు కార్యక్రమాన్ని చేపట్టండి.. మిగతాది నేను చూసుకుంటానని సీఎం అన్నారు. ఇప్పుడేమో సర్వేలో బాగలేదంటున్నారు. ఇదెంతవరకు కరెక్టు. ఐదేళ్లలో ఎన్నడూ సీఎం జగన్ నేరుగా పిలిచి మంచి, చెడు మాట్లాడలేదు. సూచనలు చేయలేదు. ఐప్యాక్ సర్వే కరెక్టు కాదు. డబ్బులిస్తే సర్వే ఫలితాలను మార్చేస్తారు. నేను దళితుడిగా పుట్టిందే వేస్టా. మాటిమాటికీ నా ఎస్సీలు, ఎస్టీలు అంటారే గానీ, మాకేం న్యాయం చేస్తున్నారు? రెడ్లు చెప్పిందే నేను చేశాను. సీఎం గారూ! దళితులకు న్యాయం చేయండి. నా మీద ఏం వ్యతిరేకత ఉందో చెప్పండి. చిత్తూరు, తిరుపతిల్లో వ్యతిరేకత ఉన్నా ఓసీలను ఎక్కడా మార్చకుండా దళితులనే మార్చడమేంటో అర్థంకావడం లేదు' అని తన ఆవేదన వెలిబుచ్చారు. అయితే పార్టీ మారబోనన్నారు.

ప్రజల్లో ఉన్న మాపై వ్యతిరేకతా..?

- ప్యాలెస్ దాటని జగన్‌పై అభిమానమా?
- జనం బాధలు తెలుసుకునే ప్రయత్నం మాది
- ఓట్లను కొనే కమర్షియల్ రాజకీయం ఆయనది
- సీఎంపై వైసీపీ ప్రజాప్రతినిధుల ఆగ్రహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మేం నిరంతరం ప్రజల్లో ఉంటున్నాం.. వాళ్ల సాధక బాధకాలు తెలుసుకుంటున్నాం.. చేతనైనవి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం.. అయినా మాపై వ్యతిరేకత ఉందంటారా..? ఓట్ల కోసం ముద్దులు పెట్టి.. అధికారంలోకి వచ్చాక ప్యాలెస్‌లో కూర్చున్న ఆయనపై మాత్రం అభిమానం ఉందా' అని అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. నాలుగున్నరేళ్ల నియంతృత్వంపై వారు క్రమంగా స్వరం పెంచుతున్నారు. మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ జనంలో తిరుగుతూ జగన్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. దీంతో చలికాలంలోనూ తాడేపల్లి ప్యాలెస్‌లో సెగలు, పొగలు పుడుతున్నాయి. బీసీ జపం చేస్తున్న సీఎం జగన్‌పై మాజీ మంత్రి శంకర్‌నారాయణ అనుచరులు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఎదురు తిరిగారు. 'శంకరన్నకు టికెట్ ఇవ్వకుంటే సత్తా చూపిస్తాం' అంటూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో జగన్ కన్నా ముందు జైలుకు వెళ్లిన మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణకు అన్యాయం చేశారంటూ బాపట్ల జిల్లా రేపల్లె ప్రాంతంలో నిరసన వ్యక్తం అవుతోంది. అదే సామాజిక వర్గానికి చెందిన సీదిరి అప్పలరాజుపైనా మత్స్యకార సామాజిక వర్గం గుర్రుగా ఉంది. ప్రతి విషయంలోనూ జగన్‌కు జైకొట్టే ఆయనకు.. సీఎం కనీస గౌరవం కూడా ఇవ్వలేదని చెబుతున్నారు. పశు సంవర్థక శాఖలో ఇటీవల ఒక కార్యక్రమానికి సంబంధించిన పెద్ద ప్రకటన ఇచ్చిన జగన్ ప్రభుత్వం.. అందులో సీఎంతోపాటు పశువుల ఫొటోలు వేసింది తప్ప మంత్రి ఫొటో కనిపించలేదు. సొంత పార్టీ నేతనైన తన వ్యాపారాలను ఎలా దెబ్బకొట్టి ఎంత వేదనకు గురి చేశారో విశాఖపట్నంలో వంశీకృష్ణ యాదవ్ గగ్గోలు పెట్టారు. దురదృష్టవశాత్తూ తనను ముఖ్యమంత్రి గుర్తించక పోయినా పెనమలూరు ప్రజల్లో గుండెల్లో పెట్టుకున్నారంటూ కృష్ణా జిల్లాలో మాజీ మంత్రి కొలుసు పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎదురు తిరగడం ప్యాలెస్‌లో ప్రకంపనలు సృష్టించింది. ఇదే పరిస్థితి రాష్ట్రంలో మెజారిటీ బీసీల్లో ఉందని వైసీపీ అసంతృప్త వర్గాలు చెబుతున్నాయి. జగన్ ఓట్లను కొనే కమర్షియల్ రాజకీయం మొదలుపెట్టారని.. కార్పొరేట్ రాజకీయంతో వ్యవస్థలు ధ్వంసం చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వలంటీర్లను నెత్తినపెట్టి..

వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు ప్రజల్లో పలుచనయ్యారు. పెన్షన్లు సహా సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారానే నడుస్తున్నాయి. ఒక్కరంటే ఒక్కరికి కూడా సామాజిక పెన్షన్ ఇప్పించలేని నిస్సహాయతతో ఎమ్మెల్యేలు కుమిలిపోతున్నారు. జనం ప్రతిదానికీ వలంటీర్ల వద్దకే వెళ్తున్నారని.. ప్రజాప్రతినిధి అంటే గౌరవం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఊరిలో ఎందరు లబ్ధిదారులు ఉన్నారో తమకే తెలియకుండా పోయిందని.. తామడిగిన అభివృద్ధి పనులను అధికారులు పట్టించుకోవడం లేదని.. గడప గడపకు వెళ్లినప్పుడు ప్రజలు తమను నిలదీస్తుంటే ఏం చెప్పాలో తెలియని దుస్థితి ఎదుర్కొన్నామని అంటున్నారు. అభివృద్ధే చేయకుండా పథకాలతో డబ్బులు పంచి ఓట్లు కొల్లగొడదామన్న భ్రమల్లో అధిష్ఠానం ఉందని చెబుతున్నారు.

మార్పులు.. మంటలు!

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు టికెట్ నిరాకరించారు. మరో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రామచంద్రపురం నుంచి రాజమండ్రి రూరల్‌కు పంపించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును తొలగించి.. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును విజయవాడ వెస్ట్ నుంచి అక్కడకు తరలించారు. తొలి జాబితాలో 11 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను ప్రకటించిన జగన్.. మంగళవారం రెండో జాబితాలోనూ మూడు ఎంపీ ఎంపీ స్థానాలు, 24 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారుచేశారు. ఈ జాబితాను మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. మున్ముందు మరికొన్ని జాబితాలు ఉంటాయని బొత్స వెల్లడించారు. తాజా జాబితాలో.. పార్టీ పెట్టినప్పటి నుంచి నమ్ముకుని ఉన్న సిటింగ్‌లను తొలగించారు. ఐదు చోట్ల తండ్రుల స్థానంలో వారసులకు బాధ్యతలు అప్పగించారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డికి, చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి, మచిలీపట్నంలో పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే షేక్ ముస్తాఫా కుమార్తె షేక్ నూర్‌ఫాతిమా, రామచంద్రపురంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ తనయుడు సూర్యప్రకాశ్‌కు అవకాశం కల్పించారు. బళ్లారి మాజీ ఎంపీ శాంత మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ కలిసి వైసీపీలో చేరారు. ఆ వెంటనే ఆమెను హిందూపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. అశ్లీల ప్రవర్తనతో వివాదాస్పదుడైన హిందూపురం సిటింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను ఇంత కాలం వెనకేసుకొచ్చిన జగన్.. అకస్మాత్తుగా ఆయన్ను తప్పించి శాంతకు అవకాశం కల్పించారు. ఎమ్మెల్యేగా ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నారంటూనే వారిలో కొందరిని లోక్‌సభ ఇన్‌చార్జులుగా నియమించడంపై రాజకీయపక్షాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. పెనుగొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎం.శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. అరకు ఎంపీ మాధవిని అరకు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించి.. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి అరకు లోక్‌సభ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

పాపం బాబూరావు!

విజయనగరం జిల్లా రాజాం (ఎస్సీ) ఎమ్మెల్యే కంబాల జోగులును అనకాపల్లి జిల్లా పాయకరావుపేట (ఎస్సీ) నియోజవర్గానికి బదిలీ చేశారు. వైసీపీ స్థాపించిన నాటి నుంచి జగన్ వెంట నడుస్తున్న గొల్ల బాబూరావుకు రిక్తహస్తం చపించారు. అనకాపల్లిలో మంత్రి అమర్నాథ్ స్థానంలో మలసాల భరత్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. విశాఖకు పాలనా రాజధాని వచ్చేస్తోందని పదే పదే ప్రకటనలు గుప్పిస్తున్న అమర్నాథ్‌కు జాబితాలో చోటు కల్పించకపోవడం వైసీపీలోనే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మార్చి.. వరుపుల సుబ్బారావుకు అవకాశం కల్పించారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ ఇన్‌చార్జిగా పంపారు. రాజమండ్రి లోక్‌సభకు అభ్యర్థిని ప్రకటించలేదు. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి స్థానంలో బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను నియమించారు. యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ స్థానంలో తాడిపత్రి చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జిగా పెట్టారు. సురేశ్‌ను తొలి జాబితాలోనే కొండపికి పంపించిన విషయం తెలిసిందే. జగన్ కాంగ్రెస్‌ను వీడి.. వైసీపీ స్థాపించిన నాటి నుంచి జగన్ వెంట నడచిన పోలవరం (ఎస్టీ) ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గ్రాఫ్ పడిపోయిందంటూ.. ఆయన భార్య రాజ్యలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. కల్యాణదుర్గం అసెంబ్లీ స్థానం బాధ్యతను అనంతపురం ఎంపీ తలారి రంగయ్యకు అప్పగించారు. విజయవాడ పశ్చిమలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు స్థానంలో.. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్‌ను నియమించారు. మల్లాది విష్ణుకు మొండిచేయి చూపి.. వెలంపల్లిని విజయవాడ సెంట్రల్‌కు బదలాయించారు. ఈ ఎపిసోడ్‌లో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన విష్ణును బలిపశువును చేశారన్న విమర్శలు వస్తున్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు టికెట్ దక్కలేదు. ఆయన స్థానంలో మాజీ మంత్రి తోట నరసింహానికి అవకాశమిచ్చారు. కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం అసెంబ్లీ సీటు దక్కింది. పెండెం దొరబాబుకు టికెట్ దక్కలేదు.

వైసీపీ రెండో జాబితా ఇదే...

రాజాం (ఎస్సీ)	తాలె రాజేశ్
అనకాపల్లి	మలసాల భరత్‌కుమార్
పాయకరావుపేట (ఎస్సీ)	కంబాల జోగులు
రామచంద్రపురం	పిల్లి సూర్యప్రకాశ్
పి.గన్నవరం (ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
పిఠాపురం	వంగా గీత
జగ్గంపేట	తోట నరసింహం
ప్రత్తిపాడు	వరుపుల సుబ్బారావు
రాజమండ్రి సిటీ	మార్గాని భరత్
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాల్
పోలవరం (ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
కదిరి	మక్బూల్ అహ్మద్
యర్రగొండపాలెం (ఎస్సీ)	తాటిపర్తి చంద్రశేఖర్
ఎమ్మిగనూరు	మాచాని వెంకటేశ్
తిరుపతి	భూమన అభినయ్‌రెడ్డి
గుంటూరు ఈస్ట్	షేక్ నూరిఫాతిమా
మచిలీపట్నం	పేర్ని కృష్ణమూర్తి
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
పెనుగొండ	ఉష శ్రీచరణ్
కల్యాణదుర్గం	తలారి రంగయ్య
అరకు (ఎస్టీ)	గొట్టేటి మాధవి
పాడేరు (ఎస్టీ)	మత్స్యరాస విశ్వేశ్వర రాజు
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాసరావు
విజయవాడ పశ్చిమ	షేక్ ఆసిఫ్
ఎంపీ స్థానాలు..	
అనంతపురం	శంకరనారాయణ
హిందూపురం	జె.శాంత
అరకు(ఎస్టీ)	కె.భాగ్యలక్ష్మి

కాకినాడ ఎంపీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. తాజా మార్పులు వైసీపీలో మరింత అగ్గిరాజేశాయి. తొలి జాబితాలో 11 మందిని మార్చినప్పుడు.. అందులో ఎంపీ మోపిదేవి వెంకట రమణను రేపల్లె ఇన్‌చార్జిగా తప్పించడంపై ఇప్పటికీ అక్కడ నిరసనలు సాగుతున్నాయి. అలాగే మంత్రి మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేశ్, విడదల రజనిని వేరే చోట్లకు బదిలీ చేయడాన్ని స్థానిక వైసీపీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.

కడదాకా మంతనాలు!

పలువురు ఎమ్మెల్యేలకు తాడేపల్లి పిలుపు

అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జుల ప్రకటనపై కడదాకా వైసీపీ అధిష్ఠానం మంతనాలు సాగించింది. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కలిశారు. నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని జగన్ ఆయన్ను ఆదేశించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కొన్ని షరతులు విధించారని సమాచారం. నెల్లూరు సిటీలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను, కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, ఉదయగిరిలో మేకపాటి రామ్‌గోపాల్‌రెడ్డిని మార్చాలని సూచించినట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. అయితే అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి పోటీ చేస్తారని జగన్ స్పష్టం చేశారు. ఉదయగిరికి రామ్‌గోపాల్ కంటే మంచి అభ్యర్థి ఉంటే తీసుకురావాలని వేమిరెడ్డికి సూచించారని తెలిసింది. 'నెల్లూరు ఎంపీగా పోటీకి ఎందుకు భయపడుతున్నావ్? ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందనా? కచ్చితంగా మనమే గెలుస్తాం. ధైర్యంగా పోటీ చేయి' అని స్పష్టం చేశారు.

రా.. కదలిరా!

(మొదటి పేజీ తరువాయి)

విరామం ఇచ్చాం. అయోధ్య రామాలయం హడావుడిని దృష్టిలో ఉంచుకొని 21వ తేదీ నుంచి 23 వరకూ కూడా సభలు ఉండవు. ఈ సభలకు సంబంధించిన లోగోలో టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్‌తోపాటు మిత్రపక్షం జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజు గ్లాసును కూడా పెట్టనున్నాం" అని వివరించారు. ఈ సభల్లో రెండు చోట్ల జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కూడా పాల్గొంటారని, ఆయన ఎక్కడ పాల్గొంటారో తర్వాత ప్రకటిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సభల తర్వాత విడిగా నిర్వహించే మరో కార్యక్రమంలో రెండు పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తామని చెప్పారు.

నేతలు పోటీ పడుతున్నారు

రా.. కదలిరా! సభలు నిర్వహించడానికి నియోజకవర్గాల నేతలు పోటీ పడుతున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. "టీడీపీ ఆవిర్భావ సమయంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయి. రాష్ట్రం పునర్వైభవం సాధించడానికి, ప్రజల జీవితాలను గాడిలో పెట్టడానికి టీడీపీ రావాల్సిన అవసరం ఉంది. దీనిని ప్రజలు కూడా గుర్తించారు. అందుకే సభల నిర్వహణకు మా పార్టీ నేతలు పోటీ పడుతున్నారు" అని అన్నారు. వివిధ వర్గాల వారికి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ద్రోహాన్ని చాటడానికి కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అచ్చెన్న తెలిపారు. పంచాయితీలకు కేంద్రం ఇచ్చిన నిధులు రూ.9 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా వాడుకుందని విమర్శించారు. పంచాయితీల సమస్యలపై బుధవారం(3వ తేదీ) మంగళగిరిలో పంచాయితీరాజ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి చంద్రబాబు హాజరుకానున్నట్లు చెప్పారు. 4వ తేదీ టీడీపీ కేంద్ర కార్యాలయంలో 'జయహో బీసీ' పేరుతో బీసీ వర్గాలవారి సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీడీపీ కార్మిక విభాగం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన బస్సు యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. 'కార్మిక చైతన్య బస్సు యాత్ర' పేరుతో దీనిని నిర్వహిస్తున్నట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు తెలిపారు.

వైసీపీ నేతల నుంచి ఫోన్లు

వైసీపీ నేతల నుంచి తమకు చాలా ఫోన్లు వస్తున్నాయని అచ్చెన్నాయుడు తెలిపారు. "ఈ ముఖ్యమంత్రి మీద ఆ పార్టీ వారికే విశ్వాసం పోయింది. అందుకే మమ్మల్ని సంప్రదిస్తున్నారు. ఈ చేరికలపై మేం అంతర్గతంగా ఒక కమిటీ వేశాం. ప్రజల్లో పలుకుబడి, మంచి పేరు ఉన్నవారు వస్తే తీసుకుంటాం. పాతవారితో సమన్వయం చేసుకుని, ఇబ్బంది లేకుండా చూసుకుని పార్టీలో చేర్చుకొంటాం. బుధవారం కొంత మంది చేరుతున్నారు" అని చెప్పారు.

రా.. కదలిరా! సభల షెడ్యూల్

రా.. కదలిరా! పేరుతో టీడీపీ నిర్వహించనున్న సభల షెడ్యూల్‌ను అచ్చెన్నాయుడు వివరించారు. ఈ నెల 5న కనిగిరి, 7న తిరువూరు, ఆచంట, 9న వెంకటగిరి, ఆళ్లగడ్డ, 10న బొబ్బిలి, తుని, 18న గుడివాడ, 19న గంగాధర నెల్లూరు, కమలాపురం, 20న అరకు, మండపేట, 24న పీలేరు, ఉరవకొండ, 25న కోవూరు, పత్తికొండ, 27న గోపాలపురం, పొన్నూరు, 28న మాడుగుల, టెక్కలి, 29న ఉంగుటూరు, చీరాలలో సభలు జరగనున్నాయి.

నేటి నుంచి ఉత్తరాంధ్రలో భువనేశ్వరి పర్యటన

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు. బాధిత కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి, భరోసా కల్పించనున్నారు. ఇందుకోసం బుధవారం ఉదయం 10 గంటలకు విజయనగరం వెళ్లనున్నారు. స్థానిక 29వ వార్డులో కోరాడ అప్పారావు కుటుంబాన్ని, బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలంలోని పెరుమల్లి గ్రామంలో మైలేపల్లి పోలయ్య కుటుంబాన్ని, అనంతరం బొబ్బిలి నియోజకవర్గం చీకటిపేట మండలం మోదుగువలస పంచాయతీలో గులివల్లి అప్పారావు కుటుంబాన్ని పరామర్శించనున్నారు. అనంతరం రాజాం నియోజకవర్గంలో బస చేస్తారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తొమ్మిది నెలల్లో 73,450 కోట్ల అప్పు

- ఆర్బీఐ నుంచి కొత్తగా రూ.3,000 కోట్ల రుణం
- అప్పులపై కట్టే వడ్డీలే నెలకు రూ.2,300 కోట్లు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9నెలల్లో జగన్ సర్కారు అధికారికంగా రూ.73,450 కోట్ల అప్పులు తెచ్చింది. ఇందులో కేంద్రం అనుమతితో ఆర్‌బీఐ నుంచి తెచ్చిన రుణాలు రూ.58,450 కోట్లు. ఇవికాకుండా నాబార్డు, ఈఏపీ లోన్లు, ఎంప్లాయీ కటింగ్స్ కేంద్రం ఇచ్చే అప్పులు అన్నీ కలిపి దాదాపు రూ.15వేల కోట్ల వరకూ వాడుకుంది. దీంతో 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి 2 వరకు ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.73,450 కోట్లకు చేరింది. ఇక కేంద్రం అనుమతి లేకుండా, రాజ్యాంగాన్ని, ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్పొరేషన్ల నుంచి రూ.వేల కోట్ల అప్పులు తెచ్చారు. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.60,450 కోట్ల అప్పులు తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అనుమతిచ్చింది. ఇందులో మొదటి తొమ్మిది నెలల్లో రూ.58,450 కోట్లు వాడేశారు. ఇంకా రూ.2వేల కోట్ల అప్పులకు మాత్రమే పరిమితి మిగిలింది. తాజాగా మంగళవారం ఆర్‌బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.3,000 కోట్ల అప్పు తెచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీలే సగటున నెలకు రూ.2,300 కోట్లు చొప్పున రూ.20,700 కోట్ల వరకు చెల్లించింది. ఇంత భారీగా వడ్డీలు చెల్లిస్తూ తెస్తున్న అప్పుల్లో కనీసం 10శాతం కూడా ప్రభుత్వం మూలధన వ్యయం కోసం ఖర్చు చేయడం లేదు.

సీబీఐ జేడీగా దాట్ల శ్రీనివాస వర్మ


దాట్ల శ్రీనివాస వర్మ

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఐపీఎస్ అధికారి దాట్ల శ్రీనివాస వర్మ సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఈయన ఇప్పటి వరకు అక్కడి హోంశాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఆయన్ను సీబీఐ జేడీగా నియమిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు.

ఒకవైపే చూడు!

పట్టపగలు టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసినా దిక్కులేదు.. అర్ధరాత్రి మంత్రి రజిని ఆఫీసుపై రెండు రాళ్లు పడగానే హల్‌చల్

- జగన్ జమానాలో 'పోలీసు స్టోరీ'
- సొంత నియోజకవర్గాన్ని వదిలి గుంటూరు వెస్ట్‌కు వలస
- న్యూ ఇయర్ వేళ టీడీపీ అభిమానులపై కట్టడి

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)


గుంటూరులో మంత్రి రజిని కార్యాలయం అద్దాలు పగిలిన దృశ్యం


టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై వైసీపీ అల్లరి మూకల దాడి దృశ్యం (పాతచిత్రం)

'చూడు... ఒకవైపే చూడు! రెండో వైపే చూడకు! విపక్షంపై దాడులు జరిగితే అస్సలు పట్టించుకోవద్దు. అధికార పక్ష ఆస్తులకు చిన్న నష్టం జరిగిందా... ఇక రెచ్చిపోవడమే!'... జగన్ సర్కారు హయాంలో పోలీసుల వైఖరి ఇదే! టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై పట్టపగలు వైసీపీ మూకలు దాడి చేసి విధ్వంసం సృష్టిస్తే... పోలీసులు నిల్! కానీ... అర్ధరాత్రి పూట ఎవరో ఆకతాయిలు మంత్రి కార్యాలయంపై రెండు రాళ్లు విసరగానే పోలీసులు తమ పవర్ చూపించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని అక్కడ తిరిగి గెలవలేరనే ఉద్దేశంతో గుంటూరు పశ్చిమకు వలస వచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికలకు మూడు నాలుగు నెలలు ఉండగానే ఆమె తనకు ఓట్లేసి గెలిపించిన చిలకలూరిపేట ప్రజలకు గుడ్‌బై చెప్పేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండే చోట, ఎన్టీఆర్ విగ్రహం ఎదుటే ఒక అద్దె భవనంలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. జనవరి 1న ప్రారంభించేందుకు ముహూర్తం పెట్టుకున్నారు. అయితే... ప్రతి ఏటా డిసెంబరు 31 అర్ధరాత్రి టీడీపీ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి సంబరాలు చేసుకోవడం ఆనవాయితీ. ఆదివారం అర్ధరాత్రి కూడా ఆ ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ... అక్కడ మంత్రి రజిని కొత్తగా ఆఫీసు పెట్టుకున్నారంటూ పోలీసులు హడావుడి చేశారు. టీడీపీ అభిమానులు అక్కడ గుమికూడకుండా అడ్డుకున్నారు. అయితే... అర్ధరాత్రి 12 వరకు టీడీపీ అభిమానులు అక్కడే ఉండి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. అక్కడ నుంచి తిరిగి వెళ్లే సమయంలో ఇద్దరు యువకులు... దూరం నుంచి పార్టీ కార్యాలయంపై రాళ్లు విసిరారు. దాంతో అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. రాళ్లు వేసింది నిజంగా టీడీపీ అభిమానులేనా అనేది కూడా తెలియదు. మద్యం మత్తులో ఆకతాయిలు చేసిన పని అనే అనుమానాలూ ఉన్నాయి. అయినా... పోలీసులు రెచ్చిపోయారు. రాళ్లు వేసిన వాళ్లను గుర్తించలేక ఆ దారిన పోయే వాళ్లందరిపైనా ప్రతాపం చూపించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. చివరికి... చర్చిలో ప్రార్థనలకు వెళ్లి వస్తున్న వారిపైనా లాఠీలు ఝుళిపించారు. న్యూ ఇయర్ రోజంతా వారిని తమ ఆధీనంలోనే ఉంచుకొని రాత్రికి కోర్టులో హాజరుపరిచి ఇంటికి పంపారు. ఆ చిన్నపాటి సంఘటనపైనే పోలీసులు 25 మందిపై కేసులు నమోదు చేశారు.

టీడీపీ కార్యాలయంపై దాడి జరిగితే..

డీజీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న టీడీపీ ప్రధాన కార్యాలయంపై గతేడాది పట్టపగలు వైసీపీ మూకలు దాడి చేశాయి. అయినా... పోలీసులు పట్టించుకోలేదు. డీజీపీ ఆఫీస్‌కు ఫోన్‌లో సమాచారం అందించినా కొన్ని గంటలపాటు అటు వైపే రాలేదు. వైసీపీ అల్లరి మూకలు పార్టీ కార్యాలయ గేట్లను వాహనంతో ఢీకొట్టి పడేశారు. భవనంలోని అద్దాలను, ఫర్నిచర్‌ను, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. ఉద్యోగులను కూడా చితకబాదారు. విధ్వంసకారులు తమ పని తాము పూర్తి చేసుకుని వెళ్లిపోయారని నిర్ధారించుకున్నాకే... పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ ఘటనపై కొద్దిమందిపై నామమాత్రపు కేసు పెట్టి వదిలేశారు. ఆ కేసుకు ఇప్పటికీ అతీగతీ లేదు!


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

డివైడర్ దాటొచ్చిన మృత్యువు!

- ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన మరో కారు
- అత్తా కోడళ్లు, 19 నెలల చిన్నారి దుర్మరణం

దేవరపల్లి/కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2: కొత్త సంవత్సరాన్ని ఎంతో ఆనందంగా స్వాగతించిన ఆ కుటుంబం.. అంతలోనే తీవ్ర విషాదంలో మునిగిపోయింది. డివైడర్ దాటి వచ్చి మరో కారు ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం తూర్పుగోదావరి జిల్లాలో జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. బాధితులంతా హైదరాబాద్‌కు చెందినవారే. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... దివ్యప్రియ సొంతూరు విశాఖపట్నంలోని గాజువాక. అత్తింటివారిది హైదరాబాద్ శివారులోని ఆర్‌కే రామచంద్రపురం! డిసెంబరు 31, జనవరి 1న సంతోషంగా గడిపేందుకు అత్త రమాదేవి, భర్త సుభాష్‌గౌడ్, 19నెలల కుమార్తె, మరికొందరు కుటుంబసభ్యులతో డిసెంబరు 30న విశాఖ వచ్చారు. 31న లంబసింగి, సోమవారం విశాఖలో పర్యటించారు. మంగళవారం ఉదయం 10గంటలకు 'ఎర్టిగా' కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 1.45గంటల సమయంలో వీరి వాహనం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు-గౌరీపట్నం మధ్య బంధపురం వద్దకు చేరుకుంది. కారును సుభాష్ నడుపుతున్నారు. అదే సమయంలో... అనూహ్యంగా అటువైపు నుంచి వస్తున్న మరో 'ఎర్టిగా' కారు డివైడర్ దాటి ఇటువైపు వచ్చింది. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోగానే వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుభాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25)ను కొవ్వూరు ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందారు. కుమార్తె కనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన సుభాష్ బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటివచ్చిన కారులో ఉన్న వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆ వాహనాన్ని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పాస్టర్ వేల్పుల విజయ మోహన్ నడుపుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలుపగా... టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పిందని విజయ్ మోహన్ చెబుతున్నట్లు సమాచారం. కాగా, ప్రమాదంలో తన తల్లి, భార్య, కుమార్తె చనిపోయినట్టు సుభాష్‌కు మంగళవారం అర్ధరాత్రి దాకా తెలియదు. 'మా వాళ్లు ఎలా ఉన్నారో చెప్పండి' అంటూ దేవరపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సుభాష్ కన్నీటి పర్యంతమయ్యారు.


మంత్రులు, అధికారులతో చర్చలు సాగిస్తున్న మునిసిపల్ యూనియన్ నేతలు

మున్సిపల్ చర్చలు విఫలం

- సమాన పనికి సమాన వేతనంపై కార్మిక సంఘాల పట్టు
- సాధ్యం కాదన్న మంత్రులు, సజ్జల
- 17 దాకా సమ్మె ఆపండి.. ఈలోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- సమ్మె మరింత ఉధృతం చేస్తామన్న సంఘాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కార్మిక సంఘాలతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఏపీ మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బారాయుడితోపాటు ఆయా మున్సిపల్ కార్మికుల సంఘాల నేతలు చర్చల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు వచ్చిన కార్మిక సంఘాల నేతలు మంత్రులు వచ్చేదాకా మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. సమావేశం ప్రారంభంకాగానే ప్రధాన డిమాండ్లను చెప్పాలని మంత్రి బొత్స అడిగారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నాన్ పీహెచ్ కేటగిరి ఉద్యోగులకూ హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్లను కార్మిక సంఘాల నేతలు మంత్రుల ముందుంచారు. సమాన పనికి సమాన వేతనంపైగాని, పర్మినెంట్ చేసే విషయంపైగాని సీఎం జగన్ హామీ ఇవ్వలేదని మంత్రులు, సజ్జల బుకాయించే ప్రయత్నాలు చేయగా, జగన్ ఇచ్చిన హామీకి సంబంధించి వీడియోను కార్మిక సంఘాల నేతలు ప్రదర్శించారు. మీ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పిన మంత్రులు.. కొంత విరామం ఇచ్చి తర్వాత మరోసారి సమావేశమయ్యారు. ఆ తర్వాత సజ్జల మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం సాధ్యం కాదని, అలా ఇస్తే ఆప్కోస్‌లో ఉన్న 90 వేల మంది ఉద్యోగులు కూడా అడుగుతారని చెప్పారు. మిగతా సమస్యలకు సంబంధించి కొన్ని జీవోలను వెంటనే ఇస్తామని, మరికొన్ని జీఓలను మళ్లీ అమలు చేస్తామన్నారు. ఈ నెల 17 దాకా సమ్మె విరమించాలని, ఈలోపు సమస్యలను పరిష్కరిస్తామని మంత్రులు సర్ది చెప్పే ప్రయత్నాలు చేశారు. అయితే కార్మిక సంఘాలు మాత్రం సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేదిలేదని తెగేసి చెప్పారు.

జగన్ చెప్పినవే అమలు చేయమన్నాం

మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. సీఎం జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయమంటున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు చెప్పారు. 8 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారని, చర్చలకు పిలిచిన మంత్రులు ఉదయం ఒక రకంగా సాయంత్రం మరో రకంగా మాట్లాడారని అన్నారు. ఈరోజు నుంచి విద్యుత్, నీటి సరఫరా కూడా నిలిపేస్తామన్నారు. సమ్మెను ఈ నెల 17 దాకా వాయిదా వేయాలని మంత్రులు కోరారని, అయితే అది సాధ్యం కాదన్నారు.

సమ్మె విరమించాలని కోరాం: మంత్రి సురేశ్

మున్సిపల్ కార్మికులను సమ్మె విరమించాలని కోరామని, వారి డిమాండ్లలో కొన్నింటికి జీఓలు విడుదల చేయాలని నిర్ణయించామని మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. నాన్ పీహెచ్ కేటగిరి ఉద్యోగులకు రూ.6 వేల ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్సు ఇస్తామన్నారు. మరికొన్ని అంశాలపై మరోసారి చర్చలు జరపాలని, అప్పటి వరకు సమ్మె విరమించాలని కోరామన్నారు. సమ్మె ఇబ్బందు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



అనంతపురం కలెక్టరేట్ వద్ద రోడ్డుపై ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు.

← నంద్యాలలో దీక్షాశిబిరం ఎదుట పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన.

తగ్గని అంగన్‌వేడి

- ప్రభుత్వం నోటీసులివ్వడంపై ఆగ్రహం
- నోటీసు ప్రతులు దహనం చేసి నిరసన
- దున్నపోతులు, ఆంబోతులకు వినతులు
- 22వ రోజూ కొనసాగిన ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. 5వ తేదీలోపు విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేయడంపై అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దున్నపోతులకు వినతిపత్రాలు ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో రిలే దీక్షలు నిర్వహించారు. ఒంగోలులో కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగాయి. జమ్మలమడుగు, కడపల్లో మోకాళ్లపై కూర్చొగా, కొండాపురంలో 22 అంకె వచ్చేలా మానవహారం నిర్వహించారు. వాల్మీకిపురంలో పొర్లుదండాలు పెడుతూ, బి.కొత్తకోటలో పాటలు పాడుతూ, నెత్తిన కొంగు కప్పుకొని నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఆంబోతుకు, గోపాలపురంలో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి తమ సమస్యలు చెప్పుకున్నారు. 5లోగా విధుల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామంటూ విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటీసు ప్రతులను జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద దహనం చేశారు. అనంతపురం నగరం, రూరల్ ప్రాంతాల్లోని అంగన్వాడీ వర్కర్లు తమ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భిక్షమెత్తారు. కలెక్టరేట్ వద్ద భిక్షమెత్తుతున్న అంగన్వాడీ వర్కర్ తిమ్మక్కను ఆటో ఢీకొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తిరుపతి జిల్లా కోట మండల కేంద్రంలో పొర్లు దండాలు పెట్టి, నాయుడుపేటలో సోది చెప్పి, వెంకటగిరిలో అంబేడ్కర్ చిత్రపటానికి వినతులు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటికాలిపై నిలబడి, పాచిపెంట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొన్నారు. నంద్యాల, భీమవరం, తణుకు, గణపవరంలలో పొర్లుదండాలతో నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో మెడకు ఉరి బిగించుకుని సమ్మె నిర్వహించారు. కాగా, అంగన్వాడీల ఆందోళనలతో కేంద్రాల్లో వందల కొద్దీ గుడ్లు బూజుపట్టి, కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. పౌష్టికాహారం కూడా పురుగులు పడుతున్నట్టు సమాచారం. రాజమహేంద్రవరంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రంలో 10 ట్రేలలోని సుమారు 300 గుడ్లు కుళ్లిపోయాయి. ఈగలు విపరీతంగా ముసురుతున్నాయి. దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎల్లుండిలోగా విధుల్లో చేరండి

- అంగన్వాడీలకు ప్రభుత్వం అల్టిమేటం
- నేడు కలెక్టరేట్ల ముట్టడికి యూనియన్ల పిలుపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు జగన్ సర్కార్ అల్టిమేటం ఇచ్చింది. 5వ తేదీలోగా విధులకు హాజరుకావాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల ద్వారా 'అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి' పేరుతో ప్రకటనలు, జిల్లాల్లో సమాచార శాఖ ద్వారా ప్రకటనలు, సర్క్యులర్లు ఇచ్చింది. అంగన్వాడీలకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయలేదు. కానీ కలెక్టర్ల ద్వారా ప్రకటనలు చేయిస్తూ సమ్మె విరమించాలని విజ్ఞప్తి పేరుతో బెదిరింపు ధోరణికి దిగింది. దీనిపై అంగన్వాడీలు తీవ్రంగా మండిపడుతున్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు ఆపేదిలేదని ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. మరోవైపు కలెక్టర్ల ద్వారా విడుదల చేసిన ప్రకటనలో.. '2019 నుంచి అంగన్వాడీలకు జీతాలు పెంచామని, సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేశామని, సమ్మెపై ప్రభుత్వం పలుమార్లు చర్చించి ముఖ్యమైన కోర్కెలకు ఆమోదం తెలిపిందని, మిగిలిన కోర్కెలను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నా.. ఉద్యోగ బాధ్యతలు విస్మరించి మీరు విధులకు రావడం లేదని, బాలింతలు, గర్భిణీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకుని సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. జనవరి 5లోపు విధులకు హాజరుకావలసిందిగా కోరుతున్నాం' అని పేర్కొంది. అయితే వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుపై హామీ ఇవ్వలేదు. నోటీసు ప్రకారం.. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నా అంగన్వాడీలు పట్టించుకోలేదని చెప్పడమే ప్రభుత్వ ఉద్దేశంగా కనపడుతుంది కానీ వారి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశం లేదని స్పష్టమవుతోంది.

బెదిరింపులకు లొంగేది లేదు: అంగన్వాడీలు

తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించకుండా విధులకు హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటామని బెదిరించడం ఏమిటని అంగన్వాడీలు మండిపడుతున్నారు. లక్షమంది ఉద్యోగులు రోడ్లపై ఉన్నా ప్రభుత్వం మొండిపట్టు వీడడంలేదని, కనీస వేతనం ఇవ్వమనడం తప్పాఅని ప్రశ్నిస్తున్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు. కాగా, బుధవారం అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట బైఠాయింపు చేపట్టాలని అంగన్వాడీ యూనియన్ల నేతలు సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతి పిలుపునిచ్చారు. కలెక్టర్లు ఇచ్చిన సర్క్యులర్లు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుపై నిర్దిష్టమైన హామీ ఏమీ ఇవ్వలేదని తెలిపారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తామని హామీ ఇచ్చినప్పటికీ జీవో రాలేదన్నారు. ప్రభుత్వం బెదిరింపు ధోరణులు ఆపాలని, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఎం జోక్యం చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జగన్‌ను నమ్మినందుకు ఆత్మహత్యలే శరణ్యం

- 14వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- మెడకు ఉరి తాడు బిగించుకొని నిరసనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను నమ్మినందుకు ఉరి వేసుకోవడమే గతి అయిందని వాపోయారు. తమ సమస్యలపై సర్కారు స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. కర్నూలు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద ఉద్యోగులు మెడలో ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నేతలు హెచ్చరించారు. ఈ దీక్షలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, సీఐటీయు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. జీవో 24, 40, 05లను వెంటనే అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అములుతో పాటు రిటైర్మెంట్ వయసును 62ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కూడలిలోని రోడ్డుపైకి వచ్చి మెడకు ఉరి తాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. శ్రీకాకుళంలో జ్యోతిబా పూలే పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉరి తాడుతో నిరసన తెలిపారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వాగ్దేవి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. పార్వతీపురంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు కలెక్టరేట్ నిరసన శిబిరం వద్ద ఉరితాళ్లు బిగించుకుని.. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని నినదించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద 'సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులు ఉరి తాడు మెడలో వేసుకొని నిరసన తెలిపారు.

సీఎం ఇచ్చిన హామీకే దిక్కులేదా?

- ఉద్యోగ భద్రత, వేతనాలపై మాట్లాడరేం?
- సచివాలయంలో హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన



అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కోరుతూ రాష్ట్ర సచివాలయంలో హౌస్ కీపింగ్ సిబ్బంది మంగళవారం ఆందోళనకు దిగారు. అమరావతిలో సచివాలయం ఏర్పాటైన ఏడేళ్ల నుంచి పనిచేస్తున్న 154 మంది హౌస్ కీపింగ్ సిబ్బందిని ఏపీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కోస్)లో చేర్చి, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో మున్సిపల్ కార్మిక సంఘాలతో చర్చలకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తమ సమస్యలు వివరించారు. ఆయన పట్టించుకోకుండా, కాంట్రాక్ట్ సమయం ఇంకా నాలుగు నెలలు ఉన్నందున ఇప్పుడేమీ చేయలేమని, తర్వాత మాట్లాడతామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని హౌస్ కీపింగ్ సిబ్బంది ఆరోపించారు. తర్వాత మున్సిపల్ శాఖ మంత్రి సురేశ్‌ను కలిసే ప్రయత్నం చేయగా, పరిశీలిస్తామంటూ ఆయన దాటవేశారు. ఈ సందర్భంగా హౌస్ కీపింగ్ సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి రాత్రి 7గంటల వరకు విధులు నిర్వహిస్తున్న తమకు.. నెలకు రూ.12వేల చొప్పున ఇస్తామని చెప్పి, రూ.10,400 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. తమ కాంట్రాక్ట్ ఆరు నెలల క్రితం ముగిసినప్పుడే సీఎం జగన్‌ను కలిసి, ఆప్కోస్‌లో కలపాలని కోరినట్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందించి.. 15రోజుల్లో చేస్తామని రూ.18వేలు ఇప్పిస్తానని చెప్పారని, 5 నెలలు గడిచినా అతీగతీ లేదని తెలిపారు. పేషీలోకి వెళ్లి అడిగితే పోలీసులతో బయటకు నెట్టిస్తున్నారని, తాము శాంతియుతంగా అడుగుతున్నా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. అందరూ కలిసి వస్తే, ఎక్కువ మంది రాకూడదంటున్నారని, ఒకరిద్దరు అడిగితే బయటకు వెళ్లమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జోలె పట్టిన మున్సిపల్ కార్మికులు

- భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన
- 8వ రోజూ కొనసాగిన సమ్మె

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు జోలె పట్టారు. ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా, తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వం తీరును ఎండగడుతూ భిక్షాటన చేశారు. మంగళవారం అనంతపురం నగరపాలిక పరిధిలోని పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు.. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ మంత్రి సురేశ్ వేషధారులకు తమ కష్టాలు చెప్పుకొన్నారు. జగన్ కొళాయి తిప్పితే నీరు రానట్లు, రోడ్ల మధ్య డివైడర్లలో మొక్కలు కత్తిరించే సమయంలో, వీధిలైట్లు వేసే సమయంలో తమకు ఎదురయ్యే ప్రమాదాలను ప్రదర్శించారు. గుంతకల్లు, గుత్తి మున్సిపల్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గడ్డి తింటూ నిరసన తెలిపారు. కడప జిల్లా బద్వేలులో ఆకులు కట్టుకుని నిరసన తెలిపారు. కడపలో జోలె పట్టుకుని భిక్షాటన చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో డ్రమ్స్ వాయిస్తూ, శ్రీకాకుళంలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. 'మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. గ్రాట్యుటీ వర్తింపజేయాలి' అని కోరారు. నంద్యాలలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

నరసరావుపేటలో ఎమ్మెల్యే గోపిరెడ్డికి సెగ..

పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రైవేట్ కార్మికులతో పారిశుధ్య పనులకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో పనుల్లో పాల్గొనేందుకు రావడంతో వారిని కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి, కార్మిక సంఘాల నేతల మధ్య వాగ్వాదం జరిగింది. చంద్రబాబుకు కార్మికులు అమ్ముడుపోయారని గోపిరెడ్డి విమర్శించారు. ఆ వ్యాఖ్యలను కార్మికులు ఖండించారు. 'మీరు అమ్ముడుపోయినట్టు కార్మిక నాయకులు అమ్ముడు పోతారనుకుంటే ఎలా?' అంటూ కార్మిక సంఘం నాయకురాలు శివకుమారి నిలదీశారు. దీంతో కార్మికులు, ఎమ్మెల్యే అనుచరుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఎమ్మెల్యే అనుచరులపై కార్మికులు చెత్త పోసి నిరసన తెలిపారు. పోలీసులు కార్మికులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించగా, కార్మికులు స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి తీరును నిరసిస్తూ డంపర్ బిన్‌లోని వ్యర్థాలను ప్రధాన రహదారుల్లో పోశారు.


తెనాలిలో పారిశుధ్య కార్మికులను కాళ్లు విరగ్గొడతానంటూ వేలు చూపించి బెదిరిస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల

ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటా!

- పారిశుధ్య కార్మికులపై మహిళా అధికారి బెదిరింపులు

'మీలో ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటా. రేపు ఉద్యోగం ఎట్లా చేస్తారో చూస్తా. అడుగు ముందుకు వేస్తే కాళ్లు విరగ్గొడతా' అంటూ గుంటూరు జిల్లా తెనాలిలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల పారిశుధ్య కార్మికులపై బెదిరింపులకు పాల్పడ్డారు. సమ్మెలో ఉన్న కార్మికులకు వేలు చూపించి మరీ బెదిరించారు. మంగళవారం తెనాలిలో ప్రయివేటు కార్మికులతో ఆమె పనులు చేయిస్తుండగా, పారిశుధ్య కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్లకు అడ్డుగా రోడ్డుపై పడుకున్నారు. అధికారులు పోలీసులను రంగంలోకి దింపి, వారిని పక్కకు లాగేసి ట్రాక్టర్లను ముందుకు పోనిచ్చారు. ఈ క్రమంలోనే మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల కార్మికులను బెదిరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అంగన్వాడీలకు ప్రభుత్వం విజ్ఞప్తి

కృష్ణలంక: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో డిసెంబరు 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని, మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిల్లో ప్రభుత్వ అనేక దఫాలుగా చర్చలు జరిపిన తర్వాత ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించిందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. తదనుగుణంగా ప్రభుత్వం జీవోలను జారీ చేసిందన్నారు. అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం మిగిలిన వాటిని పరిష్కరించుటకు ప్రయత్నాలు చేస్తున్నా అంగన్‌వాడీలు ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావడం లేదన్నారు. గర్భవతులు, పిల్లల ఆరోగ్యం, పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 5లోగా విధులకు హాజరుకాకుంటే ప్రభుత్వ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

వీఎంసీలో వాటర్ సప్లయ్ బంద్

చిట్టినగర్: వీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. రోడ్లు, వీధులు ఎక్కడ చూసి వ్యర్థాలే. కంపు భరించలేక జనం ముక్కు మూసుకొని నడుస్తున్నారు. 8రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోవడంతో రోడ్లు చెత్త మయం గా మారాయి. అలాగే వాటర్ సప్లయ్‌కి చెందిన ఆ ప్కాస్ సిబ్బంది పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొనటం తో 4 రోజులుగా వాటర్ సప్లయ్ నిలిచిపోయింది. కొండ ప్రాంతాల్లో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లడటంతో వాటర్ సప్లయ్ వాల్స్ తిప్పేవారు లేక మంచినీటి సరఫరా ఆగింది. ఉన్న కొద్దిమంది పర్మినెంట్ సిబ్బంది వాల్స్ తిప్పినా అరకొరగా సప్లయ్ ఇస్తున్నారు. పశ్చిమంలో ఎక్కువగా కొండప్రాంతం ఉండటంతోపాటు 4 రోజులుగా నీటి సరఫరా నిలిచింది. మంచినీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కార్పొరేటర్లు అక్కడక్కడ ట్యాంకర్లతో వాటర్ సప్లయ్ చేస్తున్నా మంచినీటి కోసం ప్రజలు పాట్లు తప్పడంలేదు. అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

తాత్కాలిక చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్ టెండరు ఖరారు

వన్‌టౌన్: దుర్గగుడిలో ఈనెల 3 నుంచి 7 వరకు జరగనున్న భవానీదీక్షల విరమణలకు క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్‌కు టెండరు ఖరారైంది. వన్‌టౌన్ కు చెందిన వీఎల్‌డీ ఏజన్సీ. అండ్ కాంట్రాక్ట్ సంస్థ వేలం పాటను దక్కించుకుంది. 5 పాయింట్ల వద్ద మొత్తం 174 మంది కావాలని టెండరు పిలిచారు. 3 షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. వీఎంసీ వద్ద, రథం సెంటర్, రాజీవ్ గాంధీ పార్కు ఎదురు, కుమ్మరిపాలెం సెంటర్, సీఎన్‌జీ స్టేషన్ పక్కన ప్రత్యేక కౌంటర్లను వీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఎస్టేట్ కార్యాలయంలో టెండర్ల ఆమోదం ప్రక్రియను నిర్వహించారు. ఇద్దరు కాంట్రాక్టర్లు పాల్గొనగా వీఎల్‌డీ ఏజన్సీ అండ్ కాంట్రాక్ట్ సంస్థ వేలం పాటను దక్కించుకుంది. ఒక్కో పనివానికి రోజుకు రూ.550 చొప్పున ఇస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య!

పెనమలూరు: కానూరులోని ఓ మెడికల్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సర చదువుతున్న విద్యార్థిని (17) ఆత్మహత్యకు పాల్పడింది. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గోవాడకు చెందిన విద్యార్థిని కానూరులోని ఓ మెడికల్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం విద్యార్థిని తల్లి కళాశాల వద్ద వదిలివెళ్లిన కాసేపటికే విద్యార్థిని తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెందినట్టు సహచర విద్యార్థినులు గమనించి యాజమాన్యానికి తెలిపారు. వెంటనే విద్యార్థినిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

భవానీ దీక్షల విరమణకు

పటిష్ఠ బందోబస్తు: సీపీ

గుణదల: ఈనెల 3 నుంచి 7 వరకు ఇంద్రకీలాద్రిపై జరగనున్న భవానీ దీక్షల విరమణకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండటంతో 4200 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి దిశా నిర్దేశం చేసేందుకు స్థానిక ఆంధ్ర లయోల కళాశాల్లోని దేవయ్య ఆడిటోరియం నందు మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీపీ కాంతిరాణా పాల్గొన్నారు. దీక్షలో వచ్చే భవానీల పట్ల సిబ్బంది భక్తి శ్రద్ధలతో వ్యవహరించాలని కోరారు. బందోబస్తు నిర్వహణలో సిబ్బందికి ఏవైనా సమస్యలుంటే వెంటనే పర్యవేక్షణాధికారికి తెలియజేయాలన్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మొత్తం కలిపి 34 సెక్టార్లుగా విభజించి బందోబస్తును పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఎమ్మెల్యే అనంతకు ఓటేయొద్దు!

- వైసీపీ నేత, ఉప సర్పంచ్ వ్యాఖ్యలు
- అనంత అర్బన్‌లో వెంకటరామిరెడ్డికి సెగ

అనంతపురం రూరల్, జనవరి 2: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఓట్లు వేయొద్దని వైసీపీ నేత, రుద్రంపేట ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని రుద్రంపేట సచివాలయం ప్రాంగణంలో మంగళవారం గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని, దీనికి రుద్రంపేట ప్రధాన రోడ్డు దుస్థితి నిదర్శనమని నరేంద్రరెడ్డి తెలిపారు. "అక్కడ దుమ్ము, ధూళి తప్ప మరేమీ కనిపించడం లేదు. ఎమ్మెల్యే అనంతకు ఈ విషయం తెలుసు. ఎన్నోసార్లు ఆ రోడ్డు మీద ప్రయాణించారు. అయినా పట్టించుకోలేదు. ఈసారి ఎవరూ ఆయనకు ఓట్లు వేయొద్దు" అని పేర్కొన్నారు. "రుద్రంపేటకు రోడ్లు వేయలేదు. కాలువలు నిర్మించలేదు. మంచినీళ్లు ఇచ్చిన పాపాన పోలేదు. సమస్యల గురించి పట్టించుకోనప్పుడు, పరిష్కరించనప్పుడు ఆయనకు మనమెందుకు ఓట్లు వేయాలి" అని నరేంద్రరెడ్డి ప్రశ్నించారు. పంచాయతీ ఖజానాలో నిధులు లేవని, కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిధులన్నీ ఎక్కడపోయాయో తెలియడం లేదన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను చెల్లించాలని ప్రజలను కోరవద్దని వలంటీర్లకు సూచించారు. పన్నుల రూపంలో వచ్చిన సొమ్మంతా ఎవరి ఖాతాకు వెళ్తోందో త్వరలోనే మీడియాకు వివరిస్తానన్నారు. కాగా, నరేంద్రరెడ్డి ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు సర్పంచ్ సహా ఎవరూ అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం.







కొత్తూరు తాడేపల్లి నగరవనంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఫారెస్ట్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరెడ్డి

కేటీ నగరవనం అభివృద్ధికి శ్రీకారం

విజయవాడ, జనవరి 2: నగరానికి సమీపంలోని కొత్తూరు తాడేపల్లి రిజర్వ్ ఫారెస్ట్ కొండ అంచున ఏర్పాటు చేసిన నగరవనంలో అభివృద్ధి పనులకు ఫారెస్ట్ అధికారులు శ్రీకారం చుట్టారు. మెయిన్ రోడ్డుకు పక్కనే ఉన్న ఈ వనంలో రూ.కోటి వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేస్తున్నారు. పర్యాటకులకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకుల్యాండ్ స్కేపింగ్, మొక్కలు నాటడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అధికారులు పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొదటి విడతగా రూ.56లక్షలను మంజూరు చేసిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్తూరు తాడేపల్లి (కేటీ) నగరవనంలో ప్లాంటేషన్, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, క్యాంటీన్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. రెండు కొండల మధ్య సుమారు 5 కిలోమీటర్ల నిడివిలో ట్రాకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని పనులను 2 నెలల్లో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాగా ఇటీవల కొత్తూరు తాడేపల్లిలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చదివింది ఏడు.. ఏసీబీ అధికారినంటూ మోసాలు

- ఏఎస్ఐ నుంచే 3 లక్షలు కాజేసిన ఘనుడు అరెస్టు



మండపేట జనవరి 2: అతడు చదివింది ఏడో తరగతి. ఊరు అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం మల్లివలమ గ్రామం. పేరు రాచంపల్లి శ్రీనివాసులు(వాసు). రెండేళ్లపాటు అనంతపురం జిల్లాలో పోలీసు జీపు డ్రైవర్‌గా పని చేశాడు. బెట్టింగ్స్, వ్యసనాలకు అలవాటుపడ్డాడు. చిన్న ప్రభుత్వ ఉద్యోగులే టార్గెట్. ప్రభుత్వ కార్యాలయాల ఫోన్ నంబర్లను సేకరించి చిన్నతరహా ప్రభుత్వ ఉద్యోగులకు ఏసీబీ అధికారినంటూ ఫోన్లు చేసి బెదిరించి, రూ.లక్షల్లో కాజేయడం వృత్తిగా పెట్టుకున్నాడు. 15ఏళ్ల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో భారీగా ఉద్యోగులను మోసగిస్తున్న ఈ కేటుగాడు ప్రస్తుతం బెంగళూరు నివాసం ఉంటున్నాడు.. 2021లో కాకినాడ జిల్లా సామర్లకోటలో నేరానికి పాల్పడ్డాడు. గతేడాది డిసెంబరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట రూరల్ ఏఎస్ఐ వద్ద రూ.3లక్షలు కాజేశాడు. ఏఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మండపేట రూరల్ ఎస్ఐ బళ్ల శివకృష్ణ బెంగళూరు వెళ్లి.. అతడు తిరిగే ప్రదేశాలు, అతడి కదలికలను గుర్తించారు. నిందితుడు మంగళవారం రాజమహేంద్రవరం నుంచి విశాఖ వెళ్తుండగా మండపేట రూరల్ పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అలమూరు కోర్టులో అతడిని హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది.

నేడు ఆర్కిటెక్చర్ స్కూల్ 7వ స్నాతకోత్సవం

భారతీనగర్: నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ 7వ స్నాతకోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహిస్తామని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 243 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా జాతీయ యాంటీ ర్యాకింగ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అజిత్ శంకర్‌రావు భోన్స్లే పాల్గొంటారన్నారు.

యార్లగడ్డ కుమార్తెకు బాబు ఆశీర్వచనం



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు కుమార్తె శ్రీ సహస్ర నూతన వస్త్ర బహుకరణ గన్నవరం ఎస్‌ఎంకన్వెన్షన్‌లో మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విచ్చేసి ఆశీర్వదించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, చినరాజప్ప, బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎంపీలు బాడిగ రామకృష్ణ, కొనకళ్ల నారాయణ, మాగంటి బాబు, కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, జలీల్‌ఖాన్ పాల్గొని శ్రీ సహస్రను ఆశీర్వదించారు.



చేనేత, పట్టు చీరలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

30 శాతం తగ్గింపుతో 'టెస్కో' ప్రదర్శన: కలెక్టర్

కృష్ణలంక, జనవరి 2: ప్రఖ్యాత పేరెన్నిక గన్న పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట గొల్లభామ కాటన్, పట్టుజరీ చీరలు, చేనేత వస్త్రాలను ఉత్పత్తి ధరలకే 30శాతం ప్రత్యేక తగ్గింపుతో అమ్మకాలు నిర్వహిస్తున్న టెస్కో వస్త్ర ప్రదర్శనను ఆదరించి చేనేత కార్మికులకు చేయూత అందించాలని కలెక్టర్ ఎస్‌ఢిల్లీరావు కోరారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ (టెస్కో) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ హాల్ నందు నిర్వహిస్తున్న టెస్కో చేనేత వస్త్ర ప్రదర్శనను మంగళవారం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ కో ఆపరేటివ్ సొసైటీ వస్త్ర ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ జనరల్ మనేజర్ బి.రత్నకుమార్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను 30శాతం తగ్గింపు ధరలపై ఉత్పత్తి ధరలకే టెస్కో వస్త్ర ప్రదర్శనలో అమ్మకానికి సిద్ధంగా ఉంచామన్నారు. ఈనెల 12 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. తెలంగాణ కో-ఆపరేటివ్ సొసైటీ డీఎంవో వి.జనార్థన్, ఏఎంవో ఎ.వెంకటేష్, సిబ్బంది కె.సుదర్శన్, జి.కృష్ణకుమార్, డి.బానయ్య, కె.రాజేష్, వి.నరేష్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో 13,500 వైద్యారోగ్య శిబిరాలు

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

పునాదిపాడు (కంకిపాడు), జనవరి 2: రాష్ట్రవ్యాప్తంగా 2వ దశలో 13,500 పైగా వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న వైద్య ఆరోగ్య సురక్షను కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. కృష్ణబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6నెలల పాటు కొనసాగుతోందన్నారు. ప్రతివారం ఒక్కో మండలంలో నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళవారం సగం గ్రామాల్లో, శుక్రవారం మరో సగం గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ చిత్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్, ఆరోగ్య శ్రీ సమన్వయకర్త డాక్టర్ సతీష్, ఎంపీడీవో అనూష, తహసీల్దార్ ఎస్ ప్రసాద్, డీఎల్‌డీవో నాంచారయ్య, వైద్యులు పాల్గొన్నారు.

సమ్మెకు రాజకీయ పార్టీలు మద్దతివ్వాలి

- అంగన్వాడీ యూనియన్ నేతల విజ్ఞప్తి

గవర్నర్‌పేట, జనవరి 2: అంగన్‌వాడీల సమ్మె 21రోజులుగా కొనసాగుతున్నా ప్రభుత్వం డిమాండ్ల పరిష్కారంలో కాలయాపన చేస్తుండటంతో సమ్మెను ఉధృతం చేయాలని నిర్ణయించినట్టు అంగన్‌వాడీ మూడు ప్రధాన సంఘాల నేతలు ప్రకటించారు. మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి జె.లలిత, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీల చేస్తున్న పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాలని, ఆయా పార్టీల నేతలకు మెయిల్‌లో వినతిపత్రాలు పంపినట్టు వెల్లడించారు.

ఫాం7 దొంగలపై కేసు

- పర్చూరు ఈఆర్‌వో ఫిర్యాదుతో మరో నలుగురిపై కేసు

బాపట్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఓట్ల తొలగింపే లక్ష్యంగా ఫాం7 లను అడ్డం పెట్టుకుని బాపట్ల జిల్లా పర్చూరులో పాలకపార్టీ పన్నిన కుట్రలకు సంబంధించి కేసుల పరంపర కొనసాగుతూనే ఉంది. పర్చూరు ఈఆర్‌వో వెంకట నారాయణ ఫిర్యాదు మేరకు యద్దనపూడి మండలంలో ముగ్గురు, పర్చూరు మండలంలో ఒకరిపై మంగళవారం కేసు నమోదు చేశారు. గతంలో నమోదైన 18 మందితోపాటు, ప్రస్తుతం నమోదైన 4 కేసులతో మొత్తం 22 మందిని నిందితులుగా పేర్కొన్నారు.

మరో 25 మందిపై...

ఫాం7ల దుర్వినియోగంపై ఈఆర్‌వో ఫిర్యాదు మేరకే ఇన్ని రోజులు కేసులు పెట్టిన పోలీసులు తాజాగా వారే స్వయంగా మరో 25 మందిపై ఫాం7లకు సంబంధించి కేసులు నమోదు చేసి గట్టి హెచ్చరికలు పంపారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఈసీఐ ప్రతినిధుల సమావేశంలో నిబంధనలకు విరుద్ధంగా ఫాం7ల దాఖలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. దానిలో భాగంగానే తాము అంతర్గతంగా జరిపిన విచారణలో ఫాం7లను దుర్వినియోగం చేశారని తేలడంతో మరో 25 మందిపై పోలీసులే కేసులు పెట్టారు.

ఆధారాలు లేని రూ.5.50 లక్షల సీజ్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సావరగూడెం కూడలి వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సీఐ కనకారావు సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఈడ్పుగల్లుకు చెందిన శ్రీరామ్ ముస్తాబాద నుంచి వస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ .5.50లక్షలు తీసుకువస్తుండగా పట్టుకున్నారు. నగదుకు ఆధారాలు చూపమని అడగగా ఆధారాలు లేకపోవటంతో నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు మాదిగల సామాజిక న్యాయమహాసభ

వన్‌టౌన్: స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 4న మాదిగల సామాజిక న్యాయమహాసభను నిర్వహిస్తున్నట్టు ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ అంతర్జాతీయ సంస్థ (ఇన్‌ఫాం) అధ్యక్షుడు గడ్డం బాపిరాజు అన్నారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ మాదిగ సంపదను గ్రామాలకు అనుసంధానం చేస్తూ పల్లె బస, పల్లెలను పలకరిద్దాం వంటి వినూత్న కార్యక్రమాలను 10ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం జరగనున్న సభలో మాదిగల వాణిజ్య పారిశ్రామిక చాంబర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరు కానున్నారన్నారు. మాదిగలందరినీ ఒకచోట చేర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇన్‌ఫాం రాష్ట్ర అధ్యక్షుడు మట్ట విద్యార్థి మాట్లాడుతూ మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎంపీలు, మంత్రులు పాల్గొంటారన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ యరసాని శ్యామ్, ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్ పింగిలి విజయకుమార్ పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారంతా ఈ సభకు హాజరు కావాలని కోరారు.

బెంజ్ సర్వీస్ రోడ్ల విస్తరణ ప్రారంభం

- నోవాటెల్ హోటల్ నుంచి భవనాల తొలగింపు
- డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం
- సమ్మె కారణంగా డ్రెయిన్ల పనులకు ఆటంకం
- మురుగునీటి పారుదల లేక ఇబ్బందులు
- 2 నెలల్లో పూర్తి చేయాలని ఎన్‌హెచ్ లక్ష్యం నిర్దేశం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బెంజిసర్కిల్ సర్వీసు రోడ్డు పనులను జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ప్రారంభించింది. పనులను చాపకింద నీరులా పక్షం రోజుల కిందటే ప్రారంభించింది. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ తూర్పు భాగంలో నోవాటెల్ హోటల్ దగ్గర నుంచి పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణకు సహకరించిన భవన యజమానులకు జాతీయ రహదారుల సంస్థ పరిహారాన్ని జమ చేయటంతో విజయవాడ రెవెన్యూ డివిజినల్ అధికారులు ఎన్‌హెచ్‌కు భూములను స్వాధీనం చేశారు. దీంతో జాతీయ రహదారుల సంస్థ అధికారులు కొద్ది రోజులుగా ఆక్రమణల తొలగింపు పనులు చేపడుతున్నారు. నోవాటెల్ హోటల్ యాజమాన్యం ఒక్కటే హైకోర్టును ఆశ్రయించటంతో దాన్ని మినహాయించి సర్వీసు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఎస్వీఎస్ జంక్షన్ నుంచి త్వరలోనే భవనాలను పడగొట్టి సర్వీసు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నారు. నోవాటెల్ నుంచి సర్వీసు రోడ్డుకు అవసరమైనంత మేరకు ఆక్రమణలు తొలగించటంతో పాటు సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. సర్వీసు రోడ్డును ఏర్పాటు చేసే క్రమంలో తలపెడుతున్న సైడ్ డ్రెయిన్ పనులకు కార్మికుల సమ్మె కారణంగా అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో అధికారులు ఎస్వీఎస్ జంక్షన్ నుంచి పనులు ప్రారంభించాలని చూస్తున్నారు. మొత్తం 35మంది పైగా బాధితులకు ఇప్పటి వరకు ఎన్‌హెచ్ అధికారులు పరిహారాన్ని జమ చేశారు. దీంతో యజమానులు భవనాలను కూలగొట్టడానికి సమ్మతించారు.

సమ్మె కారణంగా డ్రెయిన్ల నిర్మాణాలకు అవాంతరాలు ఏర్పడంతో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో భవనాలను కూలగొట్టాలని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. ఈ లోపు కార్మికులు సమ్మె విరమిస్తే అపుడు డ్రెయిన్ల పనులు చేపట్టాలని భావిస్తున్నారు. బెంజిసర్కిల్ సర్వీసు రోడ్డు విస్తరణ పనులను 2 నెలల్లో పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు.

మెడికల్ సీటు ఇప్పిస్తామని మోసం

- నిందితులపై రుజువైన నేరం, జైలు, జరిమానా విధింపు

గుణదల, జనవరి 2: మెడికల్ సీట్ ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన కేసులో నిందితులపై నేరం రుజువవడంతో వారికి సాధారణ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ 1వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరిముల్లా మంగళవారం తీర్పు వెల్లడించారు. టిక్కిల్ రోడ్‌లో నివాసం ఉంటున్న ఫిర్యాది తన కుమారుణ్ణి డాక్టర్‌ను చేయాలనే ఆలోచనలో ఉన్నారు. చెన్నైలో నివాసముంటున్న స్నేహితుల ద్వారా పిల్లా రత్న సంగీత పరిచయమైంది. ఆమె ఫిర్యాది కుమారుడికి చెన్నైలోని మెడికల్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని నమ్మించింది. దీంతో ఫిర్యాదికి ఆమె భర్త విజయ భాస్కర్ కలిసి ఎంబీబీఎస్ సీట్ ఇప్పిస్తంగా ఇప్పిస్తామని చెప్పి రూ.25 లక్షలు అడిగారు. సీటు ఇప్పించలేని పక్షంలో డబ్బు వాపసు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ఫిర్యాది తన అకౌంట్ నుంచి సంగీత అకౌంట్‌కు 2016 మే 6న నగదు బదిలీ చేసింది. ఆ తరువాత ఫిర్యాది కుమారుడికి ఏలూరులో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. అప్పటి నుంచి సంగీతను నగదు తిరిగివ్వమంటే కళాశాలలో కట్టేశామని బుకాయించారు. మిగిలిన డబ్బు కూడా కట్టి కళాశాలలో చేరాలని చెప్పడంతో ఫిర్యాది ఆ కళాశాలకు వెళ్లి తన కుమారుడి పేరున కట్టిన డబ్బు తిరిగివ్వాలని ప్రార్థించగా మీ పిల్లాడి పేరున ఎవరూ డబ్బు కట్టలేదనడంతో ఫిర్యాది మోసపోయానని గ్రహించాడు. పిల్లా రత్న సంఘీత, ఆమె భర్త పిల్లా విజయభాస్కర్‌పై మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ గురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురు సాక్షుల విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువైంది. 1వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరిముల్లా ఒక్కొక్కరికి 2ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.



రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద పార్కింగ్ ఏరియా

వేలం లేకుండానే..!

- రాజీవ్‌గాంధీ పార్కింగ్ ఫీజు వసూళ్ల లీజు దక్కించుకునే యత్నం
- అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి

వన్‌టౌన్,జనవరి 2: అధికారపార్టీకి చెందిన కొందరు రాజీవ్‌గాంధీ పార్కింగ్ ఫీజు వసూలు కాంట్రాక్ట్‌ను వేలం లేకుండానే కొట్టేయాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. ఆ మేరకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. నగరంలో అత్యధికసంఖ్యలో సందర్శకులు వచ్చేది రాజీవ్‌గాంధీ పార్కుకే. ప్రధానంగా కృష్ణానది తీరాన ఉన్న ఈ పార్క్‌లో సేద తీరేందుకు నగర వ్యాప్తంగా సందర్శకులు వస్తారు. అత్యధికులు తమ సొంత వాహనాల్లోనే వస్తుంటారు. సాధారణ రోజుల్లో వందల సంఖ్యలో వస్తుంటారు. పండగలు, సెలవు దినాల్లో వేల సంఖ్యలో వస్తుంటారు. దీంతో పార్కింగ్ ఫీజు ద్వారా గణనీయమైన ఆదాయం వస్తుంది. దీనిపై కొందరి కన్ను పడింది. ఇప్పుడు కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే వసూలు జరుగుతున్నా, కొందరు అధికారులు బినామీ వ్యవహారాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. సమీపంలోని ఒక కాంట్రాక్టర్ బినామీగా తన సిబ్బందిని పెట్టి ఫీజు వసూలు చేయిస్తున్నాడని సమాచారం. సాధారణ రోజుల్లో రూ.6 నుంచి రూ.7వేలు, పండుగలు, సెలవు దినాల్లో రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తుందని అంచనా. దీంతో అధికార పార్టీ నేతల్లో కొందరు నిబంధనలను పక్కనపెట్టి వేలం లేకుండానే దక్కించుకోవాలని చూస్తున్నారు. ఎన్నికలకు ముందుగానే వ్యవహారాన్ని చక్కపెట్టుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. టెండర్లు పిలిస్తే దాదాపు రూ.కోటి వరకు లీజు సొమ్ము వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఎస్టేట్ విభాగంలోని మూడు నామాలవాడు పేరున్న అధికారి తనకు చేయి తడుపుతున్న వ్యక్తికి జై కొడుతూ కాంట్రాక్ట్ కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చే పార్కింగ్ ఫీజు వసూలుకు టెండర్లు పిలిచి, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మందుబాబు వీరంగం

- శ్మశాన వాటిక చిమ్నీ పైకి ఎక్కి హల్‌చల్
- మద్యం బాటిళ్లు చూపించి కిందకు దింపిన పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 2: అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో మంగళవారం ఓ మందుబాబు వీరంగం వేశాడు. పైపులరోడ్డు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలోకి చొరబడి 100 అడుగుల ఎత్తున్న చిమ్నీపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎంత ప్రయత్నించినా మందుబాబు చిమ్నీ పైనుంచి దిగి రాలేదు. సుమారు 4 గంటల పాటు శ్రమించిన ఫైర్, పోలీసు సిబ్బంది చివరకు మద్యం సీసాలను చూపించి మందుబాబును కిందకు దింపారు. సోమయ్య (50) వాంబేకాలనీలో ఉంటూ, మద్యానికి అలవాటు పడి ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం ఉదయం 5.30 సమయంలో స్థానిక పైపులరోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలోకి చొరబడి సుమారు 100 అడుగుల ఎత్తున్న క్రిమిటోరియం చిమ్నీ పైకి ఎక్కేశాడు. కాటికాపరి గమనించి కిందికి దిగాలని కోరినా దిగకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసు, ఫైర్ సిబ్బంది వచ్చి అతడిని కిందికి దింపడానికి శతవిధాల ప్రయత్నాలు చేశారు. శ్మశానం వద్దే ఫైర్, పోలీసు సిబ్బంది కాపాల కాశారు. మద్యం మత్తులో ఉన్న సోమయ్య ఎక్కడ పడిపోతాడోనని చిమ్నీపైపు చుట్టూ వలలు ఏర్పాటు చేశారు. 4గంటలు శ్రమించినా ఫలితం లేకపోవడంతో మద్యం సీసాలను కొనుగోలు చేసి శ్మశాన వాటికలో పెట్టి పైనున్న సోమయ్యకు చూపించి అక్కడి నుంచి వెళ్లిపోయినట్టుగా పక్కకు వచ్చేశారు. దీంతో మద్యం సీసాల కోసం సోమయ్య కిందకు దిగగానే అతడిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి పంపించేశారు. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేనట్టుగా పోలీసులు భావిస్తున్నారు.



చిమ్నీ పైకి ఎక్కిన సోమయ్య



సోమయ్యతో మాట్లాడుతున్న పోలీసులు

వందే.. రీషెడ్యూల్



- సాంకేతిక లోపంతో వందే భారత్‌కు బ్రేకులు
- ఒక రోజు ఆలస్యమైతే.. వారమంతా లేటే
- తరచూ రీషెడ్యూల్‌తో ఇతర రైళ్లపై ప్రభావం
- స్పేర్ రైలు లేకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ టెక్నాలజీతో రూపొందిన సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా ప్రయాణికుల ఆదరణను చూరగొంటున్నాయి. వీటిలో టికెట్ చార్జీలు అధికంగా ఉన్నప్పటికీ.. ప్రయాణం సౌకర్యంగా ఉండటంతో 100శాతానికి పైగా ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్నాయి. అయితే.. రైల్వే శాఖకు ప్రతిష్ఠాత్మకమైనవిగా చెబుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు తరచూ మొరాయిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వేకు వందే భారత్ అదనపు రేక్(రైలు) లేకపోవడంతో ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. గత శని, ఆది, సోమవారాల్లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన వందే భారత్ రైలు రోజూ 6 నుంచి 8 గంటల పాటు ఆలస్యంగా నడిచింది. దీంతో అసలు అది వందేభారత్ రైలేనా..? అని ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. విచిత్రమేమంటే.. ఒకసారి వందే భారత్ రైలును రీ షెడ్యూల్ చేశారంటే.. ఆ వారంలో ఈ రైలు సర్వీసు ఉండని మంగళవారం వరకు నిత్యం రీషెడ్యూల్ చేసుకుంటూ పోవాల్సిందే. కనీసం ఒక స్పేర్ రేక్ అయినా దక్షిణ మధ్య రైల్వేకు కేటాయిస్తే.. సమస్యలు వచ్చినపుడు దానిని పట్టాలెక్కించవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సమయపాలన గాడి తప్పితే..

గత శుక్రవారం వందే భారత్ రైలు చైర్ కార్ బోగీ స్ప్రింగ్ విరిగింది. దాని స్థానంలో కొత్త స్ప్రింగ్ అమర్చే సరికి ఆరు గంటలు ఆలస్యమైంది. దీంతో శనివారం నాటి వందే భారత్‌ను 6 గంటల పాటు రీషెడ్యూల్ చేశారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వందే భారత్ రైలు రోజూ రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకున్నాక 6 గంటల పాటు తప్పనిసరిగా ప్రాథమిక నిర్వహణ చేయాల్సి ఉంటుంది. అనంతరం మరుసటి రోజు ఉదయం 6.15 గంటలకు సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్‌ను నడుపుతారు. ఏ కారణం చేతనైనా ఈ రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు రావడం ఆలస్యమైతే.. మరుసటి రోజు ఆ రైలుపై ఆ ప్రభావం కొనసాగుతుంది. ఆదివారం కూడా ఈ రైలును 4 గంటలపాటు రీషెడ్యూల్ చేశారు. సికింద్రాబాద్‌లో ఉదయం 10.15గంటలకు బయలుదేరిన వందేభారత్, సాయంత్రం 6.15గంటలకు తిరుపతికి చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.15గంటలకు తిరుపతిలో బయల్దేరాల్సి ఉండగా.. 4 గంటల పాటు రీషెడ్యూల్ కారణంగా రాత్రి 7గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు ఆదివారం అర్ధ రాత్రి దాటాక(సోమవారం ఉదయం) 3.30 గంటలకు చేరుకుంది. దీంతో ప్రాథమిక నిర్వహణ ఆలస్యమై సోమవారం కూడా 2 గంటల పాటు రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది.

ఇతర రైళ్లపైనా ప్రభావం..

వారంలో ఏ రోజైనా సమయ పాలన గాడి తప్పిందంటే.. ఆ రైలు తిరిగి సమయానికి పట్టాలెక్కాలంటే మంగళవారం కోసం ఎదురుచూడాల్సిందే. ఎందుకంటే మంగళవారం ఈ రైలు సర్వీసు ఉండదు. గతంలో ఒక సారి ఇలాంటి సమస్యే తలెత్తింది. అయితే.. అప్పుడు సోమవారం కావడం.. మంగళవారం సర్వీసు లేకపోవడంతో దాని తీవ్రత అంతగా కనిపించలేదు. ఇప్పుడు శనివారం సమస్య ఉత్పన్నం కావడంతో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అదే బుధవారం రోజున సమస్య వచ్చి ఉంటే.. వారమంతా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేది. దీనికి ప్రత్యామ్నాయంగా రేక్ తెప్పించుకోకపోతే భవిష్యత్తులో ప్రయాణికుల ఆదరణను కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. అంతే కాకుండా వందే భారత్ రీ షెడ్యూలింగ్ వల్ల ఇతర రైళ్ల సమయ పాలన కూడా దెబ్బతింటోందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు.

బీఈడీ కథ మళ్లీ మొదటికి

- ఉన్నత విద్యామండలికి తనిఖీల అధికారం
- గతేడాది ఒకసారి తనిఖీలు పూర్తి
- రెండోసారి చేయించేందుకు ప్రయత్నాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బీఈడీ అడ్మిషన్ల కథ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికే సుదీర్ఘ జాప్యంతో విద్యార్థులు చాలాకాలం నష్టపోగా దాన్ని మరింత ఆలస్యం చేసేలా ఉన్నత విద్యాశాఖ కొత్త ప్రయోగాలు చేస్తోంది. ఎడ్‌సెట్ పరీక్ష ముగిసిన ఆరు నెలల తర్వాత ఒకసారి కాలేజీల్లో తనిఖీలు పూర్తయ్యాక ఇప్పుడు రెండోసారి తనిఖీలు చేయించేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకూ యూనివర్సిటీలు.. వాటి పరిధిలోని బీఈడీ కాలేజీల్లో తనిఖీలు చేస్తుండగా, ఇకపై ఆ అధికారాన్ని ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఇప్పుడు తనిఖీలు ప్రారంభిస్తే దాదాపు నెల రోజులు పట్టే అవకాశముంది. ఆ తర్వాత అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రారంభిస్తే మరో 20 రోజులు పడుతుంది. అంటే దాదాపు మరో రెండు నెలల తర్వాతే బీఈడీ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. అదే జరిగితే విద్యార్థులు దాదాపుగా ఏడాది కాలం నష్టపోయినట్లే. గతంలో ప్రతి ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లోనే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యేది. కొవిడ్ పరిస్థితుల తర్వాత ఈ ప్రక్రియ కొంత ఆలస్యమవుతూ వస్తోంది. గత విద్యా సంవత్సరంలోనూ అనేక కారణాలతో కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం జరిగింది. దానిపై విమర్శలు రావడంతో 2023లో ముందుగానే స్పందించిన ఉన్నత విద్యా మండలి మేలోనే ఎడ్‌సెట్‌కు నోటిఫికేషన్ జారీచేసింది. జూన్‌లో పరీక్ష నిర్వహించి, జూలైలో ఫలితాలు విడుదల చేసింది. అప్పటినుంచీ విద్యార్థులు కౌన్సెలింగ్ ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు.

ఒకసారి జరిగినా మళ్లీ..

బీఈడీ విద్యకు సంబంధించి మౌలిక వసతులు, బోధనా సిబ్బంది లేకపోయినా ఇష్టానుసారం కాలేజీలు నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతిఏటా దీనిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో గతేడాది ఇద్దరు సభ్యులతో కమిటీలు వేసి తనిఖీలు చేపట్టారు. ఈ ఇద్దరిలో ఒకరు సొంత యూనివర్సిటీ నుంచి, మరొకరు ఇతర యూనివర్సిటీ నుంచి ఉండేలా ఏర్పాటుచేశారు. ఆ కమిటీల తనిఖీల ఆధారంగా కాలేజీలకు యూనివర్సిటీలు అఫిలియేషన్ రెన్యువల్ చేశాయి. ఈ ప్రక్రియ ఆగస్టులోనే పూర్తయింది. కానీ ఉద్దేశపూర్వకంగానే ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభించకుండా ఆపేశారు. ఓవైపు కాలేజీలను రెన్యువల్ చేసినా, ఎడ్‌సెట్ ఫలితాలు ఎప్పుడో వచ్చినా ఎందుకు ఆలస్యం చేస్తున్నారనే దానిపై ఇప్పటికీ ప్రభుత్వం వద్ద సరైన సమాధానం లేదు. ఉన్నత విద్యాశాఖపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. ఏటా బీఈడీ కాలేజీల నుంచి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నా ఈసారి అది బహిరంగమవుతోంది. ప్రభుత్వంలోని కొందరు పెద్దలు, ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టజెప్పేందుకు ప్రైవేటు బీఈడీ కాలేజీల యాజమాన్యాలు సమావేశాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. ముడుపులు ముట్టజెప్పకపోతే కౌన్సెలింగ్ జరగదని అంచనాకు వచ్చిన యాజమాన్యాలు ఇందుకోసం కలెక్షన్ ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ తనిఖీల అధికారం ఉన్నత విద్యామండలికి అప్పగించడం వెనుక ఏం జరిగిందోనన్న చర్చ మొదలైంది. కాగా, తనిఖీలంటే మళ్లీ తమపై ఆర్థిక భారం పెరుగుతుందని యాజమాన్యాలు భయపడుతున్నాయి. తనిఖీల పేరిట కమిటీలు వస్తే ఒక్కో కాలేజీకి రూ.లక్ష భారం పడుతోందని అంటున్నాయి. అందుకే ఉన్నత విద్యామండలికి తనిఖీల అధికారం అప్పగించడాన్ని హైకోర్టులో సవాలు చేయాలని భావిస్తున్నాయి.

ఉన్నతస్థాయిలో విభేదాలు

కొంతకాలంగా ఉన్నత విద్యాశాఖలో అంతర్గత పోరు అధికమైంది. ఉన్నతాధికారుల రెండు వర్గాలుగా విడిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఉన్నత విద్యాశాఖలో అన్నీ తానై వ్యవహరించే ఓ అధికారి తనకు రాజకీయ అండదండలున్నాయన్న కోణంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు ఇతర అధికారులకు నచ్చక వారు వేరే వర్గంగా మారారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఉన్నత విద్యాశాఖ, కళాశాల విద్యాశాఖల్లో ఉన్నత స్థాయి అధికారులంతా ఒక్కటిగా, రాజకీయ బలం ఉన్న అధికారి మరో వర్గంగా ఏర్పడినట్లు చెబుతున్నారు. దీని ఫలితంగానే ఉన్నత విద్యామండలి నిర్వహించే కొన్ని కీలక సమావేశాలకు కొందరు ఉన్నతాధికారులు హాజరుకావడం లేదు. వారు లేకుండానే పలు తీర్మానాలూ చేస్తున్నారు. వర్గపోరు పెరిగిపోవడంతోనే బీఈడీ అడ్మిషన్ల వ్యవహారం రచ్చగా మారినట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో 11,236 మంది ఎడ్‌సెట్ రాశారు. 10,908మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు సుమారు 400 ఉన్నాయి. వాటిలో దాదాపు 40వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. కన్వీనర్ కోటాలో తక్కువ మంది, మేనేజ్‌మెంట్ కోటాలో ఎక్కువ మంది అడ్మిషన్లు పొందే విధానం బీఈడీ విద్యలో ఉంది. ఇదే విమర్శలను పెంచుతోంది. మేనేజ్‌మెంట్ కోటా పేరుతో విద్యార్థులను చేర్చుకుని కాలేజీలకు రాకపోయినా మేనేజ్ చేస్తున్నారని విమర్శలున్నాయి. కాగా ప్రభుత్వం ఇలా జాప్యం చేస్తూ వెళ్తే ఈ ఏడాది బీఈడీ విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉంది. మరో రెండు నెలలు గడిస్తే మళ్లీ 2024-25 విద్యా సంవత్సరానికి ఎడ్‌సెట్ నోటిఫికేషన్ కూడా జారీ అవుతుంది. కానీ అప్పటివరకూ అడ్మిషన్లు అడ్రస్ లేకుండా పోయాయి.

బీఈడీ కాలేజీల తనిఖీ బాధ్యత ఉన్నత విద్యామండలికి ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఈడీ కాలేజీల్లో తనిఖీలు చేపట్టే బాధ్యతను ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ యూనివర్సిటీలు వాటి పరిధిలోని బీఈడీ కాలేజీల్లో తనిఖీలు చేస్తుండగా.. ఇకపై ఆ అధికారాన్ని ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎడ్‌సెట్ పరీక్ష ముగిసిన తర్వాత ఇప్పటికే ఒకసారి తనిఖీలు పూర్తవగా.. ఇప్పుడు రెండోసారి చేపట్టే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు తనిఖీలు ప్రారంభించి, ఆ తర్వాత అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేసేసరికి విద్యార్థులు దాదాపుగా ఏడాది కాలం నష్టపోతారు.

హౌసింగ్‌లో నకి'లీలలు'!

- అర్హతల్లేకున్నా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, ప్రమోషన్లు
- ఉన్నతాధికారులకు ఉద్యోగుల నుంచే ఫిర్యాదుల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 1 నాటికి 5లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు 'మెగా కంప్లీషన్ డ్రైవ్' నిర్వహించడం ద్వారా ఈ టార్గెట్‌ను పూర్తి చేయాలని నిర్ణయించారు. పనులు వేగవంతం చేయాలని నిర్దేశిస్తూ టార్గెట్లు ఇచ్చినా జిల్లాల్లో పనిచేస్తున్న అధికారుల్లో చలనం లేదు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పిస్తే ఉత్సాహంగా పనిచేస్తారన్న ఉద్దేశంతో హౌసింగ్ ఉన్నతాధికారులు ప్రభుత్వ అనుమతితో ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోనూ, 14 జిల్లాల్లోని సబ్ డివిజన్లలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 26మందికి గత నెలలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు పనిచేస్తున్న జిల్లాల్లోనే పోస్టింగ్ ఇప్పించడానికి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆ ఉత్తర్వులను నిలిపివేశారు. తర్వాత తూతూమంత్రంగా విచారణ జరిపించి ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చేశారు. నిలిపివేసిన ప్రమోషన్ల ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం హౌసింగ్ ఈఈలుగా కొనసాగుతున్న ఆ 26మందిలో దాదాపు సగంమంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ప్రమోషన్లు పొందారని ఫిర్యాదులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 56మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు.. డీఈఈలుగా పదోన్నతులు కల్పించేందుకు ఫైల్ సిద్ధమైంది. వీరిలోనూ ఎక్కువమంది రెగ్యులర్ స్ట్రీమ్‌లో ఇంజనీరింగ్ కోర్సులు చదవకుండా, ఎలాంటి సాంకేతిక నైపుణ్యాలు లేకుండా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఏఈలు అయిపోయారని, ఇప్పుడు వారికే డీఈఈలుగా పదోన్నతులు కల్పిస్తుండటంతో ఒరిజినల్ డిప్లొమా హోల్డర్లు అన్యాయమైపోతున్నారంటూ ఉన్నతాధికారులకు కొందరు సంస్థ ఉద్యోగులే ఫిర్యాదు చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సగానికిపైగా ఇంజనీర్లు నకిలీ ఐటీఐ, డిప్లొమా సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సంపాదించినట్లు ఆరోపిస్తున్నారు.


అవినీతిమయంగా పరిపాలన విభాగం

గృహ నిర్మాణ సంస్థలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే నియామకాలు చేపడుతున్నారు. తగిన విద్యార్హతలు లేనివారిని కూడా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల సిఫారసులతో హౌసింగ్ కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్‌లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర కిందిస్థాయి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. ఇలా చేరినవారిలో ఎక్కువమంది కొంతకాలం పనిచేసి కాస్త అనుభవం సంపాదించిన తర్వాత ఐటీఐ, సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సులు పూర్తి చేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి, రెగ్యులర్ ఉద్యోగులైపోతున్నారు. ఆ తర్వాత అడ్డదారుల్లో పదోన్నతులు పొందుతున్నారు. ఇలాంటివారికి హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఇటీవల 26మంది డీఈఈలకు.. ఈఈలుగా ప్రమోషన్లు కల్పించడంలో ఒక యూనియన్ నాయకుడు రింగ్‌మాస్టర్‌గా వ్యవహరించి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేసినట్లు ఆరోపణలున్నాయి. సంస్థలో 30ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేసుకుని ఒక్క ప్రమోషన్‌కు కూడా నోచుకోనివారు ఎంతోమంది ఉన్నారని చెబుతున్నారు. ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంపై లోతుగా విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

చిత్తూరు జిల్లా గుడుపల్లె వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ఆ మండల ఇన్‌చార్జి ఏఈగా పోస్టింగ్ ఇచ్చేందుకు హౌసింగ్ అధికారులు ఈ ఏడాది మే నెలలో అవకాశం కల్పించారు. ఆయనకు తగిన అర్హతలు లేకపోవడంతో అప్పటికప్పుడు నకిలీ సర్టిఫికెట్లు పుట్టించుకుని దరఖాస్తు చేసుకున్నారు. ఆ సర్టిఫికెట్ల నిర్ధారణ కోసం సదరు విద్యాసంస్థకు రిఫర్ చేస్తే అవి నకిలీవని తేలింది. దాంతో ఆయనకు మండల ఇన్‌చార్జి పోస్టు ఇవ్వడం ఆపేశారు. ఇదే జిల్లాలో అప్పటికే 13మందికి పైగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు పొందారని, వారినుంచి జిల్లాస్థాయి అధికారులు రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఉదంతాలు ప్రతి జిల్లాలోనూ ఉన్నాయని సంస్థ ఉద్యోగులే చెబుతున్నారు.

తమిళనాడుకు అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువ నిధులిస్తున్నాం

- తిరుచ్చి బహిరంగ సభలో ప్రధాని మోదీ



చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంపద, సంస్కృతీ సంప్రదాయాల ప్రతిబింబమే తమిళనాడు అని, తమిళభాష అత్యంత ప్రాచీనమైనదని, కనుకనే తాను దేశవిదేశాల్లో పాల్గొనే సభల్లో ఆ భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటుతున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర అని, ఆ దిశగానే విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యనందించి యువకులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తమిళనాడు పర్యటన సందర్భంగా తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త టెర్మినల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తమిళనాడుకు అన్ని రాష్ట్రాల కంటే అధికంగా నిధులు కేటాయిస్తున్నామని మోదీ చెప్పారు. ఇదిలా ఉండగా, చైనా విషయంలో వాస్తవిక విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యమని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. చైనా విషయంలో నెహ్రూ 'రొమాంటిసిజాన్ని' అవలంబించారని, ఆదర్శపూర్వక స్నేహాన్ని ప్రదర్శించారని విమర్శించారు. చైనాపట్ల వాస్తవిక విధానాన్ని అవలంబించాలని వల్లభ్‌భాయ్ పటేల్ చెప్పేవారని జైశంకర్ తెలిపారు.

ఏసీఏలో నిధుల దుర్వినియోగం

- హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో నిధుల దుర్వినియోగం జరుగుతోందని, దీని పరిపాలన కార్యకలాపాల నిర్వహణకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ)ను నియమించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.రవి, క్రికెట్ కోచ్ బి.విజయ్‌కుమార్ ఈ పిటిషన్ వేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులు ఖర్చుపెట్టకుండా కొత్త స్టేడియం నిర్మాణానికి నిధులు ఖర్చుచేయడం లోధా కమిటీ సిఫార్సులకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌పై చర్యలు తీసుకొనేలా బీసీసీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు వద్ద విచారణకు రానుంది.

26న జీఎస్ఎల్వీ ప్రయోగం!

సూళ్లూరుపేట, జనవరి 2: పీఎస్ఎల్వీసీ58 విజయంతో కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించిన ఇస్రో.. ఈ నెలలోనే మరో ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 26న జీఎస్ఎల్వీ ప్రయోగం నిర్వహించడానికి సిద్ధమవుతోంది. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఈ రాకెట్‌లో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ మంగళవారం షార్‌కు తీసుకొచ్చారు.

ఒకప్పుడు కాంగ్రెస్ అనే పార్టీ ఉండేది

- ఆప్ నేత మాన్ తీవ్ర వ్యాఖ్యలు.. 'ఇండియా'లో లుకలుకలు

న్యూఢిల్లీ/కోల్‌కతా, జనవరి 2: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు బహిర్గతమవుతున్నాయి. కూటమి నేతలు ఒకరిపై మరొకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీపై పంజాబ్ సీఎం, ఆప్ నేత భగవంత్ మాన్ విరుచుకుపడ్డారు. చండీగఢ్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి గత వైభవంగా మారిందని, త్వరలోనే పంజాబ్, ఢిల్లీలోని తల్లులు తమ పిల్లలకు "ఒకప్పుడు కాంగ్రెస్ అనే పార్టీ ఉండేది" అని చిన్న కథలుగా చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ దీటుగా కౌంటర్ ఇచ్చింది. 'అప్పట్లో భగవంత్ మాన్ అనే జోకర్ ఉండేవాడు' అని పేర్కొంది. కాంగ్రెస్ రహిత భారత్ గురించి ప్రధాని మోదీ, ఆప్ కలలు కంటున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా మండిపడ్డారు.

కర్ణాటకలో కరసేవకుడి అరెస్టు.. బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయ ప్రారంభ వేళ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త వివాదంలో చిక్కుకుంది. అయోధ్యలో 1992 నాటి రామ మందిర ఉద్యమంలో చోటు చేసుకున్న హింసకు సంబంధించి నమోదైన కేసుల్లో నిందితులను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకోవడం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా హుబ్బళ్లిలో స్థానిక కరసేవకుడు శ్రీకాంత్ పూజారిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే, 30 సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ కేసును తిరగదోడి, రామభక్తులను అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కాగా కరసేవకుడి అరెస్టుపై బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, మతాన్ని లాగుతోందని సీఎం సిద్దరామయ్య విరుచుకుపడ్డారు. పాత కేసులను క్లియర్ చేయాలని న్యాయస్థానాలు చేసిన సూచన మేరకు, అప్పట్లో హింసకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశారని తెలిపారు.

భర్తను కాదని నేరుగా పిల్లలకు ఫ్యామిలీ పెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 2: వివాహ బంధానికి సంబంధించిన కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పుడు మహిళా ఉద్యోగులు తమ ఫ్యామిలీ పెన్షన్ భర్తకు బదులు పిల్లలకు చెందేలా ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. పిల్లలను నామినీగా పెట్టుకోవచ్చు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. విడాకుల పిటిషన్, భర్తపై గృహ హింస నిరోధక చట్టం కింద పెట్టిన కేసులు, వరకట్నం కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు మహిళా ఉద్యోగులు ఇలాంటి నిర్ణయం తీసుకోవచ్చు.

అయోధ్యకు కానుకలుగా బియ్యం,కూరగాయలు

అయోధ్య, జనవరి 2: అయోధ్యలో ఈ నెల 22న జరిగే ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా భక్తులు బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర ఆహారపదార్థాలను కానుకలుగా పంపుతున్నారు. మొత్తంగా ఇప్పటి వరకు దాదాపు 300 టన్నుల బియ్యాన్ని భక్తులు అయోధ్యకు పంపినట్లు సమాచారం. రామాలయ ప్రారంభోత్సవానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారని, ఆ రోజు భక్తులందరికీ అన్నదానం చేయాలని ఆలయ కమిటీ భావిస్తోంది.

మెట్టు దిగిన హమాస్

- గాజాలో పాలస్తీనా అథారిటీ సర్కారుకు ఓకే

ఇజ్రాయెల్‌పై భీకర పోరు చేస్తున్న హమాస్ ఉగ్ర సంస్థ ఎట్టకేలకు మెట్టు దిగింది. వెస్ట్‌బ్యాంక్‌తోపాటు.. గాజాలో పాలస్తీనా అథారిటీ ప్రభుత్వ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసింది. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అంగీకరిస్తామని హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతి ఇస్మాయిల్ హనియే మంగళవారం ప్రకటించారు. "ఈ నిర్ణయం వెనక ఖతార్, ఈజిప్ట్ మధ్యవర్తిత్వం ఉంది. యుద్ధంతో అమాయక పౌరులు చనిపోతున్నారు. వారి కోసం కాల్పుల విరమణను కోరుతున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ నుంచి అపహరించిన బందీలను అప్పగించడానికి.. తమ ఖైదీలను విడుదల చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. బందీలు-ఖైదీల మార్పిడి జరగాల్సిందేనన్నారు. పాలస్తీనా అథారిటీ సర్కారు డిమాండ్‌కు హమాస్ అంగీకరించడంతో.. యుద్ధం ముగిసే అవకాశాలున్నట్లు ఈజిప్ట్ తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని మిశ్రిఫియాలోని హిజ్బుల్లా షెల్టర్‌లో హమాస్ అగ్రనేతలు తలదాచుకున్నారనే సమాచారంతో ఐడీఎఫ్ మంగళవారం ఆ ప్రాంతాలపై రాకెట్ల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో హమాస్ పొలిటికల్ బ్యూరో డిప్యూటీ చీఫ్ సలేహ్ అల్-అరౌరీ హతమయ్యాడు. కాగా, ఇజ్రాయెల్ సైన్యంలోని గివాటి బ్రిగేడ్‌లో డివిజన్ కమాండర్ హరేల్ ఇటా.. ఓ నవజాత శిశువును గాజా స్ట్రిప్ నుంచి అపహరించడంపై ఆధారాలు లభించాయని ఐడీఎఫ్ మంగళవారం ధ్రువీకరించింది.

\- సెంట్రల్ డెస్క్

పకడ్బందీగా 'పీఎం జన్‌మన్'

- 15న అల్లూరి జిల్లా ఆదివాసీలతో ప్రధాని వర్చువల్ భేటీ
- సీఎస్‌లతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఆదివాసీ, మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు.. ప్రత్యేకంగా ట్రైబల్ గ్రూపులు(పీవీటీజీఎస్) సంక్షేమం కోసం గత నవంబరులో ప్రధాని మోదీ ప్రారంభించిన జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం(పీఎం జన్‌మన్) పకడ్బందీగా అమలు చేయాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ రాష్ట్రాలకు సూచించారు. వివిధ రాష్ట్రాల సీఎస్‌లతో మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన ప్రధాని మోదీ వర్చువల్‌గా పీవీటీజీ గ్రూపుల లబ్ధిదారులతో మాట్లాడతారని తెలిపారు. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్త భల్లుగుడ, పాత భల్లుగుడ ఆవాసాలకు చెందిన ఆదివాసీలతో మాట్లాడతారని చెప్పారు. సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 3,526 పీవీటీజీ ఆవాసాల్లోని లక్షా 13 వేల 866 కుటుంబాల్లో 4,37,447 మంది పీవీటీజీ జనాభా ఉన్నారని పేర్కొన్నారు. వారికి వివిధ పథకాల లబ్ధి మిషన్ మోడ్‌లో పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయాశాఖల కార్యదర్శులను ఆదేశించారు.

మద్యం స్కాంలో బీజేపీ, వైసీపీ లాలూచీ: సీపీఐ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మొదలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఫిబ్రవరిలో ఎన్నికల ఎత్తులు, పొత్తులు, సీట్ల సర్దుబాటుపై నిర్ణయాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే దేశంలో మతోన్మాద బీజేపీ, రాష్ట్రంలో నిరంకుశ జగన్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు ఇండియా కూటమిని బలోపేతం చేయడమే లక్ష్యంగా మా పార్టీ ముందుకెళుతుంది. రాష్ట్రంలో వైసీపీ, తెలుగుదేశం, జనసేన ప్రధాని మోదీకి భయపడుతున్నాయి. మద్యం కుంభకోణంలో బీజేపీ, వైసీపీ లాలూచీ పడ్డాయి. వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరితే.. వైసీపీలోని అసంతృప్తులు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది' అని తెలిపారు. బుధ, గురువారాల్లో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో అగ్రిగోల్డ్ బాధితులు తలపెట్టిన 30 గంటల నిరసన దీక్షలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు.

వైజాగ్ గ్యాంగ్ రేప్ ఘటన బాధాకరం: మాణిక్యం ఠాగూర్

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం గ్యాంగ్ రేప్ ఘటనపై ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు ఏపీలో మహిళల భద్రతపై ఆందోళన రేకెత్తిస్తున్నాయని అన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడినవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

విజయవాడ కోర్టుకు నాగం జనార్దన్‌రెడ్డి హాజరు

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు మంగళవారం హాజరయ్యారు. ఆయనతోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి దేవినేని ఉమ వచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అనంతపురం జిల్లా ఓబులాపురంలో ఐరన్ ఓర్ తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నాయని ఆందోళన చేశారు. గాలి జనార్దన్‌రెడ్డి మైనింగ్ పేరుతో సరిహద్దులను చెరిపేశారని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. ఆనాడు నాగం టీడీపీలో ఎమ్మెల్యేగా ఉన్నారు. దీనిపై అనంతపురం పోలీసులు 2009లో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ ప్రజాప్రతినిధుల కోర్టులో జరుగుతోంది.

కాంగ్రెస్‌లోకి షర్మిల.. వైసీపీకి సంకటం: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడం.. వైసీపీకి ప్రాణసంకటంగా మారనుందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. వైసీపీకి జనవరి నాలుగో తేదీ చీకటి రోజుగా మారనుందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సారథ్య బాధ్యతలను షర్మిల స్వీకరించిన తర్వాత ఎంతోమంది కాంగ్రెస్ నేతలు సొంతగూటికి చేరే అవకాశం ఉందని తెలిపారు. వైసీపీ టికెట్ దక్కని సుమారు 40 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నారని తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ నుంచి వైద్యులకు మినహాయింపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు(ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేస్తోంది. అయితే, ఆరోగ్యశాఖలోని బోధనాసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులకు ఎఫ్ఆర్ఎస్ నుంచి తాజాగా మినహాయింపు ఇచ్చింది. ఈనెల 1 నుంచి అమలు చేస్తున్నట్లు డీఎంఈ సర్క్యులర్ జారీ చేసింది. బోధనాసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లకు ఈ మినహాయింపు ఇచ్చారు. తమకూ మినహాయింపు కల్పించాలని ఇతర ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

జగన్‌కు పెన్షనర్ల ఉసురు: ఆనంద్‌సూర్య

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతా పింఛన్ల చెల్లింపును కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న జగన్‌రెడ్డికి అవ్వాతాతల, దివ్యాంగుల, వితంతువుల ఉసురు తగులుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య హెచ్చరించారు. సీఎం జగన్‌రెడ్డి 57 నెలల్లో సామాజిక పింఛన్‌ను కేవలం రూ.750 మాత్రమే పెంచి, సొంత పత్రికకు ప్రకటనల రూపంలో 100 కోట్లు దోచిపెట్టాడని మంగళవారమిక్కడ ఆరోపించారు.

కేడర్ కేటాయింపు అధికారం క్యాట్‌కు లేదు: టీ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత అధికారుల (ఐఏఎస్, ఐపీఎస్)ను రాష్ట్రాలకు కేటాయించే అధికారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)కు లేదని, క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై తాము అప్పిలేట్ అథారిటీగా వ్యవహరించలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రవిభజన సందర్భంగా ఏపీకి కేటాయించినా తెలంగాణలో కొనసాగుతున్న అధికారుల వ్యవహారంపై మంగళవారం జస్టిస్ అభినందన్ కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ' సోమేశ్ కుమార్ ' తీర్పును జవదాటలేమని తెలిపింది. ఏపీ, తెలంగాణ మధ్య అధికారుల విభజనకు కేంద్ర జారీచేసిన మార్గదర్శకాలను హైకోర్టు ఇప్పటికే సమర్థించిందని వ్యాఖ్యానించింది. ఉమ్మడి ఏపీ విభజన పూర్తయిన తర్వాత పదేళ్లుగా తెలంగాణలో పనిచేస్తున్న అధికారుల సర్వీసు, వయస్సు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని.. నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తామని తెలిపింది. అధికారుల తరఫున న్యాయవాదులు సుధీర్, లక్ష్మీనర్సింహ, గోడ శివ తదితరులు వాదనలు వినిపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

బీఆర్ఎస్‌కు పలువురు ఏపీ నేతల రాజీనామా

విజయవాడ, జనవరి 2: బీఆర్ఎస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు నేతలు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని, ఆ పార్టీ ద్వారా ఏపీ అభివృద్ధి, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే ఆలోచనతో ఆ పార్టీలో చేరామన్నారు. రాష్ట్రంలో పార్టీకి మార్గనిర్దేశనం చేసే నాయకుడు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు.


26 డీఎల్‌డీఓ పోస్టులు మంజూరు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 26 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులను మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒక్కో డీఎల్‌డీఓ అధికారి ఉంటారు. ఆర్డీఓలు రెవెన్యూ కార్యక్రమాలు ఎలా చూస్తారో?, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీరాజ్ కార్యకలాపాలు డీఎల్‌డీఓలు నిర్వర్తిస్తారు. జిల్లాలు పెరగడంతో రెవెన్యూ డివిజన్లు కూడా 51 నుంచి 77కు పెరిగాయి. దీంతో కొత్తగా ఏర్పడిన 26 రెవెన్యూ డివిజన్లకు డీఎల్‌డీఓ పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

సాగర్ డ్యాంపై మూతపడిన కంట్రోల్ రూమ్

మాచర్ల, జనవరి 2: నాగార్జున సాగర్ డ్యాంపై నెలకొన్న జలవివాదంతో డ్యాం కంట్రోలు రూం మూతపడింది. దీంతో నీటి లెక్కలు తీసేందుకు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం డ్యాం పర్యవేక్షణ సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉండడంతో ఇరురాష్ట్రాల ఎస్ఎస్‌పీ అధికారులు 13వ గేటు వరకు మాత్రమే వస్తున్నారు. కాగా ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేటు తర్వాత ఉన్న కంట్రోల్ రూంలో కుడి, ఎడమ కాలువలకు సంబంధించిన నీటి వివరాలను డీఈ, ఏఈ, ఇతర సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంది. అయితే జలవివాదం కొలిక్కి రాకపోవడంతో నెల రోజులుగా కంట్రోల్ రూమ్ మూతపడింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 3 జనవరి 2024



భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

1600 సంవత్సరంలో ప్రారంభం అయిన ఈస్టిండియా కంపెనీ గురించి తెలుసుకున్న తరవాత, 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1781 విస్తరణ చట్టం, 1784 పిట్స్ ఇండియా చట్టం గురించి తెలుసుకోవాలి. 1600 నుంచి 1784 మధ్య కాలంలో ఇతర అంశాలను ఆధునిక భారతదేశ చరిత్రతతో అనుసంధానం చేసుకోవాలి. 1793 చార్టర్ చట్టం నుంచి 1853 చార్టర్ చట్టం వరకు ఉన్న నాలుగు చట్టాలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలి. అదేవిధంగా 1858 భారత రాజ్యాంగ చట్టం అర్థం చేసుకున్న తరవాత 1909, 1919 చట్టాలను పరిశీలించాలి. అనంతరం 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 1793, 1813, 1833, 1853, 1909, 1919, 1935 చట్టాల్లోని ఈస్టిండియా కంపెనీ, బ్రిటిష్ పాలన పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవాలి. ఆధునిక భారతదేశ చరిత్ర చదివిన అనంతరం ఈ చట్టాలను చదవడం అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

రాజ్యాంగ పరిషత్ ఎన్నికల నుంచి భారత రాజ్యాంగం ఆమోదం పొందే వరకు జరిగిన పరిణామాలను వరుసక్రమంలో అభ్యర్థులు గుర్తుంచుకోవాలి. అలాగే దేశవిభజన అనంతరం రాజ్యాంగ పరిషత్‌లో వచ్చిన మార్పులపై కూడా దృష్టి సారించాలి. ఆబ్జెక్టివ్ తరహా పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు రాజ్యాంగ పరిషత్‌కు సంబంధించిన భిన్న కమిటీలు, వాటి ఛైర్మన్‌లు, ముసాయిదా కమిటీకి సంబంధించిన ఫ్యాక్ట్స్ గుర్తుంచుకోవాలి. రాజ్యాంగ పరిషత్‌పై వచ్చిన విమర్శలను కూడా పరిశీలించాలి.

చార్టర్ అంటే ఒప్పందం

రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడానికి ఆ దేశ పూర్వ పరిస్థితులను అధ్యయనం చేయడం చాలా అవసరం. భారత రాజ్యాంగానికి సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇండియాలో వ్యాపార నిమిత్తం ఈస్టిండియా కంపెనీకి సంబంధించి బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఒక చార్టర్ ద్వారా 1600 డిసెంబరు 31న అనుమతిని ఇచ్చింది. చార్టర్ అంటే ఒప్పందం అని అర్థం. భారతీయ పరిపాలన వ్యవస్థ ప్రధానంగా బ్రిటిష్ పరిపాలన విధానాన్నే అనుసరించి ఉంటుంది(బ్రిటిషర్లు ఇండియాను కొన్ని వందల సంవత్సరాలకు పైగా పరిపాలించడం వలన వారి విధి, విధానాలు భారతదేశాన్ని ప్రభావితం చేశాయి). భారత రాజ్యాంగ పూర్వ చరిత్రపై పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు అనేక సందేహాలు ఉత్పన్నం అవుతాయి. చాలా మంది అభ్యర్థులు ఆధునిక భారతదేశ చరిత్రను, రాజ్యాంగ పరిణామక్రమాన్ని ఒకటిగానే భావిస్తారు. పాలిటీ విభాగంలో 1600 సంవత్సరంలో ఈస్టిండియా కంపెనీ(బ్రిటిష్) ప్రారంభం అవడం గురించి తెలుసుకొని, ఆ తరవాత 1773 రెగ్యులేటింగ్ చట్టం నుంచి కీలకమైన చట్టాల గురించి తెలుసుకోవాలి.

ఉదా:- 1773, 1793, 1813, 1853, 1858, 1861, 1909, 1919, 1935 మొదలైనవి.

అభ్యర్థులు ఆధునిక భారతదేశ చరిత్రపై పట్టు సాధించిన అనంతరం ఈ చట్టాల గురించి తెలుసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఈ చట్టాలను అర్థం చేసుకునే క్రమంలో వచ్చిన క్రమానుగత మార్పులను కూడా అవగతం చేసుకోవాలి. ఆ తరవాత 1946లో రాజ్యాంగ పరిషత్ ఎన్నికల అనంతరం, 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు జరిగిన పరిణామాలను తెలుసుకోవాలి.

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ

1600 డిసెంబరు 31న భారతదేశంలో వ్యాపారం చేసుకోవడం కోసం ఈస్టిండియా కంపెనీ బ్రిటిష్ రాణి అనుమతి పొందింది.(ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో వ్యాపారం కోసం ఏకస్వామ్య హక్కులను పొందింది అని గమనించాలి). ఆర్థికంగా బలమైన మూలాలు కలిగిన ఈస్టిండియా వ్యాపారాన్ని విస్తరించి క్రమంగా భారత భూభాగాలపై పాలనాపరమైన పట్టు సాధించింది. ఆ క్రమంలోనే 1639లో మద్రాస్‌ను, 1668లో బొంబాయిని, 1698లో బెంగాల్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. ఆ తరవాత కూడా ఈస్టిండియా కంపెనీ అనేక భారత భూభాగాలపై తన పాలనాపరమైన ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆ క్రమంలో ఏకస్వామ్య హక్కులు కలిగిన ఈస్టిండియా కంపెనీ భారత్‌లో అవినీతి కార్యకలాపాలు, లంచగొండితనానికి పాల్పడింది. అలాగే ఉన్నతస్థాయి ఉద్యోగులు కూడా భారత పౌరుల నుంచి బలవంతంగా బహుమతులు కోరేవారు. ఇలాంటి కార్యకలాపాలను నివారించడానికి బ్రిటిష్ పార్లమెంట్ 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేసింది.

రాజ్యాంగ అభివృద్ధి క్రమమం

భారత రాజ్యాంగ చరిత్ర బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ పాలనలో క్రీ.శ.1600లో ప్రారంభమైంది. ఇండియాలో రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని ఆరు దశలుగా అధ్యయనం చేయవచ్చని 'బి.సి.రావత్' అభిప్రాయం.

1వ దశ: క్రీ.శ. 1600 - 1773 **2వ దశ:** క్రీ.శ. 1773 - 1858 **3వ దశ:** క్రీ.శ. 1858 - 1909
4వ దశ: క్రీ.శ. 1909 - 1919 **5వ దశ:** క్రీ.శ. 1919 - 1935 **6వ దశ:** క్రీ.శ. 1935 - 1947

1773 రెగ్యులేటింగ్ చట్టం - ముఖ్యాంశాలు

రెగ్యులేట్ అంటే నియంత్రణ. బ్రిటిష్ పార్లమెంట్ ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను నియంత్రించడానికి చేసిన చట్టం కాబట్టి, దీన్ని రెగ్యులేటింగ్ చట్టం అంటారు. రెగ్యులేటింగ్ చట్టం- 1773 భారతదేశానికి సంబంధించి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం. ఈ చట్టంలోని ముఖ్యాంశాలు....

- కలకత్తాలోని పోర్టు విలియంలో సుప్రీం కోర్టు ఏర్పాటుకు ఈ చట్టం ఆధారం
- బెంగాల్ గవర్నరును గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా పదోన్నతి కల్పించారు (బొంబాయి, మద్రాస్ ప్రాంతాల గవర్నర్‌లు బెంగాల్ గవర్నర్ జనరల్‌కు అధీనులుగా మారారు).(మొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ - వారెన్ హేస్టింగ్స్).
- ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు ప్రైవేట్ వ్యాపారం చేసుకోవడం, స్థానికుల నుంచి లంచాలు, బహుమతులు తీసుకోవడాన్ని నిషేధించారు.
- ఈస్టిండియా కంపెనీ పాలకమండలి సభ్యులైన కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ భారతదేశంలో రెవెన్యూ, సివిల్, మిలిటరీ వ్యవహారాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక పంపాలి.
- 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసినప్పటికీ ఈస్టిండియా కంపెనీ లంచగొండితనాన్ని, అవినీతిని, బహుమతులు స్వీకరించడాన్ని బ్రిటిష్ పార్లమెంట్ నివారించలేకపోయింది. ఫలితంగా 1784 బ్రిటన్‌లో విలియం పిట్స్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పిట్స్ ఇండియా చట్టం రూపొందించారు.

వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు




రహస్య మార్గం


ఒక రాజ్యంలో విశ్వక్సేనుడు అనే రాజు ఉండేవాడు. ధీరుడు, శూరుడు, వీరుడు. అతని పేరు పొరుగు రాజ్యాలకు హడల్. తనకోటను చూడటానికి కూడా శత్రువులు చూసేవారు కాదు. అంతటి బలమైన సైన్యం అతనికి ఉండేది. అతనికి విశ్వుడు, వినయుడు అనే కుమారులుండేవారు. విశ్వుడు తన తండ్రి మాదిరే సాహసి. రాజ్యభావన మెండు. ఎప్పటికైనా తానే రాజును అవుతాననే నమ్మకం ఉండేది. అందుకే అతన్ని రాజుగారు ప్రోత్సహించేవారు.

రాజుగారి చిన్నకొడుకు తీరు మరొకటి. అతనికి భయాలు ఎక్కువ. వినయుడుకి విధేయత, వినయం లేకపోగా భీతి, భయం, అసహనం ఉండేవి. పిరికివాడు, బలహీన మాటలు మాట్లాడేవాడు. రాజుగారికి చిన్న కొడుకంటేనే విపరీతమైన కోపం ఉండేది. రాజ్యాన్ని నిలబెట్టే శక్తి అతనికి లేదని తెలుసు. ఒక రోజు సభలో ఉండగా చిన్న, పెద్దకొడుకులు ఇద్దరూ రాజు ఎదురుగా ఉన్నారు. వాళ్ల పరాక్రమాల్లో పెద్ద కొడుకే పరాక్రమవంతుడని ప్రజలకున్న నమ్మకాన్ని చవిచూశాడు.


సభలోంచి ఇంట్లోకి వెళ్లినవెంటనే వినయుడు తన తండ్రి దగ్గరకు వెళ్లి.. 'నాన్న.. ప్రతి రాజ్యంలో, ప్రతి కోటలో రహస్య మార్గాలు ఉంటాయి కదా?' అన్నాడు. 'అవును..' అన్నాడు రాజుగారు. 'అయితే తక్షణమే చూస్తాను' అని




కోరాడు. 'నాకు, మంత్రికి తప్ప ఎవరికీ తెలియకూడదు. దాని సమయం వచ్చాక చెబుతాను' అన్నాడు. అంతలోనే రాజుగారి భార్య కలగచేసుకుని చిన్న కొడుకంటే అంత అలుసు ఎందుకో? అన్నది. వెంటనే మంత్రితో కలసి రాజు వారి రహస్య మార్గాన్ని చూడటానికి బయలుదేరాడు. తనతోనే చిన్న కొడుకును తీసుకెళ్లాడు. కోటలో ఉండే రహస్య మార్గం చూశాక.. కొడుకు ఆశ్చర్యపోయాడు. 'ఇక పోదాం.. నీకెందుకు' అన్నాడు రాజుగారు. 'ఏమీ లేదు నాన్నగారు.. మన దేశంమీదకు శత్రుమూకలు వస్తే.. మనం చచ్చిపోతాం కదా. అందుకే తప్పించుకుపోవటానికి ఈ మార్గం తెలిసి ఉండాలి కదా.. మనకు' అన్నాడు. కోటలోని రహస్యమార్గంలో కొద్దిగా కిందకు దిగాడు వినయుడు. ఏమాత్రం ఆలోచించకుండా రాజుగారు ఆ తలుపు మూసేశారు. పది నిముషాల తర్వాత కొడుకు వచ్చి తలుపు గట్టిగా కొట్టాడు.. 'తీయండి' అని అరుస్తూ. రాజుగారు ఇలా గట్టిగా పక్కన ఉండే చిన్న కిటికీలోంచి ఇలా అన్నాడు.. 'నీలాంటి పిరికిపందకు రాజు అయ్యే అవకాశం లేదు. ఆ రహస్య మార్గంలో వెళ్లు. ఇంకో రాజ్యం వస్తుంది. అక్కడ ఏదైనా పని చేసుకుని బతుకు. అంతేకానీ రాజుగా తిరిగి రావద్దు' అన్నాడు.



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 194

		2	4	5	8			
				9				
	3	7				8		
5				1	7			8
	6			4			2	
3			8	2				4
		1				5	6	
				7				
			6	8	1	9		

సుడోకు - 193 సమాధానం

8	2	9	4	5	3	1	6	7
7	5	1	9	8	6	2	4	3
4	6	3	7	2	1	8	5	9
1	8	7	2	4	5	9	3	6
6	9	2	8	3	7	4	1	5
5	3	4	1	6	9	7	2	8
2	1	6	3	9	8	5	7	4
3	4	8	5	7	2	6	9	1
9	7	5	6	1	4	3	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

28 నుంచి గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్

లీడర్‌షిప్ సమ్మిట్

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు యుఎం-మార్సల్ గ్లోబ్‌స్టార్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్ న్యూఢిల్లీ, ముంబై నగరాల్లో జరుగనుంది. ఇండియన్ ఎడ్యుకేటర్స్, స్కూల్ లీడర్ల కోసం దీన్ని ఉద్దేశించారు. మిచిగాన్‌కు చెందిన యుఎం మార్సల్ ఫ్యామిలీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో కలిసి గ్లోబ్‌స్టార్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. మిచిగాన్ విశ్వవిద్యాలయానికి తోడు టౌబ్‌కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ ప్లానింగ్‌లోని మార్సల్ ఫ్యామిలీ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ సభ్యులు ఇందులో పాల్గొంటారు. వర్క్‌షాప్‌లు, పాఠశాల సందర్శన, కేస్ స్టడీస్, ప్యానల్ డిస్కషన్స్ ఈ సమ్మిట్‌లో భాగంగా ఉంటాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు

లేట్ పాస్‌లు: రూ.1,50,000 (చెల్లింపునకు చివరి రోజు జనవరి 12)

స్కూల్ ప్యాకేజీ: రూ. రూ.3,25,000(ఒక్కో నగరంలో గరిష్ఠంగా పది పాఠశాలలు అందుబాటులో ఉంటాయి) (ఫీజుపై 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.)

వెబ్‌సైట్: https://globestarcs.com/ummarsa-l-globestareducationsummit2024

ఈమెయిల్: info@globestarcs.com

ఫోన్ నెంబరు: +9191678 64136/37

సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ



సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తి చేయాలి. స్టయి పెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్ఎఫ్ (యూజీసీ/సీఎస్ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్ అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in

SCHOLARSHIP ALERT



Nehru Trust's UK Travel Awards 2024

Description: Nehru Trust's UK Travel Awards 2024 is an opportunity offered by the Nehru Trust for the Indian Collection at the Victoria and Albert Museum (NTICVA), for scholars or professionals working in museums, galleries, universities, or other specified institutions concerned with the preservation, study, and display of India's art and cultural heritage.

Eligibility: Open for Indian citizens who scholars or professionals working in museums, galleries, universities or other specified institutions concerned with the preservation, study and display of India's art and cultural heritage.

Prizes & Rewards: Up to £1,000 (one-time)

Last Date to Apply: 15-02-2024

Application mode: via email or post at: The Secretary Nehru Trust for the Indian Collections at the Victoria & Albert Museum The School of Arts and Aesthetics SAA Building II Jawaharlal Nehru University New Delhi - 110067 India; Email ID: info@nehrutrustvam.org

Short Url: www.b4s.in/aj/NUT1

ADB Internship Program 2024

Description: ADB Internship Program 2024 is an opportunity offered by the Asian Development Bank (a regional development bank, headquartered in the Ortigas Center located in the city of Mandaluyong, Metro Manila, Philippines), to students enrolled in master's or Ph.D. degrees.

Eligibility: Open for ADB member countries national including India who are enrolled in a master's or Ph.D. level program. Students must have an excellent command of English and be engaged in academic study in a field related to ADB's work. Applicants must have professional experience relevant to the assignment.

Prizes & Rewards: Stipend for the duration of the internship

Last Date to Apply: 15-02-2024

Application: Online Only *Short Url:* www.b4s.in/aj/ADBI6

Colgate Keep India Smiling Scholarship Programme

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.

Prizes & Rewards: Financial assistance of 75,000

Last Date to Apply: 31-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSI3

Nikon Scholarship Program 2023-24

Description: An initiative of Nikon India Private Limited to financially support students from underprivileged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1 lakh

Last Date to Apply: 15-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/NSP10

buddy4study.com